

సృజన

1984 ఆగస్టు

154

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

154 | మాసపత్రిక | ఆగస్టు 1984

ముఖచిత్రం : ఆగస్టు 15 ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం
పోలీసు రాజ్యం తుపాకి రాజ్యం

నిర్వహణ	సృజన	ఈ సంచిక రు. 3
సాహితీ మిత్రులు	హనుమకొండ 506 001.	సంవత్సరచందా రు. 20

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd
Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Printed, Edited & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal

హిందువులలో దేవుళ్లకే తప్ప దేవతలకు అవతారాలులేవు. దేవతలకు వహించే అధికారం మాత్రమేవుంది. అదిగూడ తక్కువజాతి దేవతలుగా పరిగణిం బడే గ్రామీణదేవతలకే, లక్ష్మి సరస్వతీ ఎవ్వరినీ అవహించరు. నిజానికి వాళ్లగూడ కప్పుడు గ్రామీణదేవతలే, కాని పితృస్వామిక హిందూ సంస్కృతి వాళ్లను తన వుళ్లకు పెళ్లాలుగా స్వీకరించి కాళ్లకు మట్టెలుతొడిగి ముత్తయిదువులను చేసింది. ప్పుడిక వాళ్లకు అవహించే అధికారంగాని వాళ్లను ఆవాహన చేసుకోవాల్సిన వసరంగాని ఏముంటాయి.

కలకత్తా కాళిక ఇవాళ్ల బెంగాల్‌లో అందరిదేవతా అయినా స్వభావరీత్యా ఆమె ్రామదేవతే. సత్యభామలాగ మొగుడిపక్కననిలబడి నాజూగ్గా బాణంవేయకుండ, ళిక స్వయంగా మహిషాసురుడి వేడి రక్తంలో చేతులు తడిపింది. ఫ్యూడల్ పాలక ర్గాల వైదిక సంస్కృతిలో ఆమెస్థానం తక్కువదే అయినా, అన్యాయాన్ని హత మార్చి లోకరక్షణగావించిన మాతృమూర్తికి చిహ్నంగా ప్రజాసామాన్యం చైత న్యంలో నిలిచిపోయింది. మగదేవుళ్లెందరో రాక్షసులను చంపారు. కాని ఫ్యూడల్ తన్యంలో మాతృమూర్తిగా భావించబడే స్త్రీ తన సంరక్షక కర్తవ్యంలో, స్త్రీలకు హజం అనిపించుకున్న అబలస్వభావాన్ని జయించి పోరుకు తలపడడం అనేది ఆ చైతన్యంలో ఒక ప్రత్యేకమయిన విలువను కలిగి వుంటుంది.

ప్రజలలో ఇంకా చాలా బలంగా నిలిచివున్న ఈ విలువలను కమ్యూనిస్టులు తికి వెతికి ఆశ్చర్యార్థకంతో గుర్తిస్తున్నారుగాని, మన పాలకవర్గాలకు వాటితో బాగా రిచయం. 1920లలో గాంధీ మహాత్ముడు జాతీయోద్యమరంగంలోకి దూకి ఉత్తర రతదేశంలో చాలా ప్రభావవంతమయిన తులసీ రామాయణంనుండి సంకేతాలనూ పమానాలనూ వాడుకోవడం మొదలుపెట్టిన నాటినుండీ ఈ నాటివరకు ఈ విలువల దనే వాళ్ల ఆధిపత్యం నడుస్తోందంటే అందులో సగం మాత్రమే అతిశయోక్తి. ప్రజలను బంధించడానికి జైళ్లెంత భద్రమయిన సాధనాలో ప్రజల విశ్వాసాన్ని జిక్కించుకోవడానికి ఈ విలువలు అంత భద్రమయిన బంధనాలు.

ఇందిరాగాంధి అధికారానికి వచ్చిన నాటినుండీ, ప్రజలమద్దతు అవసర మయినప్పుడల్లా కాళిక రూపందాల్చడంకోసం రాక్షసులను వెతుక్కుంటూవుంది. ంగ్రెస్‌ను చీల్చి ఒక బలహీనవర్గంగా బయటపడ్డప్పుడు ప్రైవేట్ బ్యాంకులూ

ం
్యం
ిక రు. 3
ందా రు. 20
ries in th
adesh, Hyd
Mithrulu
al - 506 002

రాజభరణాలూ మహిషాసురుడి పాత్ర నిర్వహించాయి. ఆ తరువాత 1971 ఎన్నిక లప్పుడు యాహ్యాఖాన్ దొరికాడు. 1980లో జనతావాళ్లు తమంతటతామే రాక్షస రూపందాల్చి ఆమెకు శ్రమ తప్పించారు. ఇప్పుడిక డిసెంబర్‌లో రావాల్సిన ఎన్నిక లకు భింద్రన్‌వాలె మహిషాసురుడు. చరిత్ర పునరావృతమయితే అభాసగా మాత్రమే అవుతుందన్న అభిప్రాయం హెగెల్‌కు అంటగట్టబడింది ప్రజాభిప్రాయంలో గూడ 'ఏదయినా ఒకసారి సాధ్యమవుతుందిగాని మళ్లీమళ్లీ అదే ప్రయత్నంచేస్తే అవు తుందా....' అంటారు. ఈ లోకోక్తినీ ఆ ప్రాభావి ఉక్తినీ రెండింటినీ అబద్ధంచేస్తూ ఇందిరమ్మ మరొక్కసారి విజయం సాధించింది. వందే మాతరం!

కాని భింద్రన్‌వాలేనీ అతనితో బాటు మరికొన్ని వందల మందినీ చంపడం వల్ల ఉన్న ప్రయోజనం కేవలం ఎన్నికలకు పరిమితమయిందనుకుంటే పొరబాట వుతుంది. గత ఆగస్టు 15 జెండావందనానికీ ఈ ఆగస్టు 15 జెండా వందనానికీ మధ్య జరిగింది కేవలం మరికొన్ని వందల అధికార హత్యలు మాత్రమే కాదు, ఆ అధికారం మరిన్ని హత్యలు చేయడానికి కావలసిన బలాన్ని కూడ సమకూర్చు కుంది. దేశభద్రతగా చెలామణీ అయ్యే ఆ అధికారం భద్రతకు ఇంకెంతమాత్రం ఢోకా లేకుండా చేసుకుంది. మూడువన్నెలజెండా ఈసారి ఆనందంగా రెపరెప లాడుతుంది.

జాతీయ భద్రతాచట్టాన్ని రెండుసార్లు సవరించి, అత్యధిక నిర్బంధకాలాన్ని రెండేళ్లకు పొడిగించారు. నిర్బంధానికిచూపే కారణాలలో ఏ ఒక్కటి సవ్యంగావున్నా నిర్బంధం సక్రమమేనని చెప్పారు. టెరరిస్టు ప్రాంతాల ఆర్డినెన్సు జారీ చేసారు, దేశంలో ఏ ప్రాంతాన్నయినా ప్రభుత్వం ఆరునెలలు వెనక్కిగూడ టెరరిస్టు ప్రాం తంగా ప్రకటించవచ్చు. ఆ ప్రాంతంలో కేవలం ఉన్నందుకే ఎవరిమీదనయినా 'పోలీసులమీద దాడి చేసారు'ని కేసుపెట్టవచ్చును. చేయలేదని నిందితుడే రుజువు చేసుకోవాలి. ఈ కేసులు విచారించడానికి స్పెషల్ కోర్టులు పెడతారు. ఆ కోర్టులకు చాలా స్పెషల్ లక్షణాలుంటాయి ఆ కోర్టులో ఎవడయినా 'అప్రూవర్' అయితే అతడిని క్షమించే అధికారంగూడ కోర్టుకు ఇస్తున్నారు. ఇంతకాలం పోలీసులకు అనధికారికంగావున్న ఈ అధికారం ఇప్పుడు అధికారికంగా కోర్టులకు ఇవ్వబడు తోంది. ఇంక దేశంలో ఎవరినుండీ జెండాకు భయంలేదు. అందుకే ఈ ఆగస్టు 15 నాడు జెండా ఆనందంతో రెపరెపలాడుతుంది.

'జెండా ఊంఛా రహే హమారా!'

మీరు 'టెరరిస్టు' అనే మాటవిని దడుసుకునే సాధారణ పౌరులే అయినా మీకు కొన్ని అనుమానాలు వస్తాయి. అంతలోనే ఇంత ఆనందం ఎందుకు, దేశానికి ఇంకా చాలా సమస్యలులేవా అని మీరు అడుగుతారు. బొంబాయిలోనూ హైదరాబాదులోనూ మతకల్లోలాల మంటలు ఎంత వరకు చల్లబడ్డాయని ప్రశ్నిస్తారు. జెండా మీకు సమాధానం చెప్పదు. బొంబాయిసంగతి అలావుంచి హైదరాబాద్‌లో మతకల్లోలం ఎన్నికల కల్లోలమే కాబట్టి ఈ సంవత్సరంపొడవునా సాగుతూనే వుంటుంది. లోకసభ ఎన్నికలదాకా ఇవ్వాళ ఇద్దరూ రేపు ముగ్గురూ బోనాల పేరిటనో బొక్కల పేరిటనో చస్తూనే వుంటారు. బూర్జువా రాజకీయాల ముఠాతగాదాలకు పుణకలు పేర్చిన నాదే ఈ చావులు పరిసమాప్తమవుతాయి. ఈ మాట అంటే పవిత్ర భారత ఎన్నికల సంప్రదాయాన్ని అగౌరవపరచడం అవుతుంది. అందుకే జెండా సమాధానం చెప్పదు.

మీకు వేరే సమస్యలు గూడతోస్తాయి. ఖరీఫ్ పైర్లు పచ్చబడాల్సిన కాలం వచ్చినా ఇంకా ఈ సంవత్సరం వర్షాలు సరిగ్గా రాలేదు కదా, ఈ సారి కరువు వస్తే ఎట్లాగని మీరు అడుగుతారు. ఇప్పుడు జెండాకు కోపం వస్తుంది, ఈ కర్మ భూమిలో జీవితానికి సహజమయిన ఆటు పోట్లను మీరు మరచిపోతున్నారు. అది మీకు గుర్తు చేయడానికే జెండాలో అశోక చక్రంవుంది. తిరిగి తిరిగి మళ్లీ మొదటికే వస్తుంది చక్రం. నిన్నటి సంవత్సరం వరదలు, ఈసారి కరువు, మళ్లీవరదలు, మళ్లీకరువు.... దీనికి జెండాను అడిగితే ఏంలాభం? జాతీయ భద్రతా చట్టం కింద వానదేవుడిని అరెస్టు చేయాలా లేక రుతుపవనాలను టెరరిస్టని ప్రకటించాలా లేక మబ్బులు 'అబ్స కాండింగ్' అని ప్రకటించి నాన్-బెయిలబుల్ వారంట్ తీసుకోవాలా? అంతే కాకుండ ఈ ఏడుగూడ వర్షాలు పడితే కిందటేడు వరదలకు కొట్టుకుపోయిన రోడ్లూ వంతెనలు ఇంకా రిపెయిరు కాలేదు గదా, వాటి గతి ఏంకావాలి? పరమాత్మ కరుణామయుడు కాబట్టి సరిపోయింది గాని, ఈసారి గూడ వర్షాలుపడితే పెద్ద సమస్య అయిపోయేది కదా? ఎందుకు రిపెయిరు కాలేదని మీరు అడుగుతారు. అదొక ఇతిహాసం. వరంగల్ సంగతే తీసుకోండి. వరదనష్టాన్ని గురించి అంచనాలిమ్మని సర్పంచ్‌లకూ సమితి ప్రెసిడెంటులకూ చెప్పారు. వాళ్లు సహజంగానే ప్రజలకు జరిగిన నష్టానికి తమ వాటా కాంట్రాక్టర్ల వాటా కలుపుకొని 6 కోట్లన్నారు. వాళ్ల నిజాయితీ మీద తగు మాత్రమే నమ్మకమున్న అన్నగారు 3 కోట్లు కేటాయిస్తామన్నారు. అదిగూడ తన దగ్గర లేక అమ్మగారిని అడిగాడు. కలకత్తా

కాళికకు డబ్బులివ్వడం ఇష్టం లేదు. పోలీసుల కోసమయితే ఇస్తానుగాని రోడ్ల కోసం వంతెనల కోసం ఇవ్వడానికి ఇదేం సోషలిస్టు ప్రభుత్వం అనుకున్నావా అనింది. పైగా రోడ్లు బాగలేకపోతేనే మంచిది మహాత్మ గాంధి ఎన్నడో చెప్పాడు, రవాణాసౌకర్యాలు ఎక్కువయితే దుర్మార్గులు దేశమంతా పాకిపోతారని. వెరసి 6 కోట్ల అంచనాకూ 3 కోట్ల హామీకీ 18 లక్షలు మాత్రం దొరికాయి. వాటిలో పోయినవి పోగా మిగిలిన మొత్తంతో ఇసుక లారీలను మాత్రం రోడ్లు తెగిన చోటికల్లా తోలించారు. ఇవన్నీ చెప్పలేక జెండాకు కోపం వస్తుంది. అయినా మీకింకా అనుమానాలు మిగిలే వుంటాయి కాశ్మీర్‌లో దుర్మార్గంగా ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని ఇందిరమ్మ పడగొట్టింది. అప్పుడే అక్కడ కర్ఫ్యూలూ కాల్పులూ మొదలయ్యాయి. రేపు అక్కడ గూడ ఒక భింద్రన్ వాలే పుట్టుకొస్తే? అతన్ని టెరరిస్ట్ అనడం న్యాయమేనా? ఆరవ పంచవర్ష ప్రణాళిక సరిగ్గానడవడంలేదట ఆ మధ్య ప్రభుత్వం 'మధ్యంతర పరిశీలన' జరిపి చాలాబాగ నడుస్తోందనీ ఒక కోటిమంది పేదవాళ్లు దరిద్రరేఖను దాటి పైకి ఎగబ్రాకారనీ ప్రకటించింది. కాని కొంతమంది మేధావులు లెక్కలుగట్టి అటువంటిదేంలేదని ప్రకటించారు. వాళ్లు కొంపదీసి టెరరిస్టులు కారుగదా? ఒరిస్సాలో ముఖ్యమంత్రి పట్నాయక్ అనుయాయులూ పోలీసులూ కలిసి పన్నెండు మంది విద్యార్థులను దారుణంగా హీరాకుడ్ కాలువలోకి విసిరేసారట. వాళ్లూ టెరరిస్టులేనా? ఇలా ఇంకా ఏవేవో మీ మనసుకుతోస్తాయి. ఈసారి జెండా కోపం అవధులుమించి పోతుంది. మిమ్మల్నే టెరరిస్టు అంటుంది. మీగ్రామాన్ని టెరరిస్టు ప్రాంతంగా ప్రకటిస్తుంది. మీతో ఇవ్వాళ్టికాదు, గత ఆరునెలలలో పలకరింపు సంబంధమయినాసరే ఉన్న వాళ్లందరినీ లోపలేసి ఏ నేరం చేసారో చెప్పకుండ ఏనేరమూచేయలేదని రుజువు చేసుకోమంటుంది.

అందుకే, అనుమానాలకూ ఆలోచనలకూ తాళం వేసి,

వందే మాతరం !

28.7.84

అభ్యుదయ సాహిత్యోద్యమం

(గత సంచిక తరువాయి)

అభ్యుదయం

3

అ. ర. సం. చరిత్రలో 'అభ్యుదయ' అనే మాటకు స్పష్టమైన నిర్వచనమంటూ ఎన్నడూ లేదు. ఎవరికిష్టంవచ్చినట్టుగా వాళ్లు అర్థం చెప్పుకునే వెసులుబాటు ఈ అనిర్దిష్టత వల్లనే కలిగింది.

విశ్వశ్రేయస్సు, లోకకళ్యాణం, జగద్ధితం వంటి సాంప్రదాయిక భావాలతో సాంఘిక సామరస్యాన్నీ జీవకారుణ్యాన్నీ ప్రశాంతినీ కోరుకున్నవాళ్లంతా సోషలిస్టు భావస్పర్శలేనివాళ్లే. అది ఉన్నవాళ్లు తమ దృక్పథాన్ని బాహాటంగా ప్రకటించలేదు. అలా ప్రకటిస్తే తదితరులు కలిసిరాకపోవచ్చునని వాళ్లభయమై ఉండవచ్చు. సంఘశ్రేయస్సు వంటి మాటల చాటున తమ రాజకీయ దృక్పథాన్ని దాచుకున్నారు. కమ్యూనిస్టులకూ కమ్యూనిస్టేతరులకూ అవగాహనలోనే భేదంఉంది, కమ్యూనిస్టు రచయితలకైనా సిద్ధాంతబలం లేకుండాపోయింది. దాన్ని కలిగించేందుకు అ.ర.సం. ఎలాంటి సంఘటిత కృషీ చెయ్యలేదు. మొదలు కావడం మొదలుకావడమే ఐక్యసంఘటన గురించి అపసవ్యమైన అభిప్రాయాలతో మొదలైంది. చివరిదాకా పైలోపాన్ని పూరించలేదు సరికదా, లోపాన్నే గుణంగా భ్రమిస్తూ సంస్థనాయకత్వం దానికిలోబడిపోయింది. ఐక్యతకిచ్చిన ప్రాముఖ్యాన్ని పోరాటానికివ్వకపోవడమే కాదు, పోరాటమే లేకుండా చేసింది. అంటే, మితవాద అవకాశవాదం అ.ర.సం. జీవాన్ని హరించింది.

సామ్రాజ్యవాద వ్యతిరేకత, ప్రజాస్వామ్యం, హేతువాదం అ.ర.సం. లక్ష్యాలుగా పేర్కొన్న ప్రణాళిక నూతన సమాజ వ్యవస్థగురించి లీలగా ఒకటి రెండు మాటలు చెప్పినా అది సోషలిస్టు సమాజమేనని ఎవరైనా ఊహించుకోవచ్చు. సోషలిజం తక్షణ లక్ష్యం కాదు గనక దాన్ని పేర్కోలేదనుకున్నా, కనీసం బూర్జువా ప్రజాస్వామిక విప్లవానికి సంబంధించిన సాంస్కృతిక కర్తవ్యాల విషయంలోనైనా అభ్యుదయ సాహిత్యోద్యమంలోకి వచ్చినవాళ్ల కందరికీ నిజమైన అవగాహనలేదు.

భూస్వామ్య వ్యతిరేకత సాంస్కృతికరంగంలో ఏ నిర్దిష్టరూపాలు ధరించాలో ప్రణాళిక సూచించింది గాని, భూస్వామిక భావజాలం నుంచి పూర్తిగా బైటపడిరానివాళ్లను సైతం కూడగట్టేందుకు తగని ఆసక్తి చూపెట్టింది. పోనీ, వాళ్లకు భావసంస్కారం కలిగించే ప్రయత్నమైనా చెయ్యలేదు. మీదుమిక్కిలి, పేరుప్రఖ్యాతులనుబట్టి వాళ్లకు తానుపెద్దరికం ఇచ్చింది. వీళ్లలో కొందరు, రాజకీయాన్నినిరసిస్తూ దానికీ కళకూ పొసగనేపొసగదని అంటే,హింస,విధ్వంసంవంటివి సరిపడవని మరికొందరన్నారు. అక్కడితోఆగక, నన్నయభట్టు, తిక్కన, శ్రీనాధుడు, పెద్దనవంటి పూర్వమహాకవులంతా తమతమ యుగాలలో అభ్యుదయ కవులేనని ఇంకొందరన్నారు ప్రచారం కళకు మహాపాతకమనీ, కమ్యూనిస్టులు తమ రాజకీయ ప్రయోజనాలకు సాధనంగా అ.ర సం ను వాడుకుంటున్నారనే విమర్శకు అవకాశం ఇవ్వకుండా 'రస' ప్రధానంగా సాహిత్యాన్ని సృష్టించాలని మరికొందరు అన్నారు. మొంపి, ఒకరి దృక్పథం మరొకరికి అర్థంకాని విధంగా, లేక నానాదృక్పథాల తొడతొక్కిడిలో అ.ర సం. తన దృక్పథాన్ని దిగజార్చుకున్నట్టుగా, స్పష్టమైన లక్ష్యనిర్వచనం లోపించింది. ఇనక తక్కెడా పేకతక్కెడా చందంగా అ ర.సం. తన నిర్మాణాన్నికూడా గందరగోళం చేసుకుంది.

ప్రాచీన సాహిత్యంలోని ఉత్తమ సంప్రదాయాలను పరిరక్షించడం దాని ఆశయాలలో ఒకటి. ఏది ఉత్తమమో ఏదికాదో వివేచించడం మాత్రం జరగలేదు ఏజాతి సంస్కృతిలోనైనా పాలకవర్గాలసంస్కృతికి భిన్నంగా ప్రజాసంస్కృతి తప్పనిసరిగా ఉంటుందనిగాని, దీనిమీదకూడా పాలకవర్గ సంస్కృతి ప్రభావం అనివార్యమేఅయిన సమకాలిక సమాజంపట్ల నిరసన, అసమ్మతి, ధిక్కార వైఖరులు ఇందులో గుప్తంగా ఉంటాయనిగాని అ.ర.సం. ప్రణాళిక ఎక్కడా చెప్పలేదు. ఐదో మహాసభ ప్రణాళికలో మాత్రం 'దేశి' సాహిత్యరూపాల ప్రస్తావన ఉంది.అంతే. ప్రాచీన సాహిత్యాన్ని మొత్తంగానే నిరసించి నిరాకరించే వైఖరి మొదటి మహాసభ అధ్యక్షోపన్యాసంలో కనిపిస్తుంది కాబట్టి సాంప్రదాయికులు కలవరపడ్డారు. ఈ భయం నిరాధారమైనదని చెప్పేందుకూ, తద్వారా ప్రాచీన సాహిత్యాభిమానులను సంస్థలోకి తీసుకువచ్చేందుకూ పనిగట్టుకుని ప్రయత్నం చేసిన ఫలితంగా, రెండవ మహాసభ నాటికే చాలామంది కలిసివచ్చారంటూ కార్యదర్శి సంతృప్తి ప్రకటించాడు. మద్రాసు మహాసభనాటికి ఇది పూర్తి అయింది. "ప్లాట్ ఫారంగా, సాధ్యమైనంత విశాలమైనదిగా అభివృద్ధి చెందించి" అంటూ మద్దుకూరి చంద్రశేఖరరావు (అ.ర.సం. వ్యవహా

రాలను చూస్తూవచ్చిన పార్టీ ముఖ్యుడు), "మన రాజకీయాలకు ఏమీ సంబంధంలేని మధ్యతరగతి మేధావులను, రచయితలను, నటులను ఒకచోట చేర్చడంలో (మద్రాస్) మహాసభ పూర్తిగా జయంపొందింది" అని చదలవాడ పిచ్చయ్యరాశారు. అయితే పదరుసభలో ఒకేలోపం ఉన్నట్టు ఇతరులురాస్తే ఆయనకూ అనిపించింది: "మనసభ లాగా లేదండీ" అంటే, అ ర.సం. వాణి వినిపించినంత బిగ్గరగా అన్యుల కోలాహలం వినిపించింది—అ.ర.సం. వేదిక మీదినుంచి, రాష్ట్రపార్టీ కార్యదర్శి మాటల్లో అ ర.సం. 'పెయిలిస్ట్" అయింది.

ఇలా అయిందంటే తప్పు పూర్తిగా అ.ర సం. నాయకత్వానిదేనా? ఐక్య సంఘటన విషయంలో పార్టీకి ఉండిన తప్పు అవగాహనే అ.ర.సం. నాయకత్వాన్ని ఒక కొనకు తీసుకెళ్లింది. సుందరయ్యకు పిచ్చయ్య రాసిన ఉత్తరం ఈ సత్యాన్ని నిరూపిస్తూంది; "మనమంతా బాగా చర్చించిన మీదటే వీరేశలింగం ఆరంభించాం. నన్నయ్య దగ్గరనుంచీ నన్నేసాహెబు దాకే అందరికి, దీర్ఘచర్చలు జరిపిన మీదటే, ఉగాది సర్వదుంబాలా ఇచ్చేశాం.„ వీరేశలింగం, గిడుగు, గురజాడల సంప్రదాయాన్ని కొనసాగించాలనే సంకల్పం బూర్జువా ప్రజాస్వామిక విప్లవలక్ష్యానికి సన్నిహితమైనదే కావచ్చుగాని, వారి సంప్రదాయంలోకూడా విడిచిపెట్టవలసింది లేకపోలేదనే విమర్శ దృక్పథం లోపించింది. "కావ్యము అమృతకలశము కాని అశనిపాతముకాదు, కవి శాంతిదూతకాని ప్రళయకారకుడు కాడు. కవి సామరస్యము సాధించాలిగాని విశ్వేషము విస్తరింపజేయరాదు" అని తెలికచర్ల వెంకటరత్నం అన్నారంటేనే, ఆయనకు వర్గపోరాటంగురించి కనీసపాటి స్పృహైనా లేదని తెలుస్తుంది. కమ్యూనిస్టు భయంకూడా ఉన్నట్టు తెలుస్తుంది "పూర్వకాలిక సంస్కృతిని నాశనం చేయడంకాని కాదని త్రోసిపుచ్చడంకాని అనుచితమూ, అకార్యకరణమూ, జాతిద్రోహమూ, ఆత్మహత్యా అని నానిశ్చితాభిప్రాయం" అంటూ, సమాజంలో మార్పురావాలిగాని అనిరాక్షసకృత్యమైన విధ్వంసంతో కూడుకున్నదిగాక సాంఘిక సామరస్యహేతువైన మార్పేనని మల్లంపల్లి సోమశేఖరశర్మ ఉపన్యసించడానికి కూడా ఈభయమే కారణం. కాబట్టి రెండోమహాసభకు పార్టీకార్యదర్శి సుందరయ్య స్వయంగా హాజరై అభయం యివ్వవలసివచ్చింది. "పూర్వాన్నంతా నాశనంచేస్తామని కొందరిభయం. ఆ భయానికి తావులేదు. అది నిజంకాదు." అయినా ఇది బూచిమాటలతో తీరేదికాదు. అభ్యుదయ రచయితలు ప్రాచీన సాహిత్యంమీదమాత్రం తిరుగుబాటు తీసుకురాలేదని రాజమండ్రి మహాసభల్లో శ్రీశ్రీ చెప్పినా, ఈగిలిపోలేదు. పాతకొత్తల మేలుకలయిక కావాలని

నిడుదవోలు వెంకటరావు అంటే, అభ్యుదయమార్గం కొత్తదే అయినా పాతమార్గంతో సమన్వయంకోసం ప్రయత్నిస్తూందని విశ్వనాథ సత్యనారాయణ తృప్తి ప్రకటించారు. అంటే, చిట్టచివరిదాకాగూడా అ.ర సం.లో కమ్యూనిస్టు అభిమానులకూ తదితరులకూ సంస్కృతిగురించీ సంప్రదాయంగురించీ మార్పుగురించీ పూర్తిభావైక్యం కలగనే లేదన్నమాట.

రాజకీయానికీ కళకూగల అన్యోన్యత విషయంలో కమ్యూనిస్టు రచయితలు పూర్తి ఏమరుపాటు చూపలేదు. జాతీయౌన్నత్యానికీ ప్రజల మానసిక వికాసానికీ నిత్యజీవిత సమస్యలను పరిష్కరించవలసిన శాస్త్రీయ దృక్పథానికీ అభ్యుదయ సాహిత్యం దోహదం చెయ్యాలని మొదటి మహాసభ సందర్భంగా పిచ్చయ్యరాశారు.

"సాంఘిక జీవితాభివృద్ధికి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, శాంతి, అభ్యుదయాలకు అవకాశం కలిగే మార్గాన్ననుసరిస్తూ, అలాంటి సామాజిక వ్యవస్థ కోసం (అ.ర.సం) పాటుబడుతుంది".

రెండవ మహాసభను ప్రారంభిస్తూ అఖిల భారత అ.ర.సం. కార్యదర్శి సజ్జాద్ జహీర్ నోరువిడిచి చెప్పారు.

"ప్రజాసమస్యలు, సంఘ సంస్కరణ, ఆర్థిక సమానత్వం, సాంఘికంగా సమానావకాశాలు, ఐకమత్యం వగైరా ఆశయాలు ప్రచారం చేయుట, పరిష్కారానికి తోడ్పడుట మా ఆదర్శం".

అయినా, క్రమంగా రాజకీయం కనుమరుగయేంతగా, లేక అన్యుల విమర్శ వినముందుగానే వూహించుకుని జంకుబాటుతో రాజకీయాన్ని మరుగుపరిచేంతగా అ.ర.సం. నాయకత్వం అతిజాగ్రత్త ప్రదర్శించసాగింది. కమ్యూనిస్టుపార్టీ కీలుబొమ్మఅనో, రష్యన్ సృష్టిఅనో అ.ర.సం. గురించికొందరు చేయసాగిన ప్రచారాన్ని చూసి జంకుబాటువైఖరి మొదలైంది. సాహిత్యానికి జీవితంతోటి సజీవసంబంధం ఉండాలని, అధిక సంఖ్యాకులైన ప్రజల జీవితాన్ని శాసించే సాంఘికశక్తుల ప్రభావాలను అర్థంచేసుకుని చిత్రించడమే సక్రమమైనపని అంటూ కుటుంబరావు రాసిందిగానీ, రచయితనూ రాజకీయవాదినీ ఇద్దరినీ జీవితమే ఉద్బోధిస్తుంది గనక కొన్ని రాజకీయపార్టీలు అభ్యుదయ సాహిత్యభావాలను ప్రచారం సాగించడమూ ఆ రాజకీయపార్టీల ఆశయాలనుంచి ఉత్తేజంపొంది రచయితలు సాహిత్యాన్ని సృష్టించ

డమూ జరుగుతుందని శ్రీశ్రీ చెప్పిందిగానీ, అ.ర.సం. నిర్వాహకులకు ధైర్యం కలిగించినట్టులేదు. రాష్ట్రపార్టీ కార్యదర్శి చూపినట్టుగా,

"రచయిత తటస్థుడుగా ఉండలేడని, ప్రజలవైపు నిలబడి ప్రజలతో కలిసి ప్రజాశత్రువుతో పోరాడగల్గిన రచయితయే అభ్యుదయ రచయిత అనే విషయాన్ని సత్యాన్ని, ఎవ్వరూ చాటలేదు". అంటే, వర్గాతీత ధోరణిని ప్రదర్శించారని అర్థం. వర్గ సమాజంలో పీడితప్రజలపక్షాన నిలబడి పోరాడగలిగితేనే ప్రజాభ్యుదయమైనా, విశ్వశ్రేయస్సయినా చేకూరగలవనే విషయాలకు సంబంధించిన మూలసిద్ధాంతాలను అ.ర.సం. నాయకత్వం వదిలివేసిందిగనకనే.

"వారు అందరకుముందుండి మెట్టుమెట్టుకు మరింత అభ్యుదయకరమార్గాన్ని సూచించడానికిబదులు, అందరిని కలుపుకొనిరావలెననే ఆవేదనలో అందరికన్న వెనక బడిన అభ్యుదయరచయితలను సమర్థించడానికి దిగజారుతున్నారు."

వారు వీరయ్యేబదులు, వీరు వారయ్యారన్నమాట ఐక్యసంఘటనలో నాయకత్వ పాత్రవిషయంలో ఏమరుపాటుచెందినా, ఐక్యత నొక్కదాన్నే పరమార్థమనుకుని పోరాటాన్ని వదిలివేసినా ఏఅనర్థం జరగగలదో, ఈ అనుభవాన్నిబట్టి తెలుసుకోవచ్చు.

ఇంతకూ 'అభ్యుదయం' అంటే ఏమిటి? అభి + ఉదయం = అభ్యుదయం అని ముక్కస్యముక్కార్థం చెప్పడంకాదు కావలసింది. అభ్యుదయం ఎవరికి, ఎలా, అని విశ్లేషించి, దాని మూలవస్తువు (కంటెంట్) ఇదమిత్థమని చూపవలసి ఉంటుంది. వర్గపోరాటం గురించి ప్రస్తావించిన కమ్యూనిస్టు రచయితలు లేకుండానే పోలేదు. వర్గరహితసమాజంగురించి చెప్పకుండానూ పోలేదు. అయితే చారిత్రకంగా నిర్దిష్టమైన ఒకానొక వ్యవస్థలో కేవలం సంస్కరణమీద సంస్కరణను కోరుతూ, మౌలికమైన సామాజిక పరివర్తనను సుదూరమైన ఆదర్శంగా మాత్రమే ఎంచడం అభ్యుదయమా! అవును, అ.ర.సం. ఆశించిన అభ్యుదయం అలాంటిదే. అనిర్దిష్టతకారణంగా ఎవరికితోచిన అర్థంవారుచెప్పుతున్నారు. చివరకు అది కేవలం మాటగానే మిగిలిపోయింది. ఆకలి, కన్నీళ్లు, ఆర్తారావాలు, నినాదప్రాయమైన శుష్కపద విన్యాసాలూ— యిలాంటివాటికి పర్యాయపదమైపోయింది. ఇది పూర్తిగా యాదృచ్ఛికంగానే జరిగినట్టా లేక, సంకల్పపూర్వకంగా జరిగినట్టా! ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం కష్టం, ఒక్కమాటమాత్రం చెప్పవచ్చు. నిత్యబాల్యంలో, ఎడ

తెగని శిష్యరికంలో (ట్యూటెలేజ్) ఉంటూ సొంతఆలోచనను పెంపొందించు కోకుండావచ్చి ఆనాటికి మితవాదం వూబివైపు పోసాగిన కమ్యూనిస్టు ఉద్యమ స్థాయికి అనుగుణంగానే అ.ర.సం. విధానం రూపొందింది.

4

అభ్యుదయ రచయితలు

"దేశభక్తి, అహంకారంలేని జాతీయత, ప్రజాభ్యుదయం దృష్టిలో వుంచు కుని ప్రత్యేక ఉద్యమంగా అభ్యుదయ రచయితల సంఘాన్ని పెంపొందించాలి. దీనికి ప్రజలు పునాదిగా ఉండాలి. ప్రజాహృదయంలోని కష్టాలను, చైతన్యాన్ని ప్రతిబింబించె రచనలకు, రచయితలకు ప్రోత్సాహమివ్వాలి. అలాంటి రచనలే ఈ ఉద్యమానికి ఆయుధాలు. రచయితలే సైనికులు."

పిచ్చయ్యకు 1947లో చంద్రం రాసిన లేఖలోని ఈ వాక్యాలు ఎంతబాగున్నా, అప్పటికే సమయం మించిపోయింది. వచ్చి మీదపడనున్న ప్రభుత్వ నిర్బంధ విధానం గురించి కాసింత ముందుగానే హెచ్చరించి లాభంలేకపోయింది. పిచ్చయ్యకు ఈ సూదులేవీ ఎక్కలేదు. సంస్థసాధించిందనుకున్న ఘన విజయాలగురించి సంతృప్తితో ఆయన కంటిచూపు ముక్కుదాటి ముందుకు సాగలేదు.

"ఆంధ్రదేశంలోని రచయితలందర్నీ సమీకరించగలిగాం.... ఆంధ్రసాహితీ రంగమంతటా అభ్యుదయ నినాదం ఒక్కటే వినిపించే స్థాయికి ఉద్యమాన్ని నడప గలిగాం....ఇవాళ ఆంధ్రదేశంలో ఒకే ఒక సాహిత్యోద్యమంగా మన ఉద్యమం పెరిగింది".

"మహాకవుల"మొదలు "జానపదగీతాలు" రాసేవారిదాకా అ.ర.సం.లో 650 మందికి పైగా సభ్యులున్నారని రాశాడు. అంకెలు అభివృద్ధిని సూచించగలిగితే మదరాసు మహాసభనాటికి అ.ర.సం. అత్యున్నతస్థితిని పొందిందని అనుకోవాలి. అసలు విషయం మాత్రం వేరే.

పార్టీపట్ల సానుభూతిచూపేస్థితికీ పార్టీకి విశాలిచ్చేస్థితికీ సుప్రసిద్ధ రచయి తలు కొందరు రాగలిగారని ఆయన బుజాలు చరుచుకున్నారుగాని, 1948లో పార్టీ నిషేధంతోబాటు అ.ర.సం.కు తగిలిన దెబ్బకు వీరిలో ఎవ్వరూ ముందుకువచ్చి

అనమ్మతి ప్రకటించలేదు గనక ఆయనకు వాపుకీ బరువుకీ మధ్యగలభేదం తెలీకుండా పోయిందని చెప్పవచ్చు ఇది జరిగిన పదహారేళ్ళ తర్వాత కమ్యూనిస్టుపార్టీ పత్రికల్లో అభ్యుదయ సాహిత్యం గురించి చర్చ జరిగినప్పుడు, మహీధర రామమోహనరావు ఒకమాట అన్నారు. రచయితలలో అభివృద్ధికాముకుల్లాగే అభివృద్ధి నిరోధకులు సైతం సంఖ్యరీత్యా కొద్దిమంది మాత్రమే కాబట్టి, అటో ఇటో గానివారిదే అధిక సంఖ్యాబలమైనందుచేత వీరిని అభ్యుదయంవైపుకి రాబట్టే ప్రయత్నం జరగవలసి ఉందని ఆయన హితువు. దీనితో పేచీ వుండనక్కరలేదుగాని, అటో ఇటో తేల్చుకోనివారు నిజంగా ఎవరన్నా ఉండేవారాలేదా అన్నదిమాత్రం సందేహాస్పదం. ఉండివుంటే 1948 తర్వాత వాళ్ళు ఒకరిద్దరైనాసరే ఉద్యమాభిమానులుగా మిగిలి, పరిస్థితి అనుకూలించి మబ్బులు విడిపోయాకైనా మళ్ళీ సంస్థవైపుగా వచ్చారా?

నార్ల అనుమానించినట్టు, అనేకులు తమకు మరోవేదిక లేనిస్థితిలో అ.ర.సం. వేదికను వాడుకునేందుకనీ వచ్చిమూగినవారే. తమంతట తాము రాకపోతే, పిచ్చయ్య లాంటివాళ్ళు పనిగట్టుకు తెచ్చారు. వీరిలా తామెవ్వరూ 'పరిశోధన' చెయ్యలేదనీ, వీరికున్నట్టుగా తమకు "అనుభూతి" (అనుభవం?)కి తగిన ప్రతిభ అంతగాలేదని, అందుచేతనే వీరిని పిలిచి పెద్దజెయ్యడం. జరిగిందన్నట్టుగా ఆత్మన్యూనతాభావంతో పిచ్చయ్య సమర్థించుకున్నారు. రాజమండ్రి మహాసభనాటికే అ.ర.సం. నవ్యసాహిత్య పరిషత్తు వేదికగా మారింది. ఈ రెండు సంస్థలగురించి రాస్తూ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి ఇలాగన్నారు,

"నవ్యసాహిత్య పరిషత్తు ముగిసిన కొద్దికాలానికే అభ్యుదయ సాహిత్యసమితి శక్తి యువకుల్లోంచి అనివార్యంగా ఉద్భవించింది. సిద్ధాంతాలలో, లక్షణాలలో నవ్య సాహిత్య పరిషత్తుకంటె ఇది ఎంతోదూరంపోలేదు. స్తబ్ధమైన ప్రాచీన సాహిత్య వ్యవస్థమీద విప్లవం తెచ్చిన నవ్యసాహిత్య రచయితలకు ఇందులో బెరుకుగాని, పరాయితనంగాని కనబడక సులభంగా వీరితోకలిసిమెలిసి ఉండగలిగారు. అభ్యుదయ వాదులు తెచ్చిన భౌతికవాదాన్ని శ్రామికకృషీవల సానుభూతిని, ప్రజాహిత ఆందోళనలనూ, వీరు అర్థం చేసుకోడానికి ప్రయత్నించారు."

కృష్ణశాస్త్రి మొదలు పిలకా గణపతిశాస్త్రివరకు అనేకులిలా కనీసం స్థూలమైన సానుభూతితోటి అ.ర.సం. కృషినీ లక్ష్యాలనూ అర్థం చేసుకునేందుకు ప్రయత్నించిన మాట నిజమే కావచ్చు. 'యువగీతం' వగైరాలతో కృష్ణశాస్త్రి ఈ ఉద్యమా

నికి ఎంతోకొంతైనా పనికిరాగల గేయాలను రాశారు. అప్పటికే పిలకా వారి గేయం 'అమ్మా మాదాకబళం తల్లీ!" వెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి కోపానికి అగ్గమై గాలిదుమారం లేపివుంది. కర్షక కార్మికుల గురించి హనుమచ్ఛాస్త్రి పద్యాలు రాశారు. 'ఆకలి' గురించి కృష్ణశాస్త్రి రాసినా, అది ఆధ్యాత్మికమైన ఆకలే. ఏమైనా, నవ్య సాహిత్య పరిషత్తునుంచి చిత్తశుద్ధితో అ.ర.సం. వైపువచ్చిన రచయితలలో నిలిచినవారు మాత్రం బహుకొద్దిమంది. వీరైనా కొత్తతరానికే చెందినవారు—'నయాగరా' బృందం యువకవులైన కుందుర్తి, ఏల్చూరి, బెల్లంకొండ, పోలూరి, అనిసెట్టి. అభ్యుదయ దృక్పథాన్ని సరిగా బోధపరచుకుని రచనలతో ప్రదర్శించే విషయంలో ఈ నలుగురిమధ్యనే భేదాలున్నప్పుడు, పాతతరానికి చెందిన రచయితల విషయం చెప్పవలసిన పనేలేదు. "మూడుయుగాలకూ మూడుతరాలకూ" చెందిన కవిగా కృష్ణశాస్త్రి గురించి 'అభ్యుదయ' పత్రికలో ప్రయోగ రాసిన వ్యాసాన్ని ప్రస్తావిస్తూ, సుందరయ్య రాసిన మాట గుర్తుంచుకోదగింది.

"'మూడుయుగాలకూ మూడుతరాలకూ ప్రతినిధి' అభ్యుదయకవికాజాలడు."

ఏ యుగానికీ పూర్తి, ప్రతినిధి కాలేనివాడే అనేక యుగాలకు ఏకకాలంలో ప్రతినిధి కాగలుగుతాడు. కవిగా కృష్ణశాస్త్రియుగం నిజానికి నిన్నటిది. ప్రస్తుతయుగం పైకితెచ్చే విషయాలను ఆయనగానీ మరొకరుగానీ ముసుపటంతటి నిర్దరత్వంతోనూ నిజాయితీతోనూ తమ రచనలలో చిత్రించగలరా లేదా అన్నదే ప్రశ్న.

భూస్వామ్యానికీ సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా రాజకీయ, సామాజిక స్వేచ్ఛనూ ప్రజాస్వామ్యాన్నీ బలపరుస్తూవచ్చిన వెనకటితరం రచయితలకు ఆ లక్ష్యాలనే ముందుంచుకొనివచ్చిన అ ర సం. రచయితలతోటి సులభంగానే భావసామ్యం ఏర్పడిందని రాచమల్లు రామచంద్రారెడ్డి 1964లో రాశారు. ఇదివాస్తవమే అయితే, వాళ్లంతా అ ర.సం.లో పూర్తిగానూ మనస్పూర్తిగానూ సంలీనం అయినట్టేనా? అ.ర.సం. లక్ష్యాలకు నిబద్ధులైనట్టు తెలిపే సాహిత్యసాక్ష్యం లేదేమరి! వ్యక్తుల నిజాయితీని అటుంచి, భౌతికంగాగాని భావపరంగాగాని వీళ్లంతా అభ్యుదయ రచయితలుగా రూపొందే పరిస్థితులూ లేవు. సుందరయ్య గమనించినట్టు, వీళ్లకు ఇంతో అంతో జాతీయాభిమానం ఉన్నా, నిరంతరాయమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట శీలత లేదు. భూస్వామిక భావజాలంనుంచే పూర్తిగా తప్పుకోనివాళ్లు కొందరైతే, మరి కొందరు 'ప్రణయ' పరంగా వివాహవ్యవస్థను ధిక్కరించిన మేరకే వ్యక్తిస్వేచ్ఛా

వాదులనిపిస్తారు. ధనస్వామికాన్ని అంతమొందించడమే అభ్యుదయ రచయితల లక్ష్యమని రాజమండ్రి మహాసభ అధ్యక్షుడుగా కృష్ణశాస్త్రి చెప్పింది ఎంతో ఇంపితంగా ఉందిగాని, దానికి రాజకీయ ప్రాముఖ్యంలేదు. ఎందుకంటే, భూస్వామికాన్నే అంతమొందించనప్పుడు ధనస్వామికాన్ని అంతమొందించాలనడం విప్లవదశలను కిందుమీదుచెయ్యడమే. వాస్తవంలో వీళ్లకు రాజకీయమంటే సరిపడదు. కళకూ రాజకీయానికీచుక్కెదురని వీరి నమ్మకం. రాజకీయప్రమేయంలేని అభ్యుదయం ముల్లులేని గులాబీయే. అందుచేత అ.ర.సం లో నామకార్థకంగా సభ్యులై వుండవచ్చుగాని, వీళ్లు సృష్టించిన అభ్యుదయ సాహిత్యం దాదాపుగా నాస్తి అనే చెప్పాలి.

మొదటి ప్రణాళికలో సూచించిన మేరకు జాతీయవాదన్నీ ప్రజాస్వామ్యాన్నీ హేతువాదన్నీ అభ్యుదయ రచయితలు ప్రదర్శించవలసిఉంది. శిథిలమౌతూవచ్చిన సమాజం తాలూకు సంస్కృతినితోసివేసి, రానున్న సమాజానికి చెందిన సంస్కృతి బలపడేవిధంగా సాంస్కృతిక సంచితాన్ని వివేచించి, ప్రజాజీవితాన్ని వాస్తవికతా దృష్టితో చిత్రించే సాహిత్యాన్ని సృష్టించవలసిఉంది. సామాజిక పరిణామాన్ని శాస్త్రీయంగా అవగాహనచేసుకుని, ప్రజాదృక్పథాన్ని అవలంబించేలా చైతన్యాన్ని పదనెక్కించుకోనిదే, నిజమైన అభ్యుదయరచన జరగదు. మొదటిమహాసభ సందర్భంగా వెలువడిన వి. శ్రీకృష్ణ వ్యాసం చదివినా, పిచ్చయ్య వ్యాసంచదివినా, కమ్యూనిస్టు రచయితలకు ఇలాంటి అవగాహన ఉండేదని తెలుస్తుంది, కుటుంబరావు వంటివాళ్లు పదే పదే చెబుతూ వచ్చిందీ ఇదే. సోషలిజం సుదూరమైన ఆశయంగానేఉన్నా, సోషలిస్టు దృక్పథం (పరస్పెక్టివ్)మాత్రం అభ్యుదయ రచయితకు తప్పనిసరి. రాజకీయంగా సామ్రాజ్యవాద శృంఖలాలనుంచి విముక్తి, ఆర్థికంగా భూసంస్కరణలో పరిశ్రమీకరణా, సాంఘికంగా భూస్వామ్య వ్యవస్థ తాలూకు అసమానతల తొలగింపు, వగైరా అభ్యుదయ రచయితల తక్షణకర్తవ్యాలుగా ఉండేవని రా.రా. అన్నారు. అయితే ఇవన్నీకూడా ఏదిశగా జరగాలిఅన్నప్పుడు, అంతిమలక్ష్యం ముగ్గులోకిరానిదే లాభం లేదు బూర్జువా ప్రజాస్వామిక విప్లవకర్తవ్యాలను బూర్జువావర్గమే నిర్వర్తిస్తుందనే భ్రమ నేటికీ సాంప్రదాయిక కమ్యూనిస్టు ఉద్యమాన్ని పూర్తిగావదల్లేదు. 'జాతీయ బూర్జువావర్గం' మీద ఆశలిప్పటికీ చావలేదు. 'జాతీయప్రజాస్వామ్యం' అంతరార్థం అదే. పెట్టుబడిదారీ అభివృద్ధి పరమార్థంకాదు. ప్రజాస్వామిక విప్లవంలోనైనా శ్రామికవర్గమే నాయకత్వం వహించవలసిఉంది. ఈ రెండు దశలకూ భేదాలు ఉన్నాయిగాని, ఆ నాయకత్వం కిందనే సుదీర్ఘ విప్లవక్రమంలో వీటి మధ్యదూరంతొగాలగి,

అది నిరంతరాయమైన పరిణామం కాగలుగుతుంది. అప్పుడు తక్షణలక్ష్యం బూర్జువా ప్రజాస్వామిక విప్లవంగాక, నూతన ప్రజాస్వామిక విప్లవమే. ఈ సైద్ధాంతిక అవగాహన లేని తొలిరోజుల్లో, అభ్యుదయ రచయితలు సైతం కమ్యూనిస్టు ఉద్యమంలాగానే బూర్జువావర్గం తాలూకు విప్లవకర స్వభావాన్ని అతిగా అంచనావేశారు దాని దళారీ స్వభావాన్ని గమనించలేదు. భూస్వామ్యంతోటి దానికిగల ఆర్థిక, రాజకీయ అనుబంధాన్ని గుర్తించలేదు. తదనుగుణంగానే అ.ర.సం. ప్రణాళిక పరిమిత లక్ష్యాలను పెట్టుకుంది. కనీసం తెలంగాణా సాయుధ పోరాటకాలంలో చైనాపంథా గురించి కనువిప్పు కలిగిన తర్వాతనైనా. ఈ లోపాన్ని సవరించుకునే ప్రయత్నం జరగలేదు.

1945 నాటికి రాజమండ్రి మహాసభలో ప్రణాళిక కొంతమారినా, రాజకీయ చైతన్యస్థాయిలో కిందిమెట్టున, సాహిత్యస్థాయిలో పైమెట్టున ఉన్నవాళ్లను సంతృప్తి పరిచేందుకు విశ్వశ్రేయ, సంఘశ్రేయస్సు, ఉన్నతసంప్రదాయాలు, ఆనందం వంటి మాటలు బాగా అక్కరకువచ్చాయి. అందరినీ అలరించేవుద్దేశంతో పేడాబెల్లమూ కలిపినట్లు ప్రణాళికను కలగూరగంపగా మార్చారు. అయినా అది నిర్దేశించిన కర్తవ్యాలను ఎంతోకొంత తృప్తికరంగా నిర్వర్తించినవారే అభ్యుదయ రచయితలని పించుకోగలిగారు. సోషలిస్టు ఆశయాన్నిస్వీకరించి మార్క్సిస్టుదృక్పథంతో రాసిందే అభ్యుదయ రచనగానూ, అలారాసేవారే అభ్యుదయ రచయితలుగానూ "పొరబాటు బావం" ఒకటి వ్యాప్తిలోకివచ్చిందని మహీధర రామమోహన్‌రావు 1964లో అన్నారు. పొరబాటంటూవుంటే అది ఆయనఆలోచనదేగాని, అభ్యుదయ రచనదిమాత్రంకాదు. కృష్ణశాస్త్రినీ, గణపతిశాస్త్రినీ, హనుమచ్ఛాస్త్రినీ అభ్యుదయ రచయితలుగా గుర్తించక, మహీధర రామమోహనరావునూ ఉప్పల లక్ష్మణరావునూ కుటుంబరావునూ శ్రీశ్రీనీ సోమసుందర్‌నూ అనిసెట్టినీ ఆరుద్రనూ గుర్తించిందంటే, పాఠకలోకం తప్పేమీ చెయ్యలేదు. ప్రణాళికకు ఆచరణే గీటురాయికాగలిగింది. ఇక, విశ్వశ్రేయస్సువంటి వర్గాతీతమైన భావాలను ఆనాడే పార్టీకార్యదర్శి విమర్శించడం జరిగింది.

"ఈ ధోరణి అందరు అభ్యుదయ రచయితలమనుకొని, అందరిరచనలు అభ్యుదయరచనలే అనేధోరణికి దారితీస్తుంది. విశ్వశ్రేయస్సుకుమార్గం ఆదర్శవాదం ద్వారా కాదు. (Idealism) భౌతికవాదాన్ని అంగీకరించి, వివిధవర్గాలుగా విభజింపబడిన ప్రజలలో, పీడితవర్గం తరపున నిలబడి, వారిలో ఒకభాగమై, రచయిత పోరాడగల్గినట్లయితే, విశ్వశ్రేయస్సుకు, ప్రజాఅభ్యుదయానికి దారితీస్తారు."

కమ్యూనిస్టురచయితలు సంఘం తమ "ప్రత్యేక దృక్పథాన్ని, వర్గకలహ సత్యాన్ని" మరచిపోగూడదని, అలామరచిపోనప్పుడే "నిజంగా ప్రజాసామాన్యమంతటికీ అభ్యుదయప్రాప్తికోసం సరియయిన కార్యక్రమం ఎప్పటికప్పుడు ముందుపెట్టి, ఉద్యమాన్ని ముందుకుతీసుకపోగలరు" అనీ సుందరయ్యరాశారు. ఆదేసమయంలో కమ్యూనిస్టురచయితలు ఇతర అభ్యుదయరచయితలతో కలిసి స్వాతంత్ర్యంకోసం, ప్రజాభ్యుదయంకోసం కృషిచేస్తారు. అ.ర.సం. కమ్యూనిస్టు రచయితలసంఘంగా ఉండక, "నిజంగా అభ్యుదయాన్నిఆశించే రచయితలందరిసంఘంగా "ఉండాలన్నారు. జరిగింది దీనికి భిన్నమైంది. కమ్యూనిస్టు రచయితలు తమ "ప్రత్యేక" దృక్పథం వదులుకున్నారు. గనకనే అభ్యుదయంముద్రలో ప్రతిఒక్కరినీ నిర్విచక్షణగా చేరదీశారు, కనీసం విమర్శాదృక్పథం అవలంబించలేదు.

5

అభ్యుదయ సాహిత్యం

తెలుగు సాహిత్య చరిత్రలో ఒకదశకు అభ్యుదయ సాహిత్యదశ అనేపేరు పూరికేరాలేదు. సాహిత్యవస్తువు, భాషాశైలివంటి విషయాలతోబాటు జీవితదృక్పథం కూడా విలక్షణమైనందుచేత దీనికి ఈ పరిగణనవచ్చింది.

అ ర సం. ఏర్పడకముందునుంచీ అభ్యుదయాంశగల సాహిత్యం తెలుగులో వుంటూవచ్చింది. ముఖ్యంగా శ్రామికవర్గచైతన్యం విప్పారసాగిన తర్వాత కవులూ రచయితలూ సృష్టించిన సాహిత్యంతోపోలిస్తే, అభ్యుదయసాహిత్యం రాశిలో మాత్రమే విస్తారమైంది, కావచ్చుగాని, ప్రజలనుచేరుకుని ఉత్తేజపరచడంలో మాత్రం ప్రశస్తంకాగలిగిందని చెప్పడం కష్టం. అలాగే అ ర.సం.తోబాటుగా పనిచెయ్యసాగిన ప్రజానాట్యమండలి ప్రభావంతోవచ్చిన సాహిత్యంకూడా అభ్యుదయ సాహిత్యంలాంటిదికాదు. ఇది చేపట్టిన కళారూపాలుగాని, ప్రయోగించిన సాధారణ వ్యవహారభాషగాని, అభ్యుదయసాహిత్యంలో కనిపించేవికావు. అభ్యుదయసాహిత్యం ముఖ్యంగా మధ్యతరగతియువకులు కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో సృష్టించిందే. వీళ్లు ఎక్కువగా బస్తీలమనుషులు- చదువులోనూ సంస్కారంలోనూ జనసామాన్యాని కంటే ఒకమెట్టుఎక్కువే. అందుచేతనే వాళ్లకు మరింతదూరం. ఈ రచయితలకు తగినంతగా మార్క్సిస్టుసిద్ధాంత పరిజ్ఞానంగానీ జీవితానుభవంగానీ లేకపోవడం మరో

విశేషం. పైగా, వెనకటి సాహిత్యధోరణుల పట్టునుంచిమాత్రమేగాక, భావవాద పరిధి నుంచికూడా పూర్తిగాబైటపడలేకపోయారు. సోషలిజంప్రమేయమేదీలేకుండా కేవలం మధ్యతరగతివాళ్లకోసమే సాహిత్యసృజన జరగాలంటూ జి. వి. కృష్ణారావులాంటి రాయిస్టుల్లాగా సిద్ధాంత మేమీ చెయ్యకపోయినా, క్రియలో అభ్యుదయసాహిత్యం మధ్య తరగతి పాఠకులనుదాటి కిందికివెళ్లలేకపోయింది. మీదుమిక్కిలి, 'ప్రజాసాహిత్యం' అనబడే దానిగురించి ఉండవలసినంత సదభిప్రాయంకూడా లేకుండావచ్చింది. ప్రజల నుంచి వస్తూన్న రచయితలు ఉద్యమానికి పునాది అని మద్దుకూరి చంద్రశేఖరరావు రాసిన ఒకవాక్యానికి జవాబుగా గొంతుచించుకున్నట్టు పిచ్చయ్య ఇచ్చినజవాబును చూస్తే, "అనుభూతి" (అనుభవం?), ప్రతిభఅనేమాటలతో ప్రజాదృక్పథానికి అతీతమైన పాండిత్య భేషజం భ్రమగొల్పినట్టు తెలుస్తుంది.

"'ఉద్యమానికి పునాది ప్రజలనుండీ వస్తున్న రచయిత'లన్నారు. రచయితల్లో కొందరు ప్రజలనుంచీ కొందరు పైనుంచీవస్తారా? అయితే, ప్రజలనుంచివచ్చిన రచయితలనడంలో మీదృష్టి, మామూలు కార్మికుడూ కర్షకుడూ తనబాధల్ని ఏవోపాట రూపంలోనో పద్యంరూపంలోనో వెల్లడించుకోవాలనే కుతూహలంతో కొద్దికొద్దిగా కొత్తకొత్తగా వ్రాస్తున్నవారనేనా? ఇక్కడ ఒకమాట: వారికుతూహలం, ఉత్సాహం మెచ్చుకోదగ్గదే: ప్రోత్సహించదగ్గదే. కాని, అదే మన సాహిత్యానికిగానీ, సాహిత్యోద్యమానికిగానీ పునాదికాదు. ఈదృష్టిలో మనకి పునాది ఇప్పటివరకూ మనకున్న సాహిత్యం, తద్వారాకలిగిన సంస్కారం. వీటిని జీర్ణించుకొని ముందుకుపోగల శక్తే ఉద్యమానికి జీవగర్ర అంతేకాని, మీరువ్రాసినట్లు కేవలం తమబాధలు చెప్పుకోడం మాత్రమే సాహిత్యంకాదు...."

"అనుభూతికి ప్రతిభతోడైనప్పుడే సాహిత్యానికి పునాది ఏర్పడుతుంది."

ప్రజలనుంచి వస్తున్న రచయితలకు తాము గైడెన్స్ ఇస్తున్నారట. అయితే, "ఆ ప్రజలనుంచి వచ్చామనే రచయితలు తాము రెండుపాటలు మాటలు వ్రాసేటప్పటికి మహాకవులమైపోయామని అనుకొని, కనీసం అలాంటి వాతావరణంలోవుండి, మా Guidance ను తృణీకరిస్తే మేము ఏంచెయ్యవలసివుండేది; మేము ఏంచేసినా ప్రయోజనం లేకపోతే మీరు ఏంచేసేది—మనకు ఒక స్పష్టమైన దృక్పథంవుండాలి."

ప్రజలంటే ఎవరు, ఏమిటి అనేవిషయంలో గానీ, ప్రజలనే పదార్థం ఒక్కొక్కదశలో ఒక్కొవిధంగా రాజకీయోద్యమానికీ, దానికి సంబంధించిన సాహిత్యో

ద్యమానికీ కనిపించక తప్పదనేవిషయంలోగానీ, అ.ర.సం. నాయకత్వానికి స్పష్టమైన అవగాహన లేకుండాపోయింది. రైతాంగంనుంచీ ఇంకాకిందివర్గాలనుంచీ ఉద్యమ చైతన్యంతో పైకివచ్చి రచయితలుగా రూపొందసాగిన వారిపట్ల తృణీకారం, హేళన, పిచ్చయ్య వాక్యాల్లో కనిపిస్తాయి. తాముఅధికులమనుకునే (పేట్రనైజింగ్) వైఖరి కూడావుంది ప్రజానాట్యమండలి కళాకారులనటుంచి సుంకరవంటి మంచి రచయితతో కూడా వీరికి సరిపడకుండా వచ్చింది. రాజారావుతోటి చెయ్యిచెయ్యీ కలపడం కూడా జరిగింది. 'ప్రజల'నుంచివచ్చిన రచయితలు తమబాధలను వెళ్లబోసుకోలేదు, అప్పట్లో జనాన్ని పట్టి పీడించిన జీవితసమస్యలకు తమకుతోచిన సాహిత్యరూపం ఇవ్వారన్న విషయాన్నికూడా పిచ్చయ్య పట్టించుతోలేదు. అందుకనే 'అభ్యుదయ' పత్రిక మొదటి ఆరుసంచికల్లో ఈ సాహిత్యానికి చోటులేకుండాపోయింది. పార్టీకార్యదర్శి ఎత్తి చూపినట్టుగా,

"....అభ్యుదయలో ఈ ఆరుమాసాలకాలంలో ఆంధ్రప్రజాసీకాన్ని కదిల్చి వేసిన తెలంగాణాపోరాటాన్ని చిత్రించే రచనలేమీ, గీతాలేమీలేవు. అలాంటిగేయాలు ప్రజాశక్తిలోవచ్చాయి. లక్షలకొలది ప్రజలను ఉర్రూతలూగించాయి. అదేరీతిగా కాబి నెట్టుమిషను ప్లానుమీద భారతరైతుకార్మిక విద్యార్థిపోరాటాలమీద, సామ్రాజ్యవాదులు గావించే నిర్బంధదోపిడీ గూర్చి, దొంగమార్కెట్టు ప్రాబల్యం, కాంగ్రెసుమంత్రుల ప్రజా వ్యతిరేకధోరణి వీనినిగుర్చికూడ పద్యాలులేవు. దీనికి కారణమేమిటి? అభ్యు దయలో 'వర్గరాజకీయాలకు,' 'కమ్యూనిస్టు రాజకీయాలకు' స్థానముండకూడదనే ధోరణి ఏమయినా ఉందా? పీడితప్రజల అస్పష్టరచనలు, పైతరగతివారికి కష్టంకలి గించని రచనలు ప్రమాదకరంగాని రచనలే రచనలనే ధోరణి లేదుకదా!"

సాహిత్యాన్ని రాజకీయం కొరడాచేతబట్టుతున్న యజమానిలా శాసించగూడదనే భావం మాత్రం అ ర సం. నాయకత్వానికి ఉన్నట్టు "ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ అగ్రనాయకుల నగ్నసత్యాలు" (1948) అనే తమ పుస్తకానికి చదలవాడ పిచ్చయ్య రాసుకున్న 'పరిచయం' స్పష్టంచేస్తుంది:

"కవులను, రచయితలందర్ని రాజకీయపార్టీ ప్రచారాలకు అంటగట్టడం సరి యైన లక్షణంగాదు. వివిధరాజకీయ తత్వాలుగల వర్గసమాజంలో ఏదో ఒక రాజకీయ లక్షణ ప్రభావం పడితీరుతుంది, అంతమాత్రాన రచయితలందర్నీ వర్గరాజకీయాలకు అంటగట్టడం మార్క్సిస్టు తత్వశాస్త్రజ్ఞానం లేకపోవటంవల్లనే అనిపిస్తుంది."

వర్గ సమాజంలో ఏ సామాజికచర్యకైనా 'పార్టిజాన్' స్వభావం వుండకతప్పదని, కనీసం కమ్యూనిస్టురచయితలైనా ఈ దృక్పథంతోటి తమ సాహిత్యాన్ని మొత్తం ఉద్యమంలో అంతర్భాగంగా- లెనిన్ అన్నట్టు యంత్రంలో మరలలాగా- ఎంచక తప్పదని పిచ్చయ్య గ్రహించలేదు. రాజకీయం అంటే ఆర్థికవిషయసారమేనన్న స్పృహైనా లేదు. పార్టీనేతృత్వం అనివార్యమన్న గుర్తింపూ లేదు. ఇది ఆయనకొక్కరికే వున్న లోపం అనిపించదు. పార్టీపరిధిలోకి వచ్చికూడా త్వరలోనే బైటపడిన అనిసెట్టికిగానీ, అలాంటి ఇతరులకుగానీ సాహిత్యసంస్థకూ పార్టీకీ మధ్యవుండవలసిన అన్యోన్యత యజమాని- బానిస సంబంధంలాగా కనిపించింది. అంటే, కమ్యూనిస్టు పార్టీతత్వమే వీళ్లకు ఎక్కలేదనిఅర్థం. రచయిత ప్రకటించగోరేదానికీ రాజకీయపార్టీ ప్రచారం చెయ్యగోరేదానికీ మధ్య వైరుధ్యంలేనప్పుడు, పార్టీప్రచారానికి రచయితలను "అంటగట్టడం" అనేదే ఉండదు. రచయిత ప్రజాఉద్యమంతో మమేకంఅయినప్పుడే, అభ్యుదయరచయిత కాగలుగుతాడని పిచ్చయ్యలాంటి 'కమ్యూనిస్టు' రచయితలుసైతం గమనించకపోవడం ఆ ఉద్యమానికి గల మార్క్సిస్టు సిద్ధాంతస్థాయినే సూచిస్తుంది. కమ్యూనిస్టేతరులైన రచయితలు అ.ర.సం. వేదికమీదినుంచి రాజకీయ పార్టీ- కమ్యూనిస్టుపార్టీ-గురించి వెలిబుచ్చిన భయసందేహాలనే తానూవెలిబుచ్చేంతగా ఆరేడేళ్ల తర్వాత పిచ్చయ్య ఎదిగారనుకోవాలి. దీన్నిబట్టికూడా అభ్యుదయసాహిత్యోద్యమం తాలూకు పరిమితులను గ్రహించవచ్చు.

అయినా అ.ర.సం. కంటే అభ్యుదయసాహిత్యం విశాలమైందని చెప్పడం సరైంది. అంతేగాక, సంస్థజీవితాన్ని మీరి మరింతకాలం జీవించగలిగింది కూడా. ప్రారంభసమావేశంనాటికి అ.ర.సం లో సృజనాత్మక సాహిత్యకారులుగా అప్పటికే ప్రసిద్ధులైనవారుగానీ, ఆతర్వాత ప్రసిద్ధికివచ్చినవారుగానీ ఎక్కువమంది లేరు. పార్టీ సంబంధీకులతోబాటు అప్పటికింకా రాజకీయపార్టీ సంబంధాలు లేనివాళ్లు- ఉదాహరణకు, నయాగరాకవులు- ఉద్యమంలోకి వచ్చారు. క్రమంగా వీళ్లు పార్టీఅభిమానులయ్యారు, ఒకరిద్దరు సభ్యత్వంకూడా పొందారు. మొదట్లో 'నవశక్తి' ద్వారా శ్రీశ్రీతోనూ, 'యువ' ద్వారా కుటుంబరావుతోనూ సంస్థకు సంబంధాలుంటూవచ్చాయి. రాజమండ్రిసభనాటికి తిలక్, సోమసుందర్ వంటి యువకులువచ్చి కలిశారు. ప్రజానాట్యమండలినుంచి రచయితలుగాపైకివచ్చిన వారిలో ముక్కామల, కోగంటి, నాజర్, సుంకర, అ.ర.సం.కార్యవర్గానికి చేరగలిగారు. దాశరథి, పొట్లపల్లి, కాళోజి, శ్రీరామకవచం, జి. వి. కృష్ణారావువంటి వారి రచనలు అ.ర.సం. పత్రికల్లో వెలువడ

డంఅటునుంచి, తెలంగాణానుంచి ఆళ్వారుస్వామి కార్యవర్గ సభ్యుడయ్యాడు. చాగంటి సోమయాజులు, మహీధర రామమోహనరావు మొదటినుంచీ ఉన్నారు. విద్వాన్ విశ్వం ఆతర్వాత వచ్చారు. మా. గోఖలే, తెన్నేటి సూరీ అంతే. నార్ల చిరంజీవి అనుసరించాడు. మద్రాసు మహాసభనాటికి పులుగుండ్ల రామకృష్ణయ్య, జి. ప్రభవంటివాళ్లు కార్యవర్గానికెక్కారు. సభ్యత్వమూ పెరిగింది. అయినా, అభ్యుదయ సాహిత్యాన్ని పెంపొందింపజేసిన వాళ్లంతాకలిసి ఈకొద్దిమంది మాత్రమేకాదు. చదలవాడ పిచ్చయ్యనూ ప్రయాగ కోదండరామశాస్త్రినీ, వట్టికొండ రంగయ్యనూ, వట్టికొండ విశాలక్షినీ కలుపుకున్నా, అభ్యుదయ సాహిత్యకారులందరినీ పేర్కొన్నట్టుకాదు. సంస్థలోచేరినా చేరకపోయినా ఎందరెందరో రచయితలమీద ఈ ఉద్యమ ప్రభావం స్పష్టంగానో అస్పష్టంగానో ఉంది.

అభ్యుదయ సాహిత్యంలో, ఆమాటకువస్తే తెలుగు సాహిత్యంలోనే, అప్పుడేగాక ఇప్పుడుకూడా, వచనం కంటే కవిత్వం పాలే ఎక్కువ, మనజీవితం వెనకబాటుతనానికి ఇది ఒక దాఖలా. గణబద్ధచ్ఛందస్సుల ప్రాముఖ్యం అంతరించాక కవిత్వం తేలికయింది, తేలికపడిందికూడా. "పెద్దబాలశిక్ష ఫెయిల్, ప్రజాశక్తి ప్యాస్" అని కొందరు హేళనచేసేంతగా శిల్పం విషయంలోనేగాక కావ్యభాష విషయంలోనూ ఎన్నోలోపాలతో కవితలు వరదెత్తసాగాయి. విషయంలో వైవిధ్యం బాగా తగ్గింది. ప్రచారస్థాయిని మించని రచనలదే సంఖ్యాతిశయమయింది. అయితే ప్రజానాట్య మండలి రచయితలూ తదితరులలో కొందరు చేసిన కావ్యరచనలు అన్నీ ఇలాంటివేనని కొట్టివెయ్యడానికి వీలులేదు. వాటితో పోల్చినప్పుడు, అభ్యుదయ కవులుగా వాసికెక్కినవారి రచనలు కొరకరాని కొయ్యలుగానో శిరోభారంగానో అనిపించక తప్పలేదు. పైగా, అనభ్యుదయకరమైన భావధోరణులు అభ్యుదయ కవితలలో చట్టమయ్యాయి. మత సంకేతాలు, మార్మికవాదచ్ఛాయలు, జీవకారుణ్యవాదధోరణులు, కేవల ధిక్కారతత్వం—వీటికి అభ్యుదయ కవిత్వంలో ఎన్నో దాఖలాలు లభిస్తాయి. శిల్పం పేరుతోనో సంవిధానం పేరుతోనో గారడీ పనులు కూడా కనిపిస్తాయి.

బెంగాల్ కరువు, కాశ్మీర్, హైదరాబాదు వంటి సంస్థానాలలో ప్రజల పోరాటాలు, కయ్యూర్ కామ్రేడ్స్ ప్రాణత్యాగం, తెలంగాణా పోరాటం వంటి దేశీయ విషయాలూ, ప్రపంచ యుద్ధబీభత్సం, సోవియట్ సైనికవిజయాలు, గ్రీస్ మొదలు మలయా, కొరియాలదాకా కమ్యూనిస్టు ఉద్యమపోరాటాలు, చైనావిముక్తి వంటి దేశాంతర రాజకీయ ఘటనలు, అభ్యుదయ సాహిత్యానికి ఇతివృత్తాల నిచ్చాయి.

ఆంధ్రరాష్ట్రోద్యమం కొందరికి ప్రేరణ కలిగించింది. గాంధీహత్య అనేకులను కదిలించివేసింది. మతకలహాలు, రజాకార్ దురాగతాలు చాలామందిని బాధించాయి. అభ్యుదయ సాహిత్యానికి సామాజిక చైతన్యం ముఖ్యలక్షణమైంది. భావకవిత్వ దశతో పోలిస్తే ఇది ముందడుగే: అయితే భావకవిత్వధోరణి అభ్యుదయకవులలో కొందరినైనా ప్రలోభపరుస్తూ వచ్చింది.

వచనసాహిత్యాన్ని చూస్తే మధ్యతరగతి జీవితదృశ్యాలు కానవచ్చేంతగా శ్రామికుల జీవిత దృశ్యాలు కానరాకపోవడానికి కారణం, అభ్యుదయ రచయితల వర్గపరిమితులే. కథలూ నవలలూ నాటకాలూ సంస్కరణవాదస్థాయిని మించలేదు. రాజకీయపార్టీకే సాధ్యంగాని విప్లవదృక్పథం సాహిత్యకారులకెలా సాధ్యమని ప్రశ్నించవచ్చు గాని, రాజకీయపార్టీకి ఉన్నట్టుగా కేవల యథార్థతాదృష్టి సాహిత్యానికి ఉండదు. కాల్పనికతావైఖరి రచయితలచేత సుదూరవిషయాలనుసైతం భావించి చిత్రింపజేస్తుంది. తెలంగాణాపోరాట సందర్భంగా జీవితవాస్తవంకూడా దాన్ని అందుబాటులోకి తెచ్చినప్పుడు, అభ్యుదయ సాహిత్యం మరింతఉత్తేజం చూపింది. ప్రజానాట్యమండలి కళారూపాలు దాన్నిమించిపోయాయి. జనంతోనూ ఉద్యమంతోనూ, ఆ సంస్థకు అ.ర.సం కంటె ఎక్కువ సన్నిహితమైన సంబంధం ఉండడమే ఇందుకు కారణం.

కథలకూ నవలలకూ ఇతర వచనసాహిత్యరూపాలకుకూడా ప్రయోజనాత్మకమైన స్వభావాన్ని ఇవ్వడానికి మొట్టమొదటిసారిగా ఉద్యమించింది అ.ర.సం. అని కుటుంబరావు ఒక వ్యాసంలో రాశారు. వందలాదిగా కథకులు జీవితసత్యాన్ని వివరించడానికి కృషిచేశారని చెబుతూ, అయినా యువరచయితలు కొందరు వాస్తవాన్ని వాస్తవికతగా భావించి తృప్తిపడుతున్నారనీ, మరికొందరు కథయొక్క స్వభావానికి న్యాయం చేకూర్చాలనే ఆశతో వికృతమైన రచనలు చేస్తున్నారనీ విమర్శించారు. అభ్యుదయ రచయితల్లో కథకులుగా ప్రశస్తిపొందినవారు చాగంటి సోమయాజులు, మా. గోఖలే, పిచ్చేశ్వరరావు, అనిసెట్టి, అవసరాల, తెన్నేటిసూరి కూడా కథలు రాస్తూవచ్చారు. పొట్లపల్లి రామారావు కథలు ప్రశస్తమైనవి. ఉప్పల లక్ష్మణరావు, మహీధరరామమోహనరావు, బొల్లిముంత శివరామకృష్ణ, ఆళ్వారుస్వామి అభ్యుదయాత్మకమైన నవలలు రాశారు. నాటక కర్తలలో సుంకర, వాసిరెడ్డి, ఆత్రేయ, ప్రఖ్యాతిపొందారు. నాజర్ నాటకాలు కూడా రాశాడు. మొత్తంమీద అభ్యుదయ సాహిత్యోద్యమం నుంచి వచన రూపాలు కొంతమేరకైనా పరిపుష్టి

పొందాయని చెప్పవచ్చు. ప్రదర్శన కళారూపాలలో ప్రజానాట్యమండలి స్థాపించిన ప్రమాణాలతోగానీ, కవిత్వంలో అభ్యుదయకవులు పొందిన ప్రఖ్యాతితోగానీ అభ్యుదయ వచన సాహిత్య విజయాలు పోటీకి నిలువలేవనికూడా అనుకోవచ్చు అయితే వాటిని పూర్తిగా తగ్గించడం న్యాయం కాదు. వాస్తవంలో మరింతకాలం నిలిచేది ఈ ప్రక్రియే.

ఒకమారు వెనక్కి చూస్తే, అప్పటి కమ్యూనిస్టు ఉద్యమం పంథా ఎన్ని పొరబాట్లతో తప్పులతో కూడుకొని వున్నా, అది ప్రజాచైతన్యాన్ని కదలబారించిందని చెప్పాలి. సాంస్కృతిక రంగంలో దాని ప్రభావంమూలంగా కళాకారులు తమసామాజిక బాధ్యతను గుర్తించి, పీడితప్రజాకోటి సాగించే వుద్యమాలతోనూ పోరాటాలతోనూ మనస్ఫూర్తిగా సహకరించాలనీ, విశాలమైన ప్రజాజీవితమనే యుద్ధరంగంలో తామూ సైనికులమేననీ తెలుసుకునే అవకాశం కలిగింది. "మరో ప్రపంచంకోసం మహాప్రస్థానం" చేయబూనిన కళాకారులకు సాంస్కృతికరంగంసైతం సంఘర్షణలతో కూడుకొన్నట్టిదేనన్న అవగాహన ఏర్పడింది. రాజకీయం, కళ, వీటి అన్యోన్యత తెలిసివచ్చింది. ప్రజల మహోద్యమంలో నిజంగా భాగం అయినంత మేరకు అభ్యుదయ సాహిత్యానికి జీవకళ వచ్చింది. పోరాటలతో జతబడినంత మేరకుఆవేశ తీవ్రత వచ్చింది. గొప్ప ఆదర్శానికి లగ్నమైనందుచేత చారిత్రక ఆశావాదం అలపడింది. వీటన్నిటి ఫలితంగానే అభ్యుదయ సాహిత్యం "ఒకప్రబలమైన సామాజికశక్తి" కాగలిగింది. అయితే కమ్యూనిస్టు ఉద్యమాన్ని లోపభూయిష్ఠంచేసిన అంశాలు అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని నీరసపరిచాయి, ప్రజల్లో దాని పునాది చాలాచిన్నది. ప్రజలతో దాని అనుబంధం అతిదుర్బలమైంది. దాని మార్క్సిస్టు సిద్ధాంతబలం పరమస్వల్పం. అయినా దాని ప్రభావం అనేకుల మీదపడింది. కొత్తతరాన్ని దాదాపు మొత్తంగానే అది ఆకర్షించింది. రచయితలుగా అప్పటికే సుప్రసిద్ధులైన పాతతరం వారిలోగూడా కొందరినోట తనమాటను పలికించింది. అనేకులచేత తన ఆట ఆడించింది. ఆమేరకు అది సఫలమైనట్టే. కమ్యూనిస్టు ఉద్యమానికి అనుగుణమైన సాంస్కృతికోద్యమం దృష్ట్యా, అది తప్పటడుగు. సామ్రాజ్యవాద వ్యతిరేక విశాల జాతీయ ఐక్యసంఘటనకు సంబంధించిన సాంస్కృతికరంగంలో అది విఫల ప్రయోగం.

— కె. వి. ఆర్

మేం వొస్తాం

ఉదయమిత్ర

పోస్టాఫీసుల్ని మూసెయ్యండి
టెలిఫోన్ తీగెల్ని తెంచెయ్యండి
టెలిప్రింటర్లని చంపెయ్యండి
రేడియోలను, టెలివిజన్లను
తలకిందులుగా వేలాడదీయండి
పత్రికల గొంతుల్ని నొక్కివేయండి
మేంవొస్తాం
ఆకుల పైవొస్తాం
అలల పైవొస్తాం
కంటిసైగల పైవొస్తాం
కంటిసెగలపై వొస్తాం
ఆటలై వొస్తాం
పాటలై వొస్తాం
భూమార్గాల్ని మూసెయ్యండి
జలమార్గాలు తెరుస్తాం
జలమార్గాలు మూసెయ్యండి
వాయుమార్గాలు తెరుస్తాం
దిక్కులన్నీ దిగ్బంధనం చెయ్యండి
మేం వొస్తాం
అజ్ఞాతంగా వస్తాం
అంతటా కన్పిస్తూ వస్తాం
కానివ్వండి
పాతశాస్త్రాలుతిరగెయ్యండి
కొత్తప్రయోగాలు మొదలెట్టండి
కాలంమీద కత్తులవంతెన కట్టడానికి
శాంతికపోతాలెగరేస్తూనే
కోరల్నీ, రక్తపుచారల్నీ దాచడానికి
పక్కరాజ్యాలతో సంప్రదించండి

రహస్యసమాలోచనలు జరపండి
అడవులను దువ్వండి
ఆలోచన్లను కత్తిరించండి
భయాలను 'ఇంజెక్ట్' చేయండి
అయినా మేంవొస్తాం
అప్రమత్తంగా వొస్తాం
అనివార్యంగా వొస్తాం
అసంఖ్యాకంగా వొస్తాం
మాజనం గుండెలమీద
తరతరాలుగ పాతిన
దోపిడీజెండాను దించేందుకు
మేం వొస్తాం
తరం, తరం కదిలివొస్తాం
నిరంతరం కలిసివొస్తాం
తరంగమైరగిలివొస్తాం

స్వతంత్రుడయ్యిందెవడు
కానిసత్యమెవని నొసటచెరిగింది
ఎదలోపల ఇప్పటికీ
శ్రమజీవుల రోదనలే
కన్నతల్లి వదనంపై
ఉన్నదల్ల విషాదమే
కత్తులకే స్వేచ్ఛవచ్చె
గుండెల్లో దిగేందుకు
మృత్యువుకే స్వేచ్ఛవచ్చె
శవాలలో తిరుగేందుకు
స్వతంత్రుడయ్యిందెవడు
కానిసత్యమెవని నొవటచెరిగింది

(1947 ఆగష్టు 15న దేశవిభజన పేరుతో జరిగిన మతకల్లోలాలలో 'వచ్చిన స్వాతంత్ర్యం' గురించి ఉర్దూకవి కైఫీఆజ్మీరాసిన ఘజల్ నుండి)

కథ :

"నీడకోసం"

కార్మిక

"' అతారె' లేని సుతారి ఏడూళ్లిండ్లకు గోడలు పెడుతనన్నడట! గట్లనే వున్నది నీ శాత్రిం" అన్నది సూర్యమ్మ అంబాక భర్త చెప్పినమాటలువిని కోపం తెచ్చుకొని. వీరయ్య అన్నంతిని బేరీవ్మని చెయ్యికడుక్కుంటూ....

"నీ యక్క నాలుగురోజులాగరాదు! సూసుకుంటుండంగనే ఎన్నోంటిల్లు కడుతనో!" అన్నడు. దానిమీద సూర్యమ్మ గఁయ్....మని లేచింది.

"మాటమాట్లాడితె నడుమ గదెందుకత్తది? నీయక్కట! అక్క........నాపేరు జాతాల పోశెట్టి. మూడెడ్లు ముప్పయ్యారుదొడ్లు అన్నట్టుగనేపాటగని అదికట్టింది లేదాయె పెయింది లేదాయె! సువ్వికట్టేవరకు అపలాడ సింగరేణి కంపినే లేవి పోద్ది" (బొగ్గుకంపిని) అనుకుంట తిన్న కంచాలు తీసుకుని బయటకువచ్చి గుడిశె వెనుకదిక్కుపోయింది. అడవి దంతెపొరకతడకల మీదనుంచి ఆవలదిక్కు నీళ్లు పోసింది. తడికెల ఆవల చీకట్లోంచి ఒకమానవాకారం చేత్తోచెంబుపట్టుకుని సణు క్కుంట దూరంపోయింది. సూర్యమ్మకు ఆ స్థితిచూడగానె నవ్వువచ్చింది. మరో సారి అయితె ఎంతతిట్టిపోసేదో? కంచాలు అట్లచేత్తోపట్టుకొని చప్పుడుకాకుంట నవ్వింది. నవ్వుతూ నవ్వుతూనె

"దీనింట్లపీనుగెల్ల! జాగేడదొరుకలేదో? "అని" బతుకులుపాడుగాను ఎంత అద్వాన్నమైపోయినయ్? అరిసెయ్యేల్సు జాగలేకుంటాయె" అన్నది కంచాలు కడుక్కుంటూ సూర్యమ్మ యింకాచాలా చాలాఅనుకుంది. బాయిపనోళ్ల బతుకుల గురించి రోజు అనుకున్నట్టేఅనుకొని నిట్టూర్చింది. తిరిగి యింట్లకువస్తుంటే బజారు నుంచి కొడుకు నారాయణ తిరిగొచ్చి పందిరికింద మంచంల 'ఆటుమూటు'గ పండు కున్నడు. సూర్యమ్మ కొడుకు వాలకంచూపి మళ్లనిట్టూర్చింది. గుడిశెలోపల కిరో సిన్ దీపం గుడ్డిగానెవెలుగుతోంది....పాతసులుకమంచంలో కూర్చునిమోదుగాకుచుట్ట చుటుకుంటున్న భర్తనుచూసి 'యింత' కోపంతెచ్చుకున్నది. చేతిలో కంచాలు విసు రుగ పెట్టేసి మంచం దగ్గరికి వచ్చి

"ఎన్నిసార్ల జెప్పినా....దున్నపోతుమీద వానగురిసినట్టేనాయె! గటు పోరని దిక్కుసూడు. నీకు తిండెట్లపెయినబడ్తాంది?....అదెపాయె ఓసూరో యాబయో

పోనీయ్ ఏన్నున్న యిల్లుకిరాయికి తీసుకొమ్మనిచెప్పినా యినకపోతివి 'లగ్గమంటచేసి ఆర్నెల్లామెగని యిదువారకు తీసుకపెట్టుండిలేద'ని మీయియ్యాపురాలు అవాడనుంచి యీవాడకు యినచ్చేటట్టు అంటాంది ఎరికేనానీకు?" అన్నది సూర్యమ్మ లోగొంతుతో

"నా తండ్లాటంత మిలమిలసూసుకుంట ఎట్లన బుదయితదె నీకు?"

"మాతండ్లాత్తానవ్!" మూతితిప్పింది సూర్యమ్మ!

"నా తిప్పలునీకేమెరుకలే....మరి తీసుకచ్చుకొమ్మని చెప్పకపోయినవ్.... మనం గా పందిరి కిందపన్నాతెల్లారుద్ది" అన్నాడు వీరయ్య చుట్టకొరుకుతూ

"శనివారం బాయిలు బందేసాయె పొయ్యి కోడబ్బు తీసుకరారాదు బిడ్డాఅంటె నప్పుడు లేదు నకిలేదు అదేదోపొయ్యి నువ్వేచెప్పు" అన్నది సూర్యమ్మ. వీరయ్య లేచి దర్వాజలోంచి బయటకు చూసిండు. ఎదురు గుడిసె వాళ్ల అంటించిన బొగ్గు పొయ్యి వెలుగు తడిక సందుల్లోంచి మంచంల పడుకున్న నారాయణ ముఖంమీద ఎర్రగా పడుతోంది. చాలాసేపు కొడుకునుచూసిండు. ఏదో ఆలోచనల్లపడి నిలబడిపోయిండు.

తండ్రికొడుకులు యిద్దరు సెవెనింక్లైన్ (7వ నంబర్ బొగ్గుగని)లో పనిచేస్తున్నరు. తండ్రి కోల్‌ఫిల్లర్, కొడుకు బదిలీఫిల్లర్‌గ (టెంపరరీకోల్‌ఫిల్లర్) పని చేస్తున్నారు. తండ్రితోపనిచేసే 'జలాల్' తన పిల్లిగెడ్డాన్ని సవరించుకుంటు అప్పుడప్పుడు ఆ విషయంగురించే చాలాచమత్కారంగ "పులి కడుపున పులి కోల్‌ఫిల్లర్ కడుపున బదిలీఫిల్లర్" అని నవ్వుతడు. నారాయణ పదోతరగతిదాక చదివిండు. గనిలో పనిలోచేరి కొంతకాలమేఅయింది కాబట్టి ఆరోగ్యంగనే వుంటడు. పైగా యీడుమీదున్నమనిషి. వీరయ్య అట్ల నిలబడి కొడుకును చూస్తావుండే నారాయణ మాత్రిం పోయిన ఎండాకాలంలో పెండ్లిచేసుకున్న తనభార్య గురించి ఆలోచిస్తున్నడు. భార్య అంటె చంద్రి. చంద్రికి తనకు పెండ్లయిఆరునెలలైంది అదేమురికి పేటలో. ఆ చివరి రేకుల పెడ్డు తనమామది. పెండ్లిఅయినంక చాలాసార్లు అటు పోతూనో యిటుపోతూనో చూసుకొని ముసిముసిగ నవ్వుకునేటోల్లు. వాళ్లసరసం ఆ ముసిముసి నవ్వులతోనె సరిపెట్టుకోవలసి వచ్చేది. లోపటలోపట నారాయణ బాగా బాధపడేవాడు. పెండ్లిఅయి యింతకాలం అయినా భార్యను తీసుకరానందుకు అదోతరీఖమొఖం చిన్న బుచ్చుకునేటోడు. తీసుకొస్తైమాత్రిం ఏంలాభం? ఒకేఒక్క-

గుడిశె పోనీ పక్కన రెండు సిమెంటురేకులుకొని పెడ్తు తీరుగవేద్దామంటె అరిచెయ్యి వెడల్పు జాగాకూడాలేదు. అవుతలికి యివుతలికి పోవాలంటెనే ఎంతో దూరం బోవాలె. ఆపాటికి ఆసామికి గోచిలోనెపడుతుంది! అంతదూరం మరి!

నారాయణ మంచంలో అటూయిటూ అసంతృప్తిగా కదిలిండు ఆ కదలికలో సహజంగ ఆ వయస్సులో మరోమనిషి పొందుకోసం పడే న్యాయమైన ఆరాటం వున్నది. అదినెరవేరడం లేదని అసంతృప్తి వున్నది.

చిన్నగుడిశెమీద, కన్నవాళ్లమీద ఒక్కోసారికోపంవస్తుంది. సరిగ్గా అదే కోపం యిప్పుడూ వచ్చింది. వీరయ్య ఆలోచనల్ని ఆపేసుకుని మంచంపక్కకు నడిచిండు. మీద నీడ పడటంలో కొద్దిగాతలతిప్పి చూసిండు· చూసి అలక్ష్యంగా అటు తిరిగిపడుకున్నడు నారాయణ. వీరయ్యకు ఎట్లా చెప్పడమో తోచలేదు. పైనపందిరి కట్టెను ఆసరాగపట్టుకుని నారాయణను వుద్దేశించి,

"అవ్వపొద్దట్నుంచే చెప్తాందట! పోయి 'పొల్లను' తీసుకచ్చుకోరాదు బిడ్డా!" అన్నడు. నారాయణమంచంలనుంచి చివ్వనలేచిండు లేచి చెప్పులు తొడుక్కచ్చుకోని బయటవీధిలోకివచ్చిండు. వీధి సన్నగావున్నది చెత్తగావున్నది. మురుగుకాల్వలతో బురదగావున్నది. అయినా 'దబదబ' నడిచిపోతున్నడు! కొద్దిదూరంలోనెవున్న 'కోల్ స్క్రీనింగ్' ప్లాట్ ఫారమ్‌లోంచి దడదడ బొగ్గుపెళ్లలు బంకర్లలోపడుతున్నచప్పుడు వినబడుతుంది. ఎదురుగ గోదావరిఒడ్డుకు కొద్దిదూరంలవున్న పవర్ హౌజ్‌లోంచి కాంతి పైకిచిమ్ముతోంది నారాయణ యిరుకుసందులోంచి చిన్నవీధిలోకి వచ్చిండు. వీధిలో జనసంచారం రోజులాగే జోరుగావున్నది. వచ్చేపోయెవారితో సందడిగవున్నది. వెన్నెలవెలుగులో సన్ననిదుమ్ములేస్తున్నది. మామూలుగ అలవాటుతప్పని పందులు, కుక్కలు, గాడ్దులు ఆవీధుల్లో, వీధుల్లోని గుడిశెలచుట్టు తిరుగుతున్నయి. నారాయణకు ఒకామె ఎదురైంది. ఆమెనెత్తిమీద గంపనిండ సామానున్నది. ఆమెముఖంమాత్రం హుషారుగున్నది. "నీతలపండుపలుగ, కనబడ్త నేలెవ్వ" అని మోటు పరాశిక మాడింది నారాయణతో. నారాయణకు ఆమె వరసకు వదినఅవుతుంది. మరోసారి అయితె "నీఅసోంటోళ్లను ఎంతమందిని యీ సేతుల్తోని అవుతలవారేత్తనో వదినా!" అనేవాడు. కాని పరిపర పోనేపోయింది. "పిలగానికిఏమొపుట్టింది" అనుకుని పందు తిరిగి పోయిందామె. నారాయణ కొద్దిదూరంనడిచి ఒక పాన్‌షాప్ ముందున్న చెక్క బెంచిపై కూర్చున్నడు షాప్‌లో పెట్రోమాక్స్‌లైటు వేడిగా వెలుగుతున్నది షాపుల కూర్చున్న దొడ్డుమొఖపాయినె పత్రికపట్టుకుని 'వరవర' విసురుకుంటూ."

"ఏంగావాలె తమ్ముడూ?" అని అడిగిండు.

"పాన్ కట్టు"

"ఎన్నడులేంది యిదేంబుద్దిరో? ఏంపాన్ గట్టాలె"

"ఏదో ఒకటి"

"అందేందిరో పోరిమీద అలిగినవా" పరాశికమాడిండు షాప్ అతను, నారాయణ తనవెనుక ఎవరో నిలబడ్డట్టు అయేసరికి వెనుకకు తిరిగిచూసిండు, చూసిముఖం చిట్లించిండు.

"పొమ్మని అంటెనె గిట్ల వురికత్త వేందిబిడ్డా?" అన్నడు నిమ్మళంగ వీరయ్య.

"వురికిరాక ఏంజెయ్యాలె?" మాటలు తయారుచేసి పెట్టుకున్నటు అన్నడు నారాయణ.

"అదిగాదుబిడ్డా రేపుపొద్దునపోతె సాయంత్రిం తీసుకోనిరావచ్చుగద" వీరయ్య మాట పూర్తిగాకముందే మళ్లలేచి నిలబడి

"తీసుకచ్చుకోని ఎవలమంచంకిందపండపెట్టాలె" అన్నడు అని పాన్ అందుకుని యింటిముఖంబట్టిండు. వీరయ్యప్రాణం వుస్సురన్నది. షాపువాలా తండ్రీ కొడుకుల సంభాషణవిని వీరయ్యను పిలిచి "కొద్దిసేపు అట్లబెంచిమీదకూసో: లక్ష్మి రాజం వస్తడు" అనిచెప్పి ఎవరోవస్తే పత్రికలు అమ్ముకోవడంలో మునిగిండు.

వీరయ్యకు కొడుకుఅన్నమాటలు యాదొచ్చినయి వాడన్నమాటల్లో తప్పేం వున్నది అనుకున్నడు. ఆవయస్సు అటువంటిది. ఆవయసులో తాను సూర్యమ్మ కలసి పల్లెటూళ్లోగడిపిన వైభవం యాదికొచ్చింది. "ఛీ ఛీ ఒక్కకొడుకు, పెండ్లంటచేస్తే ఓగుడిశెకట్టియ్యకపోతి" అని విచారపడ్డడు. తనఅశక్తతమీద అసహ్యంవేసింది. "సీతల్లి! యిన్నేండ్లు బాయిపనిచేసినా ఒకకోటరుకూడ యియ్యకపాయె తంపిని." అని బయిటికే అనుకున్నడు, 'ఎట్లనన్నజేసి పోరనికి ఓగుడిశెకట్టాలె, రేప్పొద్దున బాయికాడ చెప్పాలె వీల్లైతే లచ్చిరాజంకు కూడచెప్పాలె. వాళ్లుఅయితేనే కన యాడనన్న జాగ చూసి గుడిశె నిలబడెటట్టుచూస్తారు. నావొక్కన్నుంచి అయేపనిగాదుమారె., యింకా ఆగుతెపోరడు తెర్లయితడు "అనుకుంట కూర్చున్నడు.

"ఏం పెద్దయ్యా.. తీరిపారికూసున్నవు?"

"తమ్ముడింట్లనెవున్నడా?" అని వీరయ్యను వుద్దేశించి ఎవరో అడిగిండ్రు. వీరయ్యతలెత్తి వచ్చిన మనిషిదిక్కుచూసిండు. బాగాపరిచయంవున్నమనిషి.

అమ్మోరు మచ్చలమొఖం. బక్కమనిషి. అంతలోనె షాపుఅతను కలుగచేసుకుంటూ "నీకోసమె కూసున్నాడు" అనిచెప్పిండు. "అట్టనా" అని చేతిలోవున్నపుస్తకాలు బెంచిపైపెట్టి విషయం చెప్పమని ఆసక్తిగఅడిగిండు లక్ష్మిరాజం. వీరయ్య క్రితందాక జరిగిన తనయింటిసంగతి చెప్పిండు. అంతావిన్న తరువాత,

"పెద్దయ్యా యిది గుడిశెగుడిశెథాగోతమే! నీకెరుగనే శానమందిచెప్తాండ్రు. ఏదో ఒకటిచెయ్యాలె ఆ రైలుకట్టావల కంపిని ఖాలిజాగ బోలెడున్నది. కొద్దిగధైర్యం జేస్తే సూత్తిమసెటాలకు తలో గుడిశె ఏసుకోవచ్చు" అన్నడు లక్ష్మిరాజం.

"మాయ్యగాడుబాంచెను. అదేదో జెరజెప్పవ అయేటట్టుసూడు" అనిలక్ష్మిరాజంను ప్రాధేయపూర్వకంగ బెంజ్యపడ్తున్నాడు. చెయ్యివిడిపించుకొని "రేపొద్దున బాయి కాడ మనోళ్లందరికి చెప్తాం. అందరికి యిదే యిబ్బందిగద. అదిగాక ఈగుడిశెల్ల ఒక్కబాయి కార్మికులెరుగద, ఏదో ఓరాత్రిపూట చూసుకుని గుడిశెల్ల మీటింగుబెడ్దాం. ఏదేమైన మేంగూడ ఓసారికలుసుకోనిమాట్లాడుకుంటం అయితె ఈవిషయంబయిటికి తెలుసుడు మంచిదిగాదు. రెండుమూడురోజుల్ల ఏదో ఒకటితెలుస్తదిగని నువ్వేం ఫికర్ పెట్టుకోకు." అని పుస్తకాలు తీసుకుని పోతుంటే వీరయ్య మళ్లదీనంగ అన్నడు. "గా రంధిపాత్తె నాకు నిమ్మళంవిడ్డా!" అన్నడు. "నేను తమ్మునితో చెప్తలేవె, ఆలుగుతె అయితమూ పనులుముందుబడిచెయ్యాలెగని. నీకేంరంధిఅక్కర్లేదు నారాయణను ఓసారికలుపుకును" అని మరెవరోకలిస్తే మాట్లాడుకుంటపోయిండు. వీరయ్య కొంచెం నిమ్మళంగ యింటిదారిపట్టిండు.

2

ఉదయం ఏడుగంటలకు పదినిమిషాలుముందుగానే ఏడుగంటల సైరన్ ఏడ్చినట్టు కూసింది. చీమల్లాగున సరసరలాడుతూ, సైకిల్ గంటలు గణగణలాడిస్తూ డ్యూటీలకు పోతున్నరు కార్మికులు. రోడ్డుమీద బొగ్గుటాన్స్‌పోర్టుచేసేలారీలు చాలావేగంగా బొగ్గు దుమ్ములేపుకుంటు పరుగెత్తుతున్నయి. సైకిల్ మోటార్లు యింకా పెద్దఅధికార్లు, అన్నీ కలిసి ఆరోడ్డంత చాలాసందడిగ వురుకుల పరుగులమీదవున్నది. అటువంటి లారీ రోడ్డుకు రైల్వేలైనుకు మధ్య అరకిలోమీటరుపొడుగునా నిన్నటిదాక ఖాలీగకన్పించిన జాగాల్లో యీరోజు కన్పిస్తున్న గుడిశెల్ని చూస్తూ ముగ్ధులైపోతున్నరు కార్మికులు. మదుర్లు ముడిచికూచి చూస్తుపోతున్నరు అధికార్లు. ఎంతలేదన్నా అయిదువందల పైచిలుకు గుడిశెలు. అవన్నీ తాత్కాలికంగ వేసుకున్నవేనని చూసేవాళ్లు చూడంగనే

అనుకుంటున్నరు. వెదురుబొంగులతో, తడికలతో తెల్లారేసరికల్లా గుడిశెలులేచికూర్చున్నాయి, తలుపులుగోడలు పైకప్పులు అన్నీ కంకతడుకలే కొంతమంది కార్మికులు మాత్రం "యిదంతప్లాను ప్రకారమే జరిగుంటది" అని తీర్మానించుకున్నరు. యీ ఖాళీజాగాలో గుడిశెలువేసుకోవడం చూసిన కాలరీ కార్మికులుకొందరు మరునాడు తెల్లారెసరికల్లా ఖాళీగవున్న కంపెనిభూముల్ని తలాయింత హద్దురాళ్లపాతి యిండ్ల కోసం ఆపేసుకున్నరు.

నారాయణకు మూడోవరుసలో అయిదోయిల్లువచ్చింది. చంద్రినితీసుకవచ్చిండు. ఒక్కొక్క గుడిశెలో ఒక్కొక్క చిన్న సంసారం. అంతా దాదాపు పడుచువాళ్లే! వాళ్లలో ఒకటే సంతోషం, ఏదోసాధించామని తృప్తి. ఆ కొత్తగుడిశెల ప్రాంతమంత వెదురు వాసనవేస్తుఅదోరకంగ బాగున్నది అంతా ఆ గుడిశెకూ యీ గుడిశెకు ఆసుగొయ్యలతీరుగ హడావిడి చేస్తున్నారు. ఓ వారంరోజులు గడిచినయి. నారాయణ ఇంటికి అటుఅత్తగారు యిటుఅవ్వగారు వచ్చి మంచిచెడు కనుక్కపోతున్నరు. యిద్దరు వియ్యపురాళ్లమధ్య మంచి సఖ్యతకూడ కుదిరింది ప్పుడు. నారాయణ వారంరోజుల్లో నాలుగురోజులు సెలవు పెట్టిండు. భార్యతోకలిసి మూడు సినిమాలు చూపిండు. యింట్లోకి కావాల్సిన సామాను కొనుక్కోమని తన జీతంలోంచి కూడ కొంత కొడుక్కేయిచ్చిండు వీరయ్య. రెండువందలరూపాయలు గుడిశెక్కావలసిన కంకబొంగులు, తడికెలు వగైరాకు ఖర్చుఅయినవి. యింకా బాగనె మిగిలింది. యింట్లోకి కొంత సామానుకొనుక్కున్నడు. మిగిలిన దాంట్లోంచి 'గుడిశెల కమిటీ'కి సంతోషంగ లెక్కప్రకారం యిచ్చుకున్నడు. అ విధంగ చంద్రితో కలిసి మహదానందంగ గడుపుతున్నాడు నారాయణ. యిక కష్టం తీరిందని అనుకున్నరు. కొన్నాళ్లకి నాలుగు గోడలులేపుకొని పైన నాలుగు సిమెంటురేకులు వేసుకుంటె చింతతీరుద్దని తలపోసిండ్రు. గుడిశెవెనుక నాటవలసిన బంతిచెట్లగురించి చంద్రి ఆలోచించింది. కాని కార్మికులు ఒకటి తలిస్తే మేనేజిమెంటు మరోటితలిచె!

3

వాళ్ల ఆనందాన్ని నింపుకపోవుటానికి ఒకనాటి తెల్లవారుఝామున పదిలారీలు, వందమంది సాయుధులైన పోలీసులు రెండు వందలమంది గనుల కంపెనీ వాచ్ మన్ను, పోలీస్ఇన్స్పెక్టర్, కంపెని వాచ్మన్ఇన్స్పెక్టర్ వచ్చిదిగిండ్రు. ఆమీన్ దిగుతూనె లాఠీకర్ర అటూయిటుతిప్పుకుంట గుడిశెల ముందటికివచ్చిండు.

వ్యూహించిన పరిణామంగనుక చాలామంది కార్మికులు బెదరలేదు. అప్పటికే గుడిశె ల్లోని ఆడామగా వీధుల్లోకి వచ్చిచేరిండ్రు.

అమీన్ నారాయణగుడిశెముందుకచ్చి ఆగిండు. తడికమీదకర్రతో ఓదెబ్బ వేసిండు. నారాయణ గుడిశెలోపల్నుంచి రఁయే....మని బయటకువచ్చిండు. చంద్రి కూడ గుమ్మల నిలబడిచూస్తున్నది.

"ఏంరా? గుడిశెలు ఎవల్నడిగివేసుకున్నర్రా?" పెద్దజమీందారు తీరుగనె అడిగిండు అమీన్. మరివాళ్లది దేశ్ముఖుల వంశం

"కంపెని జాగానేనాయె! కంపిన్లపన్జేసెటోళ్లమేనాయె ఎవళ్నడుగుడేంది". నారాయణ జవాబుల వినయంలేదని కోపంగచూసిండు అమీన్.

"కావన్నంటెమేం జి. యమ్ (ఇ.డి.)ను అడుగుతమ్గని గుడిశెలు పీకుటా నికి వీల్లేదు" జబర్దస్తిగ పిల్లికండ్ల కార్మికుడొకడు ముందుకచ్చిండు. ఆ కండ్ల దిక్కు గుర్రుగ చూపిండు అమీన్. చూసి ఒకడుగుముందుకువేసి,

"అంతా మీ యిష్టమైతె నడుమమేయెందుకురా సువ్వర్...." అన్నడు.

"సువ్వర్ 'గివ్వర్ అంటె బాగుండద"ని ఒకడుగు కూడ వెనక్కి వేయకుండనే అన్నాడు అదే కార్మికుడు.

"మాట్లాడుకునేది మాట్లాడక గాతిట్టుకునుడుఏంది" ఒకామె.

"గుడిశెలు పీకుతరా! పీకించాలా" ఒకపోలీసు ముందుకచ్చిండు.

"నీకేమైతాందయ్యా....లావు....ఏమో మీ తాతపెరట్లఏసుకున్నట్టు మాట్లాడ్తానవ్?" గదమాయించినట్టు ఓదెమ్మ అన్నది.

"చూసిరమ్మంటె కాల్చుకతినచ్చినట్టు, వీళ్లజులుమేదండిది" పోలీసువెనక్కి తగ్గిండు. "తెచ్చిపెట్టుకున్నధైర్యంబూడు" అని ఒకడన్నడు మరొకనితో మెల్లగ

"పీకిపారేసుటానికిఏసుకోలేదు" జారుతున్న పిల్లలను ఎగదోసుకుంట ఒకామె ముందు కచ్చింది.

"అసలు పోలీసులకు గిదంతోని ఏమి సంబంధం?" పాయింటులాగింది బెల్లంపల్లి లచ్చమ్మ.

"అసలా గుడిశెలు [illegible]

"ఎవరెందుకు వేయించుతరయ్యా? కడుపునొచ్చెనోడు వోమ బుక్కుతడుగని" కొమురయ్య మందిలకెల్లి ముందుకచ్చి అన్నడు.

"బాగతింటె కడుపు నొస్తదిబిడ్డా! గుడిశెలెవలుఏయించిండో్రి పేర్లుచెప్పు" అమీన్.

"మళ్లగట్లనె అడ్గుతావేందయ? వుండుటానికి జాగలేక మేం అందరం కలిసే ఏసుకున్నం. దానికిమీరు తఖద్దమ్ చేస్తే ఎట్లనయ?" అని గాజులు గలగలలాడు తుంటె పిల్లవాన్ని పొదివి పట్టుకుని ఒక లంబడి స్త్రీ అన్నది.

ఆమెచంకలవున్న చిన్నపిల్లవాడు అమీన్‌మొఖంమీద గొర్రెకొమ్ముల తీరుగ వున్నమీసాలు గొంగళిబొంతపురుగులతీరుగ కదులుతుంటే చాలాతమాషగచూస్తున్నడు. అమీన్ కొమురయ్యదగ్గరికివచ్చి బుజంమీద లాఠీఆనించి.

"లావులావు ముంధొస్తున్నవు లీడరువా బిడ్డ? గుడిశెలుఏయించిండీ రాడికలోల్లా యిప్లోల్లా? చెప్పుబిడ్డ నీకేం బియంలేదు." అన్నడు చిన్నగ లాఠీతోకొడుతూ.

"ఏమొదొంగన్ జేసినట్టు జేస్తున్నవ్ ముందీకజ్జైతియ్....యిప్లోల్లట రాడికలోల్లట! యిగ గవాళ్లకే గుడిశెలుఅక్కరగని ఎవనికిఅక్కెరలేదు." అన్నడు కొమురయ్య చీదరించుకున్నట్టుగ.

"యిట్లయితే ఏడచెప్తర్ బేవకూఫ్స్! లోపలేసితంతెచెప్తరు" అనుకుంట వెనక్కుతిరిగి "పీన్నిపట్టుకోండి" అనిచెప్పిండు. కొమురయ్యభార్య కొమురయ్యను వెనక్కుతోసి ఆమెముందుకచ్చింది, కొమురయ్యతప్పించుకో చూస్తున్నాడని అను మానించిన పోలీసుమందిలోంచి ముందుకుపోబోయిండు. ముసలోని చేతికర్ర కాళ్లల్లయిరికి పోలీసుబోర్లబొక్కపడ్డడు. లోపలున్నపోలీసులు పడిపోయిన పోలీసు దగ్గరకి రాబోయిండ్రు అంతే.... గడబిడమొదలైంది. నూకేసుకునుడు, దొబ్బేసు కునుడు, తిట్టుకునుడు దాకవచ్చింది. లాఠీలు కార్మికులమీద యిష్టంవచ్చినట్టుపడ్డయి. పిల్లలుఏడుస్తుంటే కొంతమందిస్త్రీలు శాపనార్థాలకిదిగిండ్రు. అపురూపంగ కట్టుకున్న పిట్టగూళ్లవంటి గుడిశెల్ని వాచ్‌మన్నుపీక్కొని లారీల్లోవేసుకుంటుంటె వాళ్లగుండెల్ని ఎవరోచేత్తో పెకలించినట్టు అయిందివాళ్లకు. వాళ్లనెత్తురు పొంగింది. పిడికిల్లుబిగుసుకు పోయినయి. అటునుంచి తుపాకులు పేలినయి యిటునుంచిరాళ్లుపడ్డయి వురుకులు పరు

నట్టు వురికిండ్రు. యిరువైమంది కార్మికుల్ని ఏడుగురు స్త్రీలని యిద్దరుపిల్లలతోసహా అరెస్టుచేశారు. అరగంటలో అయిదువందల గుడిశెల్నిపీకి పదిలారీలలో వేసుకుని కంపెని మెయిన్‌స్టోర్‌కుపోయిండ్రు. మళ్ల ఎప్పటితీరుగనె ఆప్రదేశం వెలవెల బోయింది. దెబ్బలుతిన్న కార్మికజనం పాతగుడిశెలదిక్కు వురికిండ్రు. చంద్రిఏడ్చుకుంట అవ్వగారింటికిపోయింది రోడ్డుపై లారీలు రైల్వే,లైనుపై వ్యాగెన్లు బొగ్గునింపుకొని ఏమీ ఎరగట్టు పోతూనేవున్నయి. ఆరోజంతగుడిశెల్లో వుద్రిక్తతచోటు చేసుకున్నది.

4

డ్యూటీలకు పోతున్నపుడు, బొగ్గుబాయిలకుదిగి పనిచేస్తున్నపుడు తిరిగివస్తున్నపుడు ఒకరికొకరు గుసగుసలుమొదలుబెట్టిండ్రు. లక్ష్మిరాజం, బాలయ్యవంటి కార్మికులు మళ్ల గుడిశె గుడిశెకు తిరుగుతున్నరు.

వేయివిధాల నచ్చచెప్తున్నరు. సందుగొందుల్ల పోలీసు జీబులుగూడ వురుకుతనే వున్నయి. కాళ్లకు బలపాలు కట్టుకున్నట్టు తిరిగి కార్మికుల్ని, మిగితా గుడిశెలకమిటీ మెంబర్లని కుప్పేసిండ్రు. దూరంగా వీధులన్ని కావలికాండ్రతోవున్నయి. మసక వెన్నెట్ల మీటింగు మొదలైంది. లక్ష్మిరాజం పక్కగుడిశెలనుంచి కొంచెం బయటకు వచ్చిండు. కార్మికులనుద్దేశించి.

"కామ్రేడ్స్ .... మనం అనుకున్నట్టుగనె గుడిశెలుఏసుకున్నంకని కొత్త యూనియన్ల మద్దతుతో పోలీసులసాయంతో కంపిని మన గుడిశెలు పీకించింది. యిదంత మీకెరుకే. సమయం మంచిగలేదు. తొందరగ మనం మాట్లాడుకోవాలె. అందుకని మల్లమనంఏంజేస్తే మంచిగుంటదో మీకు తోచిందిమీరు చెప్పండి?" అని వూకున్నడు

"ఏంజేసుడేంది. నీయక్క బాయిలుబందుపెడ్తె తెల్తదితడాఖ."

గుంపుల్నుంచిరాయివిసిర్నినట్టు ఒక కార్మికుడన్నడు. ఒకాయన కోపంగ లేసి పొగాకును తుపుక్కున వుమ్మి

"అనుటానికేంది? ఎన్నైనఅనవచ్చు. కని వూకె బాయిలు బందుపెడ్తె

"మరేంజేసుడయ్యా?" సందుపండ్లల్ల పుల్లకుచ్చుకుంటు ఒక కార్మికుడు. "అరెస్టు చేసినోల్లను యిడిపియ్యాలెముందు" వెనుకనుంచిఎవరో! దానిమీద ఓ ముసలాయన కసురుకుని లేచి నిలబడి " ఏదోఓటి చెయ్యాలె, వాల్లను యిడిపిచ్చుడు మల్ల గుడిశెలు నిలబడెటట్టుచూసుడు. రొండు ఒక్కపనితోనేకావాలె" అని కూసున్నడు.

"కలెక్టరుకు చెప్తె?" ఒకడు.

"పానంబోతుందిరకొడుకా అంటె! పుడుకుడుకుఅంబలి తాగిఅత్తానవుండు. అన్నట్టుగ అయిద్ది" మరో కార్మికుడు.

"మరి కోర్టుల కేసుబెడ్తె?" అనుమానంగనె ఇస్మాయిల్ పనిగిండు. అందరు గుయ్యిమని లేచిండ్రు.

"ఏందని కోర్టుకెక్కుతవ్రి?"

"కోర్టంటె మాటలా?"

"వెయిలకు వెయిలు పైసలుగావాలె"

"ఆపతి పడంగ తోలితె అంబాడంగ అచ్చినట్టు అయిద్ది"

"కోడికోసం కోర్టుకు బోతె కొంపే అమ్ముడుబోయిందట ఎనుకట"

"కోర్టులు గీర్టులు జానాతనహీ!" దూదేకుల సాయెబు

"సేత్తె మనమే ఏదో ఒకటి సెయ్యాలెగని ఒగనిమీద ఆశపడద్దు" అని మరో మనిషి సలహా!

"అనుకునేదేదో జెప్పనఅనుకోండ్రి. మల్ల పోలీసులత్తె కొట్టుకోలుమొత్తు కోలు" అన్నది ఒకామె.... "పోలీసులంటే మీఆడోళ్లకు లడలడాంటది."

"బొ పిలగా.... మొన్న వురికినోల్లంత ఆడోళ్లే" అన్నది అదేత్రి. కొద్దిసేపు అటూయిటూ చర్చించుకున్నమీదట అందరి అభిపాప్రియాలు కనుక్కున్న మీద లక్ష్మ రాజం తనఅభిపాప్రియం చెప్పిండు. చెప్పి అందరిదిక్కు పరిశీలనగ చూసిండు. అందరు సంతృప్తిగ తలలాడించిండ్రు. అది రహస్య మీటింగు గనక ఆగి పోయిండ్రు. లేకపోతే గింగుర్లెత్తె నినాదాలు చేసేవారు. అనుకున్నదాన్ని ఆచరణలో పెట్టడం ఆ రాత్రికిరాత్రె మొదలుపెట్టిండ్రు.

5

తెల్లవారింది. బొగ్గుబావులు యధాప్రకారం నడుస్తున్నయి. వాటినడకల గురించి రాతకోతలుచూసే కంపెని ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (E.D) కార్యాలయం ముందు

కమ్యూనిస్టు ప్రణాళిక - ఒక చారిత్రిక పరిశీలన

త్రిపురనేని మధుసూదనరావు

(గత సంచిక తరువాయి)

ప్రణాళికలో రెండవభాగం కార్మికులూ. కమ్యూనిస్టులూ మొదటిభాగానికి పరిణత వివరణగా, వయస్సుపెరిగినట్టుగా గతితార్కిత కొనసాగింపుగా రాయబడింది. కమ్యూనిస్టులు అంటే కార్మికవర్గాన్ని స్వవర్గచైతన్యవంతంచేసే అగ్రగామిదళం. బూర్జువావర్గపతనమూ. కార్మికవర్గవిజయమూ అనివార్యమని ప్రథమభాగంలో రుజువు చేయబడింది. ఆ విజయాన్ని సాధించేమార్గాలుఏమిటి? కార్మికవర్గం పోరాటం ఎలా చేస్తుంది? బూర్జువావర్గాన్ని నాశనంచెయ్యడం అంటే ఏమిటి? కార్మికవర్గరాజ్యంఎలా ఉంటుంది? అసలు కమ్యూనిజం అంటే ఏమిటి? మొదటిభాగంలోని ప్రతిపాదనల నుంచీ పుట్టే ఈ ప్రశ్నలకి సమాధానాలే రెండవభాగంలోనివస్తువు. కార్మికులకీ కమ్యూనిస్టులకీ గాఢానుబంధం లేకపోతే బూర్జువావర్గం పతనంకాదు. సిద్ధాంతరీత్యా కార్మికులు కమ్యూనిస్టులుకాకపోతే బూర్జువావర్గంమీద విజయాన్ని సాధించలేరు. కమ్యూనిస్టులకు కార్మికవర్గ ప్రయోజనాలకి భిన్నమైన, విడిగాఉండే ప్రయోజనాలు ఏమీ ఉండవు. కార్మికులు ఒకవర్గంగా రూపొందడం, బూర్జువాల ఆధిపత్యాన్నికూలదోయడం, కార్మికవర్గం రాజకీయాధికారాన్ని పొందడం కమ్యూనిస్టుల తక్షణ కర్తవ్యం. కమ్యూనిస్టులు వాస్తవ, నిర్దిష్టపోరాటాలనుంచీ నిర్ధారణలను చేస్తారు.

వుద్యోగులుమాత్రం చిన్నచిన్న వాహనాల్తో నిలిచిపోవాల్సివచ్చింది! చిన్నవుద్యోగులంత సంతోషంగున్నరు. కార్యాలయం చుట్టువున్న విశాలమైన ఆవరణలోని వేపచెట్ల కింద రేకులషెడ్లకింద, కార్యాలయం వరండాలోపల ఒకచోటేమిటి? సందులేకుండ కార్మికులు సంసారాలతో దిగిండ్రు.

ఆడవాళ్లు నిమ్మళంగ బొగ్గుపొయ్యిలు అంటించుకుంట ముచ్చట్లుబెట్టుకుంటున్నరు. గడంచెల్లో కొందరు కార్మికులు నిర్భింధిగ నిద్రపోతున్నరు. పసిపాపలు ఏడుస్తుంటె ముసలివారు సముదాయిస్తున్నరు.

వెనకగా కంపెని ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కారువచ్చిఆగింది. వాచ్‌మన్ బితుకు బితుకుమని చూస్తూ శాల్యూట్ కొట్టిండు. డైరెక్టరు ముందుకు చూసి కనుబొమలు ముడివేసిండు. ఆయనకు నాలుగురోజులకిత్రం గుడిశెలు పీకేయించిన సంగతి జ్ఞాపకం వచ్చింది. అట్ల జ్ఞాపకం వచ్చేసరికి ఆయన ముఖంల రకరకాల భావాలు రంగులు మారుతోన్నట్టు.........

కమ్యూనిస్టులమీద బూర్జువావర్గంచేసే తప్పుడు ఆరోపణల్ని మార్క్సు ఏంగెల్సు ఈ భాగంలో గతితార్కిక హేతువాదంతో ఖండించారు కమ్యూనిస్టుల వైఖరిని స్పష్టం చేశారు. కమ్యూనిస్టుల ఆశయాల్ని చెపుతూనే బూర్జువాలూ ఇతర పాలకవర్గాలూచేసే తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. ఆరోపణల్లోనే వాటి అభావాన్ని ప్రదర్శిస్తూ రెండింటిని అన్యోన్యసంబంధాల్లో చలనంలో ప్రతిపాదించారు. సొంత ఆస్తిని రద్దు చెయ్యడం కమ్యూనిస్టుల కేంద్రలక్ష్యం. మానవులు స్వయంకృషితో సొంతానికిఆస్తి సంపాదించుకునే హక్కుని కమ్యూనిస్టులు రద్దుచేస్తారనీ దాన్తో మానవుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అన్నీపోతాయని బూర్జువాలు ఆరోపిస్తారు చారిత్రికంగా ఆస్తి సంబంధాలు మారుతూనే ఉన్నాయి. ఫ్యూడల్ ఆస్తిసంబంధాలు రద్దుఅయిపోయి బూర్జువా ఆస్తిసంబంధాలు వచ్చాయి. నిజానికి బూర్జువావ్యవస్థలో అనేకమందికి సొంతఆస్తిలేదు. బూర్జువాల పెట్టుబడి పెరగడానికి కారణంఅవుతున్న అసంఖ్యాక కార్మికవర్గానికి సొంతఆస్తిలేదు. బూర్జువాలకున్న సొంతఆస్తి వాళ్లకష్టపడి సాంపాదించిందికాదు. శ్రామికుల అదనపుశ్రమ పెట్టుబడిగా, బూర్జువాఆస్తిగామారుతోంది. ఈ బూర్జువా సొంతఆస్తిని రద్దుచెయ్యడం కమ్యూనిస్టుల ఖచ్చితమైన ఆశయం. దీన్ని రద్దుచెయ్యడమే వ్యక్తిత్వాన్నీ స్వేచ్ఛనీ రద్దుచెయ్యడం అంటే బూర్జువావ్యక్తిత్వాన్నీ, బూర్జువా స్వాతంత్ర్యాన్నీ, బూర్జువా స్వేచ్ఛని రద్దుచెయ్యడమే బూర్జువావ్యవస్థలో స్వేచ్ఛ అంటే వ్యాపారస్వేచ్ఛ. క్రయవిక్రయాలస్వేచ్ఛ దీన్ని కమ్యూనిస్టులు రద్దు చేస్తారు. "కమ్యూనిజం ఏవ్యక్తికీ సమాజ ఉత్పాదితాల్ని సొంతపరుచుకునే హక్కు-లేకుండాచేయదు. అలాసొంత పరుచుకోవడం ద్వారా యితరులను కూలివాళ్లగా మార్చే హక్కునుమాత్రమే అది తొలగిస్తుంది." సామాజిక స్వభావంగల ఉత్పత్తి కొద్దిమంది పెట్టుబడిదారుల అధికారంలో ఉండేవిధానాన్ని తొలగిస్తుంది తప్ప కమ్యూనిజం అసలుఆస్తినే రద్దుచేయదు. సొంతఆస్తినిరద్దుచేస్తే శ్రమపడి పనిచేయడం ఆగిపోతుందనీ, ప్రపంచం అంతా సోమరితనం అలముకుంటుందనీ బూర్జువావర్గం ఆరోపిస్తుంది. "ఈవాదం నిజమేఅయితే సోమరితనంతో బూర్జువా సమాజం ఎప్పుడోనాశనం అయిపోయేది. యీసమాజంలో పనిచేసేవాళ్ళు యేమీ సంపాదించుకోలేకపోవడమూ, యేమైనా సంపాదించుకునేవాళ్ళు పనిచేయకపోవడమూ మనకి తెలిసిన విషయమే."

భౌతిక ఉత్పత్తిని గురించిన కమ్యూనిస్టుల ఆశయాల మీద చేస్తున్న ఆరోపణలే బూర్జువాలు బౌద్ధిక ఉత్పాదితాల మీద కూడా చేస్తున్నారు. వర్గ ఆస్తి అదృశ్యంకావడాన్ని అసలు ఉత్పత్తే అదృశ్యంకావడంగా బూర్జువాలు ఎలాభావిస్తున్నారో,

వర్గ సంస్కృతి అదృశ్యంకావడాన్ని మొత్తం సంస్కృతి అంతా అదృశ్యంకావడంగా భావిస్తారు.

"ఏ సంస్కృతి పోతుందని బూర్జువా విలపిస్తున్నాడో ఆ సంస్కృతి సమాజంలో అధికాధిక సంఖ్యాకులకు యంత్రాలలాగా పనిచేసే శిక్షణ మాత్రమే" బూర్జువా సమాజంలో సంస్కృతి అంతా అధిక సంఖ్యాకులైన కార్మికవర్గాన్ని ప్రత్యక్షంగా పరోక్షంగా బూర్జువావర్గ ప్రయోజనాలకి విధేయం చేస్తూ యంత్రాల్లాగా పని చేయించడానికి ఉద్దేశింపబడిందే. స్వేచ్ఛ, సంస్కృతి, న్యాయశాస్త్రం వంటివి బూర్జువా ఉత్పత్తి విధానం నుంచి పుట్టిన బూర్జువాసంస్కృతి, స్వేచ్ఛ న్యాయశాస్త్రం మాత్రమే. బూర్జువావర్గ ఆర్థిక పునాది పోతే బూర్జువా ఉపరితల అంశాలూ పోతాయి. చారిత్రికంగా పరిశీలిస్తే పూర్వమూ ఇలాగేజరిగింది. ముందూ ఇలాగేజరుగుతుంది. చచ్చిపోయిన యజమానికి బతికిఉన్నవాళ్ళు ఏమిసేవచేస్తారు. ఉపరితలం ఏదో ఒకపునాదికి ఉపరితలంగానే ఉంటుంది. తనకుఅనుగుణ్యమైన ఉపరితలం ద్వారానే పునాది చైతన్యరంగంలోకి వస్తుంది. కాబట్టే 'పోతోంది సంస్కృతి' అని రోదనం చేసేది బూర్జువా సంస్కృతిపోతోందనిమాత్రమే. అసలుఆస్తిరద్దుకానట్టే సంస్కృతి కూడా నాశనంకాదు. బూర్జువాఆస్తినీ, బూర్జువా సంస్కృతినీ మాత్రమే రద్దుచేయడం కమ్యూనిస్టుల ఆశయం. కమ్యూనిస్టులు కుటుంబాన్ని రద్దుచేస్తారనీ, విద్యని సమాజపరంచేస్తారనీ, తల్లిదండ్రులకీ పిల్లలకీ అనుబంధాల్ని తెంచివేస్తారనీ బూర్జువాలఆరోపణ. బూర్జువాకుటుంబం పెట్టుబడిమీదా, వ్యక్తిగతలాభంమీదా ఆధారపడిఉంది. ఈస్థితికి సంబంధించిన ఉన్నతరూపం బూర్జువాకుటుంబంలోనే ఉంది. ఈకుటుంబానికి కార్మికవర్గాల్లో కుటుంబంఅనేది ఆచరణలో లేకపోవడమూ బహిరంగంగా సాగే సానివృత్తి అనుబంధంగా ఉన్నాయి, బూర్జువాకుటుంబానికిఉండే అనుబంధ అంశాలు అంతరించినప్పుడు బూర్జువాకుటుంబం దానంతటదేరద్దు అవుతుంది. పెట్టుబడి అంతరించినప్పుడు ఆ రెండూ అంతరిస్తాయి. తండ్రులు తమపిల్లలమీద సాగించే దోపిడీని మేము అంతంచెయ్యాలి అనుకుంటున్నాం. నిజమే. విద్యలో సామాజికజోక్యం యొక్కస్వభావం మార్చాలనీ పాలకవర్గప్రభావంలో చిక్కుకున్న విద్యను రక్షించాలని కమ్యూనిస్టుల ఆశయం. ఇక స్త్రీలను గురించిన కమ్యూనిస్టులవైఖరిని బూర్జువాలు అసహ్యంగా వక్రీకరిస్తారు. స్త్రీలను సమిష్టిఆస్తిగా చేస్తారని బూర్జువాలగొడవ. బూర్జువాలకి భార్యకేవలం ఉత్పత్తిసాధనంగా మాత్రమే కనబడుతుంది. ఉత్పత్తిసాధనాలను సమిష్టిగా ఉపయోగించుకుంటారని అనగానే స్త్రీలకు కూడా అదేగతి సంభ

విస్తుందని బూర్జువాలు నిర్ణయించుకుంటారు. అదివాళ్ళ వర్గకుటిలపరిమితులు. నిజానికి సమాజచరిత్ర అంతటా మరీ ముఖ్యంగా బూర్జువావ్యవస్థలో స్త్రీలు సమిష్టిఆస్తిగానే ఉన్నారు. బూర్జువా వివాహావ్యవస్థే సమిష్టి పెండ్లాలవ్యవస్థ. ఈ బూర్జువావ్యవస్థ రద్దు కాగానేదానికి అనుగుణ్యమైన సమిష్టి భార్యావ్యవస్థకూడా రద్దయిపోతుంది. ప్రచ్ఛన్న, బహిరంగ వేశ్యావృత్తి రద్దు అయిపోతుంది. కమ్యూనిస్టుపునాదికి అనుగుణ్యంగా కుటుంబంకూడా మారిపోతుంది. ఇంతకీస్త్రీలను సమిష్టిఆస్తిగా చేయడానికో మరొకటి చెయ్యడానికో వాళ్ళు ఏమీ వస్తువులుకాదు. బూర్జువావ్యవస్థని శ్రామిక స్త్రీ పురుషులు కలిసే సమాధిచేస్తారు. ఇలాగే మతపరంగా, తత్వశాస్త్రపరంగా బూర్జువాలు కమ్యూనిస్టులమీదచేసే ఆరోపణలు అనేకంఉన్నాయి. మతనైతిక తాత్త్వికరంగాలకి సంబంధించిన "శాశ్వతవిలువల్ని" కమ్యూనిస్టులు నాశనంచేస్తారని బూర్జువావర్గం భారీఎత్తున ప్రచారంచేస్తుంది. కొన్నివేలసంవత్సరాలనుంచీ కొనసాగుతున్న విలువలు నాశనం అయిపోతాయని గొడవపెడుతున్నారు. "ఒకవిషయంమాత్రం గతించినయుగాలన్నిటికీ సమానలక్షణంగాఉంది యేదంటే సమాజంలో ఒకభాగాన్ని మరొకభాగం దోపిడీచెయ్యడం." కాబట్టి గతచరిత్రలో సామాజికచైతన్యరూపాల్లో ఎంతవైవిధ్యం కనిపించినా సారాంశంలోపోలికలే ఎక్కువఉంటాయి. "పరులసొమ్ము పామువంటిది" అనేది ఏవర్గసమాజంలో అయినా నీతిగానే ఉంటుంది. ఆస్తి సమాజపరమైనప్పుడు ఈ 'శాశ్వతనీతి' పోతుంది. "కమ్యూనిస్టువిప్లవం అనేది సాంప్రదాయిక ఆస్తిసంబంధాలతో అత్యంతమౌలికంగా తెగతెంపులు చేసుకోవడం. కనుక కమ్యూనిస్టువిప్లవం యొక్క అభివృద్ధిలో సాంప్రదాయికభావాలతో అత్యంతమౌలికంగా తెగతెంపులు చేసుకోవడం యిమిడిఉంది" కాబట్టి కమ్యూనిస్టువిప్లవం చరిత్రకి పూర్వదశఅయిన ఆర్థిక పునాదినీ ఆపునాదితోబాటు దానిఉపరితలఅంశాలనూకూడా నిర్మూలిస్తుంది. ఇదే కార్మికుల కమ్యూనిస్టుల మహత్తరఆశయం. ఈ ఆశయాన్ని కార్మికవర్గం రాజ్యాధికారాన్ని పొందడంద్వారానే క్రమగతిలో సాధించగలుగుతాం. "వర్గాలూ, వర్గవిభేదాలూగల పాతబూర్జువా సమాజానికి బదులు మనకొక నూతనసదస్సు లభిస్తుంది; ప్రతిఒకడూ స్వేచ్ఛగా అభివృద్ధిచెందినప్పుడే అందరూ స్వేచ్ఛగా అభివృద్ధిచెందగల సదస్సు అది" బూర్జువాలూ- కార్మికులూ అనే మొదటిభాగం "ఇంతవరకూ నడచిన సమాజపుచరిత్ర అంతావర్గపోరాటాలచరిత్రే" అనే వాక్యంతో ప్రారంభమయి కార్మికులూ- కమ్యూనిస్టులూ అనే రెండవభాగం వర్గరహితసమాజస్థాపనలక్ష్య ప్రకటనతో ముగిసింది. సిద్ధాంతం, ఆచరణ, కార్యక్రమాలు గతితార్కికంగా కలిసిపోయిన సమాజ ప్రస్థానగీతంలా ప్రణాళిక కార్మికవర్గాన్నీ, కమ్యూనిస్టుల్నీ పోరాటంలో ఉత్తేజపరిచింది.

ప్రణాళిక మూడవభాగం 'సోషలిస్టు కమ్యూనిస్టు సాహిత్యం' ఇందులో మార్క్సు, ఏంగెల్సులు తమకాలంనాటి, తమకు పూర్వకాలంనాటి సోషలిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని శాస్త్రీయంగా విమర్శించి ఖండించారు. వాటికీ తమ సిద్ధాంతానికి విభేదాల్ని స్పష్టంగా విశ్లేషించారు. హేస్ఫొయల్‌ఖాక్, బబేఫ్, సైమన్, ఓవన్ ఫోరియల్, ప్రూదన్ వైట్లింగ్, కాబెట్, బ్లాంకుక్యూ వంటి సోషలిస్టుల సిద్ధాంతాల్ని ఇంకా అనేక ఇతర సిద్ధాంతాల్ని వర్గపోరాట సిద్ధాంతంనుంచి విశ్లేషించారు. ఈ సిద్ధాంతాలు చాలావరకూ అభావం అయిపోయినప్పటికీ ఇప్పటికీ సోషలిజంపేరుతో అనేక సిద్ధాంతాలు ప్రచారంలోఉన్నాయి. ఈభాగం నుంచి మనం అశాస్త్రీయ సిద్ధాంతాల్ని వర్గదృష్టినుంచి పరిశీలించి నిరాకరించే వైధానికాన్ని ఈనాటికీ ప్రమాణంగా అనుసరించవచ్చును. ప్రణాళికలో నాలుగవభాగం 'ఈనాటి ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరిఅనేది కార్మికవర్గవిప్లవ ఎత్తుగడలకి సంబంధించింది. కార్మికవర్గానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులుపార్టీపెట్టరు. కమ్యూనిస్టుపార్టీయేకాక ఇంకా ఇతరపార్టీలుఉన్నప్పుడు వాటిపట్లపార్టీకిఎలాంటి వైఖరి ఉండాలి. కార్మికవర్గ అంతిమలక్ష్యం వెలుగులో కార్మికులతక్షణ ప్రయోజనాలకోసం కమ్యూనిస్టుపార్టీ పోరాటం చేస్తుంది. ప్రజాస్వామ్యంకోసం, కార్మికవర్గప్రయోజనాలకోసం కమ్యూనిస్టులు ఇతర పార్టీలతోకలిసిపనిచేస్తారు. ఆనాటి సాంఘిక, రాజకీయవ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్ని కమ్యూనిస్టులు బలపరుస్తారు. సకలదేశాల ప్రజాతంత్రపార్టీలమధ్య అయిక్యతని సాధించడానికి కమ్యూనిస్టులు కృషిచేస్తారు ఇలా ఇతరపార్టీలతో సంబంధం పెట్టుకున్నప్పుడు, ఉద్యమాల్ని బలపరుస్తున్నప్పుడు కమ్యూనిస్టులు తమ అభిప్రాయాల్నిదాచుకోరు. "సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ బలవంతంగా కూలదోయడం ద్వారానే తమలక్ష్యాలు సిద్ధించగలవనివాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవమంటే పాలకవర్గాలు గజగజవణకనీ. కార్మికులు పోగొట్టుకునేది ఏమీలేదు, తమశృంఖలాలుతప్ప. వాళ్ళుపొందవలసింది యెంతైనావుంది.

"సకలదేశాల కార్మికులారా, ఏకంకండి!"

అనే సింహగర్జనతో ప్రణాళిక భరతవాక్యం పలికింది.. ఇతర పార్టీలపట్ల, ఉద్యమాలపట్ల కమ్యూనిస్టులవైఖరిమీద ప్రణాళికలో చెప్పినది ఈనాటికి అన్వయిస్తుంది. మారినపరిస్థితులకు అనుగుణ్యంగా ఈ వైఖరిని మార్చుకోవలసిఉంటుంది. "యూరప్‌ను ఒక భూతం ఆవహించింది. కమ్యూనిజం అనే భూతం" అనే వాక్యంతో ప్రారంభమైన ప్రణాళిక "సకలదేశాల కార్మికులారా ఏకంకండి" కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించండి అనే పిలుపుతో పూర్తి చేయబడింది.

చారిత్రికంగా ఈ ప్రణాళిక దేశదేశాల కమ్యూనిస్టులకు మార్గదర్శకంగా ఈ నాటికీ ఉపయోగపడుతోంది. కానీ ఇదికేవలం ఒకదేశంలోని ఒకసమయంలోని కమ్యూనిస్టుపార్టీ ప్రణాళికకాదు. అన్నిదేశాల కమ్యూనిస్టులకీ రాజకీయ, ఆర్థిక, తాత్త్విక ఆదర్శపత్రం. ఇదికేవలప్రణాళికస్థాయిని ఆనాటికే దాటిపోయింది. మొదటి ఇంటర్‌నేషనల్ (1864-72)కే ఈ ప్రణాళిక కావడంసాధ్యంకాలేదు. రెండవ ఇంటర్‌నేషనల్ (1889-1914)కీ మూడవ ఇంటర్‌నేషనల్‌కీ (1919)కీ కూడా ఇది ప్రణాళికకాదు. కానీ అన్ని ప్రణాళికలకీ ఇది నేపథ్యంగాఉంది. తత్కాల ప్రణాళికలన్నిటికీ ప్రేరణగా, మార్గదర్శకంగాఉంది.

"ఈ చిన్నపుస్తకము ఎన్నో సంపుటాలకంటే విలువైంది. ఈనాటికీ నాగరిక ప్రపంచంలో పోరాటం చేస్తున్నకార్మికవర్గానికి ఈపత్రంలోని ప్రధానాంశం ఉత్తేజపరుస్తోంది. మార్గదర్శకంగాఉంది" (లెనిన్ సంపుటం-2 పేజీ24) మూడు ఇంటర్‌నేషనల్స్ కార్యక్రమాలకీ ఈ ప్రణాళికప్రాతిపదిక. అప్పటి పరిస్థితుల్ని ఆధారంగా చేసుకుని అదనంగా అనేక అంశాల్ని చేర్చుకున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని కార్మికవర్గఉద్యమాన్ని ప్రతిబింబించిన ఈ ప్రణాళికని సామ్రాజ్య వాద యుగంలో ఏ మార్పులూ, చేర్పులూ లేకుండా స్వీకరించడంసాధ్యంకాదు. లెనిన్ సామ్రాజ్యవాదయుగంలో కమ్యూనిస్టుపార్టీ వ్యూహాన్నిఎత్తుగడల్ని, కార్యక్రమాన్ని రూపొందించి విప్లవాన్ని విజయవంతం చేశాడు. 1928లో సామ్రాజ్యవాద యుగప్రత్యేక లక్షణాల్ని వివరిస్తూ " Program of the Communist International అనేపేరుతో స్టాలిన్ నాయకత్వాన Companion Volume of the Manifesto ని రూపొందించడం జరిగింది. చైనావిప్లవానుభవాన్ని సిద్ధాంతీకరిస్తూ మావో రాసిన New Democratic Revolution వ్యాసాల్ని కూడా మానిఫెస్టోకి అనుబంధంగా అధ్యయనం చెయ్యాలి. చారిత్రిక భౌతికవాదం, గతితార్కిక భౌతిక వాదం, వర్గపోరాటసిద్ధాంతం, కార్మికవర్గ విప్లవకరపాత్రల విషయంలో ఒక మహత్తర ప్రమాణపత్రంగా ప్రణాళికకు మార్క్సిస్టు సాహిత్యంలో తిరుగులేనిస్థానం ఉన్నప్పటికీ కార్యక్రమ సూచికగా గ్రహించాలంటే లెనినిజం, మావో ఆలోచనా విధానం వెలుగునుంచీ అదనపు సమాచారాన్ని అనుబంధంచేసుకోవాలి. సోషలిస్టు విప్లవాలకీ, నూతన ప్రజాస్వామిక విప్లవాలకీ, జాతివిముక్తిపోరాటాలకీ మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టుపార్టీ ప్రణాళికనే మార్గదర్శకంగా ప్రచారం చెయ్యడం గందరగోళాన్ని వ్యాపింపచేయడమే అవుతుంది. అలాగే ప్రణాళికని సిద్ధాంతస్థాయిలో ఒక చారిత్రికపత్రంగా మాత్రమే పరిగణించడం రివిజనిజానికిదారితీస్తుంది. మార్క్సిజం మార్క్స్‌తోనో ఏంగెల్స్‌తోనే ఆగిపోలేదు. ఆగిపోదు. ప్రణాళిక లోనే చెప్పినట్టు

"ఈ సూత్రాలు వివిధదేశాల్లో విభిన్నంగా ఉండడం సహజమే"

పోరాటభారతాన్ని అవమానపరుస్తున్న పోలీసు 'భారతి'

దుష్టులు దుర్మార్గులు చేసే అకృత్యాలన్నీ తన 'నిజం' పత్రికలో ప్రచురిస్తున్నందుకు కోపంతో ఆ సంపాదకుడి కాలునరికేస్తారువాళ్లు. ఐనా అతడుభయపడకుండా అలాగే పత్రికను నడుపుతూవుంటాడు. ఆయన తెలంగాణా సాయుధపోరాటంలో పాల్గొన్నవీరుడుగూడా. అందుచేత భయపడకుండా ప్రస్తుతం తీవ్రవాదులు చేస్తున్న దురాగతాలన్నీగూడా తనపత్రిక ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ తో పరిశోధింపజేసి ప్రచురిస్తాడు దాంతో తీవ్రవాదులు ఆ పత్రికా విలేఖరినిహత్యచేస్తారు.

ఈ పత్రికాసంపాదకుడికి ఒకమేనకోడలువుంటుంది. ఆమెకాలేజీలో చదువుతూ వుంటుంది. ఆవిడపేరు భారతి. సమస్తతత్వశాస్త్రాలనూ జీర్ణంచేసుకున్న విదుషీమణి, ఆమెకు కాస్త ఖాళీంపుంటే దాన్నొక రైతుకి కౌలుకిస్తుంది. ఈ పత్రికాసంపాదకుడి దగ్గరేఉంటూ తనతత్వశాస్త్రవిజ్ఞానంతో అతడికిసాయపడుతూవుంటుంది. సంపాదకుడి భార్య మాజీ విప్లవకవయిత్రి. ఆమెకి నృత్యం, సంగీతం రావటంవల్ల ఈ భారతికి అదంతా నేర్పిస్తుంది.

సంపాదకుడి కొడుకు తీవ్రవాదుల్లో కలిసిపోతాడు. అతన్నిభారతి ఎన్నోసార్లు మందలిస్తుంది. మార్క్సిద్ధాంతం మంచిదేకానీ ఇప్పుడది పాతచింతకాయపచ్చడి అని తనతత్వశాస్త్రజ్ఞానంతో అతడికివివరిస్తుంది కానీ తీవ్రవాదికావటంవల్ల అతడికి అవన్నీనచ్చవు. ఎర్రచొక్కా వేసుకుని సూట్ కేస్‌లో పిస్తోలూ, విస్కీసీసా పెట్టుకుని హత్యలుచేస్తూ తిరుగుతుంటాడు.

ఓసారి భారతిగురువూ, హక్కులసంఘం అధ్యక్షుడూ, లెక్చరర్ కృష్ణ, తోటి లెక్చరర్ అరుణతో కలిసి 'నిజం' పత్రికాసంపాదకుణ్ని చూడటానికివస్తాడు, ప్రజల మీద జరుగుతున్న అత్యాచారాలూ, అసాంఘికశక్తులు చేస్తున్నహత్యల్ని ఖండిస్తూ ఒక మెమోరాండంతయారుచేసి దానిమీద పెద్దలసంతకాలు సేకరిస్తూ సంపాదకుణ్ని గూడా సంతకంచెయ్యమంటాడు. సంపాదకుడు సమాజంమొత్తానికీ బాధ్యతవహించే వాడుగనుక, తీవ్రవాదులు చేస్తున్నహత్యలు మీకు కన్పించవా? వాటినిఖండించరా? అని సూటిగా ప్రశ్నిస్తాడు. లెక్చరర్ కృష్ణమౌనంగా ఉంటాడు. అప్పుడా సంపాదకుడు తానుగూడా తెలంగాణాసాయుధపోరాటంలో పాల్గొన్నవాన్నే అనీ, దానివల్ల తన ఆస్తి అంతాపోయి బికారినైనానని, అంతత్యాగం ఇప్పుడు విప్లవకారుల్లో లేదని, వి

వాన్ని వ్యాపారంగా మార్చిన విప్లవవ్యాపారస్తులు సమాజంలో అశాంతి సృష్టిస్తున్నారు తప్ప విప్లవంరాదనీ కృష్ణకు నచ్చచెబుతాడు. కానీ కృష్ణకు ఇదంతాఎక్కదు. ఇంతలో తనపత్రిస్సుని ఎవరో కాల్చేస్తున్నారని వార్తరావటంతో సంపాదకుడు భారతిసాయంతో పరుగుతీస్తాడు.

అసలు ఈ లెక్చరర్ కృష్ణ పెద్దతీవ్రవాదనాయకుడు. ఆయన మహాకామ్రేడ్. అందువల్ల ఆ మహాకామ్రేడ్ తమ విప్లవ పంథానివ్యతిరేకించే వాళ్లందరి పేర్లూరాసి ఆపేర్లకింద ఎర్రగీతలు పెడుతుంటాడు. అలా ఎర్రగీతలు పెట్టబడ్డవాళ్లందర్నీ ప్రజా స్వామ్య విప్లవకోర్టులో విచారించి శిక్షలువిధిస్తాడు. ప్రస్తుతం తమ విప్లవకార్యక్రమా లకి అడ్డుపడుతున్న భారతినీ, సంపాదకుడి భార్య ఐన మాజీ విప్లవకవయిత్రినీ పట్టి బంధించి తెమ్మని సంపాదకుడి కొడుకు, తీవ్రవాదపార్టీ సభ్యుడూ ఐన ఆనంద్‌ని ఆదేశిస్తాడు కానీ భారతి ఎప్పుడూ జనం మధ్య ఉండటంవల్ల బంధించితేవడానికి వీలు కాక తనతల్లినిమాత్రమే బంధించితెస్తాడు ఆనంద్. అందుకు అతన్నిమెచ్చుకున్నా భారతిని తేనందుకు అతనికి కొరడాదెబ్బల శిక్ష విధిస్తాడు మహాకామ్రేడ్; ఆనంద్ తనని తానే కొరడాతో కొట్టుకుంటాడు.

తర్వాత మాజీ విప్లవకవయిత్రిని విప్లవకోర్టులో మహాకామ్రేడ్, అరుణ ఇద్దరూ విచారిస్తారు. ఆమె ప్రస్తుతం కరెన్సీలోవున్న ఎర్రపురాణాన్ని నమ్మననీ, అదే పార్టీకి చెందిన మరో గొప్పవ్యక్తి రాసిన అబద్ధపురాణాన్ని మాత్రమే నమ్ముతాననీ అందుకే తాను మారాననీ చెబుతుంది. ఆ సందర్భంగానే—అంతరాత్మ గూర్చి ఆమె బోధిస్తుంది. రక్తపాతం లేకుండా విప్లవం ఎలావస్తుందో అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు వివరిస్తుంది. కానీ తీవ్రవాదపార్టీ నాయకుడు కృష్ణకి నచ్చదు ఆ అబద్ధ పురాణాన్ని చదివినందుకు శిక్షగా ఆమె కళ్లనిపొడిచెయ్యాలని ప్రజాకోర్టులో శిక్ష విధిస్తాడు. ఆ శిక్షని ఆమె కొడుకైన ఆనందే అమలు చెయ్యాలని ఆదేశిస్తాడు.

తర్వాత రెండో కేసుని విచారిస్తాడు. ఆ వ్యక్తి అరుణభర్తే. అతడు ఆమె విప్లవ కార్యక్రమాలకి అడ్డం వస్తున్నాడని, ఆమె గూర్చిన సమాచారం అంతా పోలీసులకి చెప్పాడని అభియోగం. అతడు రిజిస్ట్రార్ ఆఫీసులో గుమాస్తా. ఆమె లెక్చరర్. కాబట్టి ఆమె తనమీద అధికారం చలాయిస్తోందని అతనంటాడు. కానీ విప్లవవీరవాదిఐన కృష్ణ వినడు. అతడి శిరస్సు ఖండించి, మర్మాంగాలు చితకగొట్టి వలపిందిగా ఆదేశిస్తాడు. ఈ శిక్ష విప్లవవీరవనితఐన కామ్రేడ్ అరుణే స్వయంగా నిర్వహిస్తుంది.

తర్వాత ఒకరైతు కేసు. ఈరైతు భారతిదగ్గర పొలం కౌలుకి చేసేవాడు. దున్నేవాడిదేపొలం అనేది తమపార్టీ నినాదంకాబట్టి ఆ నినాదంప్రకారం పొలాన్ని నువ్వే హక్కుభుక్తం చేసుకోమంటాడు మహాకామేశ్రిద్. కాని ఆ రైతు ఇంలాటివి చాలాచూసివున్నాడు. ఎవరూ చేసేది ఏమీలేదు అంటాడు. పైగా పేదరైతులకి బాధలెక్కడివి? ప్రభుత్వం భూములు లేనోళ్లకు భూములిస్తోంది. ఆ భూముల్లో పండించటానికి సబ్సిడీ రుణాలిస్తోంది. ఎంత చిన్నరైతైనా—ఎండాకాలంపంట, వానాకాలంపంట, ఏదీలేనప్పుడు కూరగాయలుపండించి ఆ డబ్బుతో ఎంతపెద్ద అప్పునైనా కొట్టిఅవతలపారేస్తుంటే మీరీ అడవుల్లోకూచుని నిజాన్ని చూడటంలేదని విప రిస్తాడు. దాంతో మహాకామేశ్రిద్‌కి కోపం వస్తుంది.

అసలు ఈ వృద్ధరైతుకి ఒక కొడుకు వుంటాడు. వాడు వుత్తపోకిరీజులాయి. వాణ్నే, వాడిసావాసగాడు ఇంకొకణ్ని తీవ్రివాదులు మాయమాటలుచెప్పి తమపార్టీలో చేర్చుకుంటారు. అమాయక గ్రామీణులు గనుక వాళ్లని 'ఎర్రిస్వాములు' (తీవ్రి వాదులు) సంవత్సరంలోగా ఎర్రిరాజ్యం వస్తుందనీ అలా అని ఎర్రిపురాణంలో రాసి వుందనీ నమ్మిస్తారు ఎవరైనా చంపటం తప్పుగాదని తీవ్రివాదులు వారిద్దరికీ నూరిపోస్తారు. ఓసారి ఈ వృద్ధరైతు కౌలుడబ్బు భారతికిఇద్దామనిపోతుంటే అతని కొడుకు ఎదురుపడి ఆ డబ్బు భారతికిఇవ్వొద్దనీ, దున్నేవాడిదే భూమి అని ఎర్రిస్వాములు చెప్పారనీ డబ్బు లాక్కోబోతాడు. వృద్ధుడు మందలించి ఎర్రిస్వాములకీ నీకూ బుద్ధిలేదని కొడుకుని ఒక తోపుతోస్తాడు. దాంతో కోపంవచ్చి మాసాములోరితో చెప్పి నీపేరు కింద ఎర్రిగీత పెట్టిస్తానని వృద్ధుడికొడుకు కోపంగావెళ్లిపోతాడు. దానిఫలితమే ఈ విచారణ.

తమ విప్లవకార్యక్రిమాన్ని అమలు పరుస్తున్నకామేశ్రిద్‌కి అడ్డుతగిలావు గనక నిన్నుశిక్షిస్తానంటాడు మహాకామేశ్రిడు. వృద్ధరైతు తేలిగ్గానవ్వి దున్నేవాడిదేభూమి అంటున్నారు అలాగే ఉంచుకున్నోడిదే పెళ్లామవుతుందా? ఐనా దున్నగానే భూమి పండుతుందా?. ఇదివరకు ఇదేభూమిలో ఎకరాకు ఐదు బస్తాలు పండేవి. అప్పుడు నేనేదున్నేవాణ్ని. భారతమ్మ హయాం వచ్చాక ఎకరాకుయాభైబస్తాలు పండుతున్నాయి. ఇప్పుడూనేనేదున్నుతున్నా. ఆమెతెలివీ, నాశ్రిమా రెండూకలిసి ఆ పంట పండు తోంది. ఆమె తెలివేలేకపోతే అవే ఐదుబస్తాలు పండేవి కాదా? అప్పుడు ఇదంతా

ఈ పశ్నకి మహాకామేశ్రిడు దగ్గర సమాధానంలేదు. అతను మూర్ఖంగా నీకు మరణశిక్ష విధిస్తున్నాను. ఆ మరణశిక్షను నీకొడుకూ, మా కామేశ్రిడు స్వయంగా అమలుచేస్తాడు అంటాడు. అప్పుడా రైతుకొడుకు విప్లవావేశంతో తండ్రిని చంపి అతడి రక్తం "గట....గట....గట...."తాగి, రెండుగ్లాసుల్లో నింపుకొచ్చి కామేశ్రిడు అరుణకీ, మహాకామేశ్రిడుకీ అందిస్తాడు. అరుణ గ్లాసు అందుకునిచప్పరిస్తుంది. మహా కామేశ్రిడు ఆ రక్తం తాగబోతూవుండగా కామేశ్రిడు ఆనంద్ వస్తాడు. ఈ రాక్షసచర్య ఏమిటని అంటాడు. ఇది ప్రజల అభీష్టం దాన్ని మనంపాటించాలి అంటాడు మహా కామేశ్రిడు. ఆనంద్ ఎదురుతిరుగుతాడు. మీరు చేసే పనులకి ప్రజల ఆమోదం ఎక్కడుంది? తుపాకులు చూపి భయపెట్టి జనంతో చప్పట్లుకొట్టిస్తున్నారు తప్పితే మీ పట్ల జనానికి ఇష్టం ఎక్కడుంది? అంటాడు. మహాకామేశ్రిడు కోపంగా నీ పిస్తోలు మాకిచ్చేసి ఓమూలపడివుండు, నీబుర్రిలో అనుమానం ప్రవేశించింది. ఇకనిన్ను నమ్మరాదు అంటాడు. ఆనంద్ పిస్తోలుఇవ్వడు. పెనుగులాటలో ఆనంద్ బొడ్లోంచి అబద్ధపురాణం జారి పడుతుంది. మహాకామేశ్రిడ్ కోపంతో పిస్తోల్ తీసుకుని ఆనంద్‌ని కాల్చిచంపేస్తాడు.

తర్వాత కామేశ్రిడ్ అరుణతో అక్రిమసంబంధం పెట్టుకుంటాడు. హత్యలు, దోపిడీలు చేయిస్తూ. విస్కీలుతాగుతూ కోట్లాదిరూపాయలు పోగుచేసుకుంటాడు. అమాయకజనం గ్రామం నుంచి గంపల్లో భోజనం, విస్కీ, సారా పంపిస్తూవుంటే అడవిలో రాజభోగాలు అనుభవిస్తూవుంటాడు. విదేశాల్లో తన పిల్లల్ని చదివిస్తూ వుంటాడు. పట్టణాల్లో బిల్డింగుల్ని కట్టిస్తూవుంటాడు.

భారతి తీవ్రవాదుల్ని జనంనుంచి వేరుచెయ్యటానికని తన ఆటాపాటలతో గ్రామాల్లో ప్రచారం సాగిస్తుంది. ఆమెని ప్రాణాలోతీస్తేలక్ష, చంపితెస్తే యాభైవేలు బహుమానం ప్రకటించి మహాకామేశ్రిడ్ ఇద్దర్నిపంపిస్తాడు వాళ్లు ఆమెని పట్టుకునే ప్రయత్నంలో బాంబు సరిగాపేలక ఒకడు జనానికిచిక్కితే జనం వాణ్నిచావచితక తంతామంటారు. కానీ కరుణామయి అయిన భారతి అతన్ని తనకు తెలిసిన విషయాలన్నీ చెప్పితే పోలీసులు క్షమిస్తారనీ, తానందుకుపూచీ అనీ అంటుంది. అతడందుకు అంగీకరిస్తాడు. ఆ వ్యక్తి విప్లవ విద్యార్థి సంఘ అధ్యక్షుడు. ఒకప్పుడతడామె చెయ్యిపట్టుకుని అసభ్యంగా ప్రవర్తించబోతాడు. ఇప్పుడతని రోగం కుదిరి ఆమె కాళ్లు పట్టుకుంటాడు. ఇంకొకడు తప్పించుకుని మహాకామేశ్రిడు దగ్గరికిపోతాడు. భారతిని తేనందుకు అతణ్ని తిడతాడు మహాకామేశ్రిడు. వాడు ఎదురుతిరుగుతాడు.

పిస్తోలు తీసి కాల్చబోతాడు. అది పేలదు. అసలు పిస్తోలు మహాకామేశ్రిడు ఒక్కడి దగ్గరే ఉంటుంది. ఇతర్ల దగ్గరుండేవన్నీ దీపావళి పిస్తోళ్లు. మహాకామేశ్రిడు తన అసలు పిస్తోలుతో వాణ్నికాల్చేస్తాడు.

దీంతో తండ్రినిచంపి రక్తం తాగినకామ్రేడ్‌కి కోపంవస్తుంది. ఇదావిప్లవం? అని తనలో తాను ప్రశ్నించుకుంటాడు. ఈలోగా విప్లవ వ్యాపారస్తుడు మహాకామేశ్రిడు కృష్ణ చేస్తున్న విప్లవవ్యాపారం గూర్చి పత్రికల్లో పడుతుంది. అతని దురాగతాలన్నీ బట్టబయలవుతాయి. దాంతో కామ్రేడ్ అరుణకిగూడా అతని నిజస్వరూపం అర్థం అవుతుంది. భారతిని చంపుతానని బయల్దేరిన అతడి పిస్తోలులోని తూటాలు తీసి దాచేస్తుంది.

కావలాకాస్తున్న కామ్రేడ్‌ని తన స్త్రీత్వంతో లోబరుచుకుని మహాకామ్రేడు కృష్ణను ప్రజాస్వామ్య విప్లవమహాకోర్టులో శిక్షిస్తుంది, తర్వాత భారతివచ్చి అహింసా పరమోధర్మ అని మంగళం పాడుతుంది.

మార్క్సిసిద్ధాంతం పాతదైపోయిందనీ ఆయన ఆ సిద్ధాంతాన్నిరాసిన కాలానికీ ఇప్పటికీ సమాజం చాలామారిపోయిందనీ కాబట్టి ఆ సిద్ధాంతంపనికిరాదనీ ఈ నాటకంలో ప్రముఖంగా చెప్పబడ్డ అంశం. వినగానే నిజమని అనిపించే ఈ అబద్ధం మోకాల్లో మెదడుండేవాడు ఎంతబాగా ఆలోచిస్తాడో దానికి నిదర్శనం.

మార్క్సిజం పురాణాలు ఉపనిషత్తులలాగా ఏదో ఒకవిషయాన్నిచెప్పి ఊరుకునే "గ్రంథం"కాదు. ఒకవిషయాన్ని రికార్డుచేసే 'యంత్రం'కాదు. సమాజాన్ని విశ్లేషించే, నడిపించే విజ్ఞానశాస్త్రం గనుక సామాజికశక్తుల అభివృద్ధినిబట్టి అదిగూడా అభివృద్ధి చెందుతుంది. అలా అభివృద్ధిచెందే లక్షణం వుండటమే దానికున్నగొప్పతనం. దానిదృష్టిలో ఏదీగూడా 'శాశ్వతం' కాదు. ప్రతిక్షణం మార్పుచెందే లక్షణం వుండటమే అభివృద్ధికిపునాది. ఇది దానికి గూడా మినహాయింపుకాదు. అందువల్లనే సమాజం మారుతున్నకొద్దీ మార్క్సిజం. మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానంగా అభివృద్ధి చెందింది. ఇవాళ మార్క్సిజం అంటే మావో ఆలోచనా విధానమే.

ప్రకృతి శాస్త్రంగానీ, ఖగోళశాస్త్రంగానీ, వైద్యశాస్త్రంగానీ, వందఏళ్లకింద ఉన్నట్లుఇప్పుడులేవు, ఎంతోవృద్ధిచెందాయి. వాటిని వాటిపూర్వ ప్రాథమికచరిత్రతో, వందఏళ్ల నేపథ్యంతోసహా ఎలా అంగీకరిస్తున్నామో మార్క్సిజాన్ని అంగీకరించే

వాళ్లకూడా దాన్ని అలాగే అంగీకరిస్తున్నారు. వచ్చేచిక్కు ఎక్కడంటే మార్క్సి జాన్ని శాస్త్రంగా అంగీకరించని వాళ్లదగ్గరే. వాళ్లు గాంధీకీ మార్క్స్‌కీ పోలిక తెచ్చి గాంధీని మార్క్స్ కన్న గొప్పగాచూపటం హాస్యాస్పదం. సమస్త మతాలకు ధర్మా లకుచెందిన ప్రవక్తల ఛాయారూపం గాంధీ. అతనిభావాలు ఏ ఒక్కటిగూడా స్వతం త్రిమూకాదు, ఇదివరకున్న విషయాల విశ్లేషణాకాదు. మార్క్స్ అట్లాకాదు. అతడు శాస్త్రవేత్త. శాస్త్రజ్ఞులు వాస్తవాలమీద ఆధారపడతారు. ప్రవక్తలు విశ్వాసాలమీద ఆధారపడతారు.

ఈ నాటకంలో చెప్పినట్టు మార్క్సిజం పాతచింతకాయపచ్చడే ఐతే సమాజా భివృద్ధికి అది పనికి రాకపోతే అది తనంతతానే నశిస్తుంది. ఎందుకంటే సమాజం లోనేకాదు మానవశరీరంలో సైతం ఎక్కడ చలనం—ఘర్షణఉన్నాయో అక్కడల్లా పరిస్థితులనిబట్టి మార్పుకిలోనుగాని ఏ వస్తువైనా సంబంధమైనా నశిస్తుంది. దాన్ని పనిగట్టుకుని నాశనం చెయ్యాల్సినపనిలేదు. వాడనివస్తువులు దుమ్ముపట్టి తుప్పుపట్టి పాడవటం మన నిత్యజీవితానుభవం. అలాగే పనికొస్తుందని మనం అనుకున్న వస్తువు సరైన ఫలితాలుఇవ్వకపోతే మనంతటమనమే పారేస్తాం. దానికి ఒకరి ఉద్బోధ అక్కరలేదు.

మార్క్సిజం ప్రకృతి విరుద్ధమైనదైతే అది నశిస్తుంది. దాన్ని ఎదిరించటం కోసం, నాశనం చెయ్యటంకోసం, ఇంతమంది ఇన్ని పుస్తకాలురాయటం, ఉపన్యా సాలివ్వటం, కళాసాహిత్యాలు సృష్టించటం, సాయుధశక్తుల్ని ఉపయోగించటం ప్రపంచ వ్యాప్తంగా ఇంత ప్రయత్నం ఎందుకు?

ఎందుకంటే పైకి వాళ్లుచెబుతున్నట్టుగా అది పాతదైపోకుండా సమాజంలోని అతి చిన్నమార్పుకీ వేగానికీ సమాంతరంగా అదికూడామారుతూ సమాజంలోని అన్ని వైరుధ్యాల పరిష్కారానికీ ఈ దుర్మార్గవ్యవస్థ వినాశనానికీ మహత్తర శ్రామిక వర్గ యుద్ధశక్తిగా మోహరించివున్నందుచేత మార్క్సిజం అంటే ఉన్న అంతులేని భయంతో పాలక వర్గాలు ఈ రకరకాల ఎదురుదాడుల్ని చేస్తున్నాయి.

మరొక 'మహత్తర' ఉంది. తీవ్రవాదులు ఎక్కడో అడవిలోఉండి సత్యం చీటీరాసిపంపితే వూరిజనం భయంతో అన్నం, సారా, కోడీ వగైరాలు పంపుతారట!

చీటీలు రాసి సరుకులు, సారా తెప్పించుకోవటం నిజాంనవాబు కాలంనించీ ఈనాటివరకూ పోలీసులు మాత్రమే చేస్తున్నపని. ఊరిబయట క్యాంపుపెట్టి వూరి

జనాన్నించి కల్లు సారా కోళ్లూ డబ్బు పిండుకుతింటూ ఆ పనిని తీవ్రవాదులు చేస్తున్నారని ఈ నాటకంలో చూపుతున్నారు, మానభంగాలూ వ్యభిచారాలు చెయ్యటంలో రికార్డులుస్థాపించి సమాజ ఉపరితల వాతావరణాన్ని కలుషితంచేస్తూ దాన్నొక జీవన సూత్రస్థాయికి తెచ్చిన తామే అక్రమ సంబంధాలని తీవ్రవాదుల కంటగడుతున్నారు. భయంవల్లనో మరే ఇతర కారణాలవల్లనో నోరెత్తక పోవచ్చుగానీ తెలంగాణాలో పోలీసు దురాగతానికి గురైనస్త్రీలు గ్రామానికొకరైనా ఉన్నారు. ఇదికాక పోలీసుల ప్రోత్సాహ సంరక్షణల్లోనడిచే వ్యభిచార గృహాలున్నాయి. బ్లూ ఫిలింలు ప్రదర్శించే కాఫీపార్లర్‌లున్నాయి. వాటినుంచివచ్చే మామూళ్లున్నాయి. తన ఏరియాలో వున్న ప్రతీ బ్రాందీ షాపునుంచీ, సారాదుకాణంనుంచీ యస్సైకి నెలకి వంద రూపాయల మామూలు వుంటుంది; అదికాక అప్పుడప్పుడూ 'చీటీ'ల మీద ఇవ్వాల్సిన బ్రాందీ బాటిల్సూ వుంటాయి. లెక్క ఇవ్వాలంటే కేవలం వరంగల్ నగరంలో మాత్రమే బ్రాందీషాపులనుంచి ఒక్కనెలలో కొన్నివేలరూపాయలు, కొన్నివందల బీర్లు, బ్రాందీ సీసాలున్నాయి.

పై అధికార్లు అన్నిసుఖాలు అనుభవిస్తూ కిందిస్థాయి ఉద్యోగులకి అప్పుడప్పుడో ఎమికముక్క పడెయ్యటం ఇప్పుడు మనల్ని పాలిస్తున్నపోలీసుల, దొరల సంస్కృతి. కిందివాణ్ని పైవాడూ వాణ్ని ఆ పైవాడూ తిట్టటమనే బూతుల ఊత పదాల సంస్కృతి పోలీసుల దొరల సంస్కృతి. మానాభిమానాల అవధుల్ని అతిక్రమించి ఈ సంస్కృతిని విచ్చలవిడిగా ఆచరణలోపెట్టినవీళ్లు తమ జీవనవిధానమే ఈ సమాజ జీవనవిధానంగా ప్రచారం చేస్తున్నారు. అందుకే పోలీసు ఆచరణ సూత్రాలే ఈ నాటకం నిండా ప్రతిఫలిస్తాయి. తీవ్రవాదనాయకుడు తన అనుచరుల్ని ఎస్పీ కానిస్టేబుల్స్‌ని తిట్టినట్టు తిట్టటం తాను విదేశీమద్యంతాగుతూ అనుచరులకి నాటుసారా ఇప్పించటం ఆ జాతిజీవన విధానమే కానీ తీవ్రవాదుల ఆచరణకాదు.

ఇంత చదువుతున్నోళ్లు ఉద్యోగాలు చేసుకుంటున్నవాళ్లు ఏమీలేని, తమకేమి కాని పేదలకోసం ఎందుకింత శ్రమిస్తున్నారు? అని ఒక మౌలికమైనప్రశ్న ఈ నాటకంలోవుంది. ఇది'సహజం'గా కన్పించాలని గ్రామీణ పాత్రతో అనిపించారు.

మానవచరిత్ర అంటే ప్రకృతితో పోరాటం. ఈ పోరాటంలో ఎవడిసమస్య వాడిదే, ఎవడిబతుకువాడిదే ఐతే ఈ ప్రభుత్వాలూ, రక్షకభటవ్యవస్థలూ వుండేవి కావు. సమాజాభివృద్ధి ఇంతకాదుగదా ఒక్క అడుగైనాముందుకు సాగివుండేదికాదు.

మానవశక్తి వైయక్తికతనుంచి సమిష్టికావటమే నేటివ్యవస్థస్వరూపం. వ్యక్తి ఏకాంతంగా తాను సాధించలేనిపనుల్ని సంఘీభావంద్వారా సాధించబూనుకోవటమే ఈనాటి సంఘవ్యవస్థ. ఐతే దీన్ని స్వార్థపరశక్తులు తమస్వార్థానికి వేలాదిఏళ్లుగా ఉపయోగించుకుంటూ ప్రభుత్వాలనే పేరుతో మిగతా సంఘాన్ని శాసిస్తున్నాయి. తమలో భాగమైన వ్యక్తులస్వేచ్ఛా ఆస్తులూ కాపాడ్డానికి మాత్రమే ప్రస్తుత ప్రభుత్వాలున్నాయి. వ్యక్తులుగా వాళ్లు ఆర్జించలేని సంపదలన్నీ సమిష్టికృషిని కొల్లగొట్టటంద్వారా సాధించటంకోసం కృషిచేసేకూటాలే ఈ ప్రభుత్వాలు, ప్రతిపక్షనామక పాలకవర్గాలు.

వీళ్లప్రయత్నాలవల్ల సమాజప్రయోజనాల్లో చైతన్యంలో అభివృద్ధిలో వైరుధ్యాల ఘర్షణ ప్రారంభమవుతుంది. మనిషి సమాజంలో భాగంకాబట్టి సమాజప్రయోజనాలతో వ్యక్తిప్రయోజనాలు ముడిపడివుంటాయి. వ్యక్తివ్యక్తిగా ప్రయోజనాల్ని పొందలేడు. సమిష్టిప్రయోజనాలే వ్యక్తిప్రజనాలవుతాయి. వ్యక్తిప్రయోజనాలకు ఆఘాతం ఏర్పడ్డప్పుడు సమాజప్రయోజనాలుగూడా దెబ్బతిన్నాయని అర్థం. ఒకవ్యక్తిని అకారణంగా అరెస్టుచేస్తే ఏకారణంలేకుండా ఎవర్నీ అరెస్టు చెయ్యరాదనే సమాజప్రయోజనం భంగపడ్డట్టే. దాన్ని ప్రశ్నించేహక్కు సమాజంలో ఎవరికైనాఉంటుంది. కానీ ప్రస్తుత వ్యవస్థ మనిషిని సమాజంనుంచి వేరుచేసిచూస్తుంది. అలాచూడటమనేది వ్యక్తావ్యక్తరూపాల్లో నిరంతరం మనకి నేర్పుతుంది, కాబట్టి పక్కవాడికి అన్యాయం జరుగుతున్నప్పుడు ఆ అన్యాయం ఆ 'వ్యక్తి'కి మాత్రమే జరుగుతున్నట్టుగా కన్పిస్తుంది. మన 'స్వేచ్ఛ'కి భంగంరాలేదుకదా అనే భావాంధకార కుహరంలోపడి సమాజస్వాతంత్ర్యరాహిత్యాన్ని సహించేస్థితికిరావటం జరుగుతుంది. వక్తిస్వేచ్ఛావినాశనమనేది సమాజస్వేచ్ఛా విధ్వంసనలో భాగమని మనకాక్షణంలో గుర్తురాదు.

దీనిలో ఇంకొక కోణంవుంది. వ్యక్తిస్వేచ్ఛ నిరాఘాటంగా ప్రవర్తిల్లుతున్నట్టు 'కన్పించటం'. రాడికల్స్ మీటింగులకీ స్థూపాలనిర్మాణానికీ చందాలువసూలుచేస్తున్నారని పోలీసులు కేసులుపెడతారు. ఆ 'నేరానికి' వాళ్లని అరెస్టుచేసి చిత్రహింసలు పెడతారు. చాలాసార్లు వాళ్ళు ఏపోలీసుస్టేషన్లలో వున్నారోగూడా తెలీదు. అప్పుడు పోలీసులు రాడికల్స్ తమహింసావాదాన్ని ఉపయోగించి డబ్బు బలవంతంగావసూలు చేసినట్టు ప్రచారంచేస్తారు. ఇందిరాప్రతిభా ప్రతిష్టానమనేపేరుతో అంతూలే కోట్లాది రూపాయలు 'వసూలు' చేస్తే అతనికి ఆంటిసిపేటరీ బెయిలిస్తారు, ప్రజాస్వామ్యయుతంగా కోర్టులోకేసుపెడతారు, ఏళ్లతరపడి విచారిస్తారు (ఈ విచారణలో కేసు వీగి

పోతుందనేది వేరేవిషయం) కానీ తీవ్రవాదులవిషయంలో ఈ ప్రజాస్వామ్యం కన్పించదు.

ఏ తీవ్రవాదిదగ్గరైనా కనీసం సరిగా పేలుతుందో లేదో తెలియని ఏనాటుబాంబో దొరికితే అక్రమ ఆయుధాల చట్టంకింద, రాజద్రోహనేరంకింద, సంఘవ్యతిరేక కార్యకలాపాల నిరోధకచట్టంకింద కేసుల్ని పెట్టటం మనకితెల్సు. జమ్ములోని శివా గన్ ఫ్యాక్టరీలో లైసెన్సులేని స్ప్రెయిన్ తుపాకులు దొరికితే కేసుసంగతి తర్వాత, ఆ ఫ్యాక్టరీలైసెన్సునికూడా పునరుద్ధరించి ఆకేసుని బుక్ చేసిన రాష్ట్రప్రభుత్వాన్నే మార్చి పారేసేంత వ్యక్తి స్వాతంత్ర్యాన్ని మనం ఈనాడు చవిచూస్తున్నాం. ఈ 'వ్యక్తి స్వాతంత్ర్య' పరిరక్షణల వల్ల స్మగ్లర్లు సమాజసేవకులవుతారు, సిమెంటుదొంగలు కళాపోషకులవుతారు, వంచనాశిల్పప్రవీణులు సుప్రసిద్ధ నవలారచయితలవుతారు, గూండాలుహంతకులు రాజకీయవేత్తలవుతారు. ఈవ్యవస్థలో ఎవరైనా ఏదైనాకావచ్చును ఒక్క తీవ్రవాదికావటంతప్ప: అలాంటప్పుడు తప్పనిసరిగా కొందరు వ్యక్తుల స్వేచ్ఛను మాత్రమే కాపాడే ఈ ప్రభుత్వాలకూ, సమస్తసామాజికస్వేచ్ఛల్నీ కాపాడే సాంఘికశక్తులకూ మధ్య పోరాటం ప్రారంభమవుతుంది. దాన్నివర్గపోరాటం అంటారు. ఏవర్గమైతే తాననుభవిస్తున్న దుర్భరపరిస్థితుల మూలాన్ని గ్రహించి ఉవ్వెత్తున లేచి రాజ్యాధికారంకోసం యుద్ధంసాగిస్తుందో అప్పుడు ఈ ప్రజాస్వామిక ప్రభుత్వాలన్నీ 'ప్రజాస్వామ్యాన్ని' తుంగలో తొక్కి తుపాకులెత్తి తమ నగ్నస్వరూపాన్ని ఈ విధంగానే ప్రదర్శిస్తాయి. ఆ పిరికి తనంలో తాము కళ్లుమూసుకుని మిగతాలోకం కళ్లుమూసుకున్నదని భావిస్తారు.

కానీ మనిషి అనాది చరిత్ర నుండీ తాను నేర్చుకున్న సమాజ సంబంధాల వల్ల పొరుగువాణ్ని గూర్చి పట్టించుకుంటాడు. ఏ సంఘశక్తి వ్యక్తుల అభివృద్ధికి కారణం కావలసిఉన్నదో అది కేవలం కొందరు వ్యక్తులకు పరిమితం కావటాన్ని వ్యతిరేకిస్తాడు. అభివృద్ధి ఫలితాలు అందరికీ చెందాలనికోరేవాడే మానవుడు. అలాంటి మానవ మౌలిక స్వభావాన్ని ప్రశ్నించేవాడే సంఘ విద్రోహి. వాడే మానవ జాతి ప్రథమ మహాశత్రువు.

ఈ నాటకంలో చూపిన ఇంకో అంశం 'హరిత విప్లవం'.తన ఒక్కడికృషి వల్లనే కాక భారతమ్మ తెలివివల్ల సాంకేతికాభివృద్ధి వల్లా ఒకబస్తా పండే పొలంలో వంద బస్తాలు పండుతున్నాయనే రైతు వాదన పోలీసు మేధావులవాదనే తప్ప వేరు

కాదు రైతుస్థాయిని మరచిపోయిఅతడితో బ్లాక్‌డెవలప్‌మెంట్ ఆఫీసరు మాటలన్నీ మాట్లాడించటం ఏదొరగారితెలివో! ఎంతవి జెన్నీసుని పైనా రైతులకి ప్రభుత్వం భూములు, సబ్సిడీరుణాలుఇచ్చి తోడ్పడుతోందని నమ్ముతాడా? మంత్రిగారో మరొకడో ప్రదానంచేసిన పట్టాలమీదిభూమి భూస్వామిఅధీనంలో వుంటుంది. సబ్సిడీరుణాలు దళారులచేతుల్లోకిపోతాయి. ఏమీలేనిరైతునెత్తిన అదనపు రుణభారంపడుతుంది. ఇది అసలు జరిగేవాస్తవం. దీన్నిమాత్రందాటవేసి ఒకటికి నూరురెట్లుపంటలు పండుతున్నాయని సిగ్గువిడిచిన కూతలుకూస్తారు. ఒక ఎకరంలో నూరుబస్తాలు పండవలసి ఉంటే ఆనూరు బస్తాలూపండితే అది నూటికినూరుపాళ్లు విజయంసాధించినట్టు. బహుశా దానికే మనప్రభుత్వం కృషిపండిట్ అవార్డుల్ని కూడా ఇస్తుంది. ఇక ఒకటికి నూరురెట్లుపండిస్తే ఆవార్డుల సంగతి తర్వాత అమ్మగారి ఐయంయఫ్ అప్పులెందుకు, అన్నగారి అమెరికాయాత్రలెందుకు?

"దున్నేవాడిదే భూమైతే ఉంచుకున్నోనిదే పెండ్లామెందుకుకాదు?" అని చాలా సులభంగా ఒక సందర్భంలో ప్రశ్నించారు నటులు. ఈ ప్రశ్నవెయ్యటానికి ప్రత్యేక అర్హతలేమీ అక్కరలేదు. వెయ్యకుండా ఉండటానికి మాత్రం మనిషైవుండాలి. వామపక్షరాజకీయాల్ని తీవ్రంగా వ్యతిరేకించే వాళ్లలో అగ్రగణ్యులైన భారతీయ జనతాపార్టీవాళ్లు 'దున్నేవాడిదే భూమైతే గొరిగేవాడిదే గుండా? గీసేవాడిదే తాటిచెట్టా?' అని వెటకారంచేశారంటే వారి 'సంస్కృతి' ఆ మాటల్ని అనిపించిందనుకోవచ్చు. ఏ సంస్కృతీలేని పోలీసులూ, వారిలాంటి వారూతప్ప ఈ ప్రశ్నవేసే దుస్సాహసం ఎవరూ చెయ్యరు. తమదొక గొప్పజాతి అనీ ప్రజల్ని 'పాలించే' హక్కు తమకు సహజంగా వచ్చిందనీ ప్రజలంతా తమ దర్పానికీ, అహంకారానికీ తలవొగ్గుతూ తమ స్వైర విహారాల్ని వహించాలనీ తమ చర్యల్నిపొగుడుతూ వుండాలని భావించే వాళ్లు ఏం మాట్లాడాలో ఏం మాట్లాడవద్దో ఆలోచించే స్థితిలో వుండరు.

భూమిలాగా స్త్రీలు ఉత్పత్తిసాధనం కాదు. సాంఘిక చైతన్యంలో భాగం. చైతన్యంవున్న మానవుల్ని బానిసలుగాచేసేదీ స్త్రీలని సొంత ఆస్తిలాగా మార్చేదీ ప్రస్తుత వ్యవస్థ మాత్రమే. ఈ వ్యవస్థా, ఈ వ్యవస్థని కాపాడే పోలీసులూ స్త్రీలని ఆస్తులుగా చూస్తారు. బలహీనురాలైన స్త్రీని తమ దౌర్జన్యశక్తితో లోబరుచుకుని ఎవడి దగ్గరుంటే వాడి "వస్తువు"గా ఉపయోగించుకుంటారు. తమకున్న ఈ అవలక్షణాన్ని నాటకంలో తీవ్రవాదులమీదికి నెట్టే ప్రయత్నంచేశారు. అంటే స్త్రీని ఒక చైతన్యం వున్న మనిషిగా గుర్తించ నిరాకరించే తమ ధోరణిని ప్రదర్శించారు. స్త్రీలని వాళ్లు

"ఆస్తులు"గా చూస్తారు గాబట్టి ఆస్తులన్నీ సమాజ పరమవుతాయనగానే స్త్రీలుగూడా సమాజ పరమవుతారని బెంబేలుపడతారు. గగ్గోలుపెడతారు.

ఇంటిదగ్గర సనాతనురాలైన భార్యతో సుఖపడలేక తీవ్రవాద ఉద్యమంలో చేరాననీ దానివల్ల డబ్బూ ఇతర సౌఖ్యాలనేకం పొందగలుగుతున్నాననీ నాటకంలో తీవ్రవాద నాయకుడు ఒకచోట అంటాడు.

సనాతనురాలైన భార్యతో సుఖపడలేనినాడు ఆభార్యకి విడాకులివ్వొచ్చు లేదా అది కుదరకపోతే ఇతరమార్గాలనేకం ఉన్నాయి. స్త్రీసుఖంమాత్రమేకాదు ఏసుఖం కావాలన్నా వెళ్ళాల్సింది తీవ్రవాదరాజకీయాల్లోకికాదు. పాలకవర్గరాజకీయాల్లోకి, పోలీసుడ్రెస్సులోకి మాత్రమే. పోనీ డబ్బుకోసం ఈవుద్యమంలో చేరాలాఅంటే అదీఅక్కర్లేదు. స్మగ్లింగో, బ్రాకెట్ బిజినెస్సో పోలీసులమద్దతుతోనే బ్రహ్మాండంగా నడపవచ్చు. సమాజంలో ఇన్ని సులభమార్గాలుంటే ఈ తీవ్రవాదమార్గంలోకి ఎందుకురావాలి? తీవ్రవాద ఉద్యమంలో లాఠీలున్నాయి, లాకప్‌లున్నాయి, జైళ్లున్నాయి, ఉరితాళ్లున్నాయి, తూటలున్నాయి, వెన్నుపోట్లుటాన్నాయి. ఇవేవీ ఈ నాటకంలోచూపరు. తీవ్రవాదులు ఏమేంచేస్తారనిచూపారో అందులో నూరోవంతైనా నిజంఉండివుంటే పోలీసులదాకాఎందుకు ప్రజలే వారిని శిక్షించేవారు. తీవ్రవాదులు అంత దుర్మార్గులేఐతే ప్రజలు వారికి సహకరించరు.

ఏ మనిషయినా వర్గమయినా అవ్యక్తశూన్యంలో జీవించటం సాధ్యంకాదు. ఒక వాతావరణం ఉండాలి. తాను శూన్యంలో వున్నానని తోచినప్పుడు ఆ మనిషో వర్గమో వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నంచేస్తుంది. లేకపోతే జీవించటం కొనసాగటం కష్టం. కానీ వాతావరణాన్ని 'సృష్టించటం' అభాసకు దారితీస్తుంది. తాము సృష్టించదలుచుకున్న వాతావరణానికి వత్తాసుగా ఈ రకం నాటకాలు తయారవుతాయి. ఈ నాటకాలు ఆడించేవారూ ఆడేవారూ దానిమీద విశ్వాసంతో ఆ పనిచెయ్యరు. రోగంవచ్చి దేవుడికి దండంపెట్టేవాడు అంతటితో వూరుకోక వైద్యుడిదగ్గరికి గూడా వెళతాడు. ప్రజల్ని 'ఉద్బోధిం'చడంకోసం ఈ నాటకాన్ని ఆడే నటీనటులుపేర్లు బయటపెట్టుకోరు. రచయిత ఎవరో తెలియదు, దర్శకుడెవరో చెప్పరు. వాళ్ల పోలీస్ దేవుడికి దండమైతే పెట్టుకున్నారుగానీ ఆ దేవుడు రక్షిస్తాడో లేదో అనుమానమే.

ఈ నాటకాన్నిచూసి దృశ్యరూపక ప్రభావం వల్ల ఒక్కక్షణం ఎవరన్నా నమ్మినా వాస్తవజీవితం పోలీస్ డ్రామాని కాలదంతుంది. మన చట్టంపేరుతో ఎన్నో

దారుణాలు ప్రతిరోజూ జరుగుతున్నాయి. ఏ మధ్య యుగాల నిరంకుశ ప్రభువులూ చెయ్యని దురాగతాలన్నీ 'ప్రజాస్వామ్య' ప్రభుత్వాలు ప్రజల 'అనుమతి' పొంది వారిచేత 'ఆమోదించ' బడిన చట్టాలసాయంతో చేస్తున్నాయి. చట్టాలమీదా ప్రభుత్వంమీదా విశ్వాసం నమ్మకంవుండి పోలీసుల్ని నమ్మనివాళ్లు మధ్యతరగతిలో చాలా వరకున్నారు. వాళ్లు ఇందిరాగాంధీనినమ్ముతారుగానీ ఇనస్పెక్టర్ జనరల్‌ని నమ్మరు. అందుకే నాటకంనిండా పోలీస్‌భావజాలం దాని సంస్కృతీమాత్రమేనింపి నాటకంలో ఒక్క పోలీస్‌పాత్రగూడాలేకుండా జాగ్రత్తగా తయారుచేశారు.

ఒక వాస్తవంచూద్దాం. సాధారణంగా పోలీసులంటే భయంతప్ప ప్రేమా గౌరవం ఎవడికి వుండదు. వాళ్లతో చుట్టరికాలు కలుపుకోడానికి కాదుగదా స్నేహం చెయ్యటానికిగూడా జనంఇష్టపడరు. వాళ్లకి నమస్తేపెట్టేవాడు దొంగో గూండాయో అయివుంటాడుతప్ప సామాన్యుడుకాదు. కానీ ఈ నాటకప్రదర్శన పోతనమందిరం (వరంగల్)లో జరుగుతున్నప్పుడు అక్కడి యూనివర్సిటీ ఛాన్సలర్, అక్కడున్న పోలీసుఅధికార్లు కలిసి కూల్‌డ్రింక్స్ తాగుతున్నారు. సరిగ్గా ఆ సమయానికి స్టేజీమీద తీవ్రవాదులు మనుషుల రక్తం గ్లాసుల్లో తాగుతున్నదృశ్యం జరుగుతోంది. పోలీసులకీ అకడమిక్ పోలీసులకీ ఉన్న తేడా డ్రెస్సుల్లోని భిన్నత్వమేతప్ప లక్ష్యాల్లో తేడాలేదు. అకడమిక్‌పోలీసులు విద్యాలయాల్లో పోలీసుఏజెంట్లుగా పనిచేసినంతకాలం చేసి చాతకాకపోతే ఏ యస్పయికో విద్యాలయపాలన అప్పగిస్తారు. డ్రాకులా ప్రభువు రక్తదాహానికి జనాన్ని సమకూర్చే డ్రాకులా అనుచరుల్లాగా హాస్టల్‌లోని విద్యార్థుల్ని పోలీసులకి అప్పజెబుతారు. కరడుగట్టిన మానవద్వేషంతో పోలీసులు విద్యార్థుల్ని చిత్రవధచేసి తమరక్తపిపాసనుచల్లార్చుకుంటుంటే ప్రభువుసేవలో ధన్యమయామని సంతోషిస్తారు. పోలీస్ డ్రాకులా కోరలనుంచి కారే రక్తంచుక్కల్ని కుక్కల్లా నాకుతారు. డ్రాకులాను స్పష్టంగా గుర్తించవచ్చు. అతడి అనుచరుల్నిమాత్రం సమయంవచ్చేదాకా గుర్తించటం కష్టం. పోలీసుల్ని అవలీలగా గుర్తించవచ్చు. వారి తాచేదార్లనిమాత్రం ఇలాంటిసమయాల్లో స్పష్టంగా గుర్తించగలం.

ఈ నాటకంలో ప్రశంసించే అహింసావాదానికి అర్థం ఏమిటి? వీరు ఏ ప్రజా వ్యవస్థని, ఏ చారిత్రిక పరిస్థితిని మెచ్చుకుంటున్నారు? "దుష్టు"లైన తీవ్రవాదులు హత్యలు మారణహోమాలు చెయ్యమని చెబితే "అహింసా" ప్రవక్త రాజ్య రక్షక భటాధికారులు వాళ్లని బంధించి గుడ్డలువిప్పి ఒకరితో ఒకర్ని లైంగిక చర్యలు జరపమనటాన్ని వీళ్లు మెచ్చుకునేది?

దానికి నిరాకరించిన వాళ్ళ పురుషాంగాలమీద లాఠీలతో బాది ఆ బాధకి మూర్ఛ పోయినవాళ్లుపోగా మిగిలినవారిని రోడ్డెక్కించి వీధుల్లో "రాడికల్స్ దొంగలు, వాళ్లతో చేరము" అని నినాదాలిప్పిస్తూ తిప్పే స్వాతంత్ర్యాన్నా వీరు జనాన్నుండి కోరేది?

ప్రేమించి పెళ్లిచేసుకున్న జంటనుగూడా నగ్నంగా ఊళ్లోతిప్పి ప్రేమపెళ్లిళ్లు చేసుకుంటే ఇదేగతి పడుతుందని చెప్పేనీతిబోధలకోసమా వాళ్ల అహింసకావాలనేది?

దాహం అడిగితే ఒకరి మూత్రం ఒకర్ని తాగమని, అందుకు నిరాకరించిన వాడి అపానంలో లాఠీదూర్చి గంటలతరబడి ఉంచే అహింసా సంస్కృతీ సంప్రదాయమా కావాలనేదీ మెచ్చుకునేదీ? రాడికల్స్‌ని పట్టిస్తే ఉద్యోగాలిస్తామనీ, పాత కేసుల్ని మాఫీచేస్తామనీ, ఆఖరుకు పిల్లనుచూపి పెళ్లిగూడాచేస్తామనీ ఎరలు చూపి యువకుల్ని ప్రలోభపెట్టే అహింసారాజ్య పాలకయంత్రాంగమా మనకు గర్వ కారణం? దీనంతటికీ కారణం ఏమిటి?

ఇవాళపాలకవర్గాలు విప్లవంతాకిడికి ఊగిపోతున్నాయి. ఆ దెబ్బ తమపునాదిని చీల్చకుండా అనేక ప్రయత్నాలుచేస్తున్నాయి. ఈ ప్రయత్నాల్లో అనేక దారుల, మార్గాంతరాలు అన్వేషిస్తున్నాయి. తమకులేని, ఉండదానికివీల్లేని అనేక నూతనాం శాల్ని సంతరించుకుని విప్లవాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తున్నాయి. పాలక వర్గాలు ఈ రకంగా కొత్తదురాచారాలు సమాజంలో ప్రవేశపెడుతున్నకొద్దీ సంకీర్ణత పెరుగుతున్నది. ఈ సంకీర్ణత ఎలాంటిదంటే భారత రాజ్యాంగాన్ని 'సోషలిస్టు' రాజ్యాంగంగా ఇందిర మారిస్తే ఆ ఇందిర భక్తుడొకడు. నిన్నగాక మొన్న మన రాజ్యాంగాన్నేమార్చాలన్నంత దాకాపోయింది. ఈ వైరుధ్యం జనానికి కొరుకుడు పడదు. నక్సలైట్లు చెప్పేదీ నరసింహారావులుచెప్పేది ఒకలాగే కన్పించినప్పుడు ఇక వాళ్లకి నక్సలైట్ల ను చెవి పారేయాల్సిన పనిలేదు. కానీ వాస్తవాల మాట ఏమిటి? ఇలాంటి నాయకమ్మన్యులప్రగల్భాలే, ఎన్నటికి నెరవేరని వాగ్దానాలేకదా ఈనాడు నక్సలిజాన్ని సృష్టించింది? తమనోటినుంచివచ్చె మాటల్లో ఒకదాన్నైనా నేరవేర్చగలిగే శక్తి తమకున్నదా అని ఒక్కనాడైనా ఆలోచించారా? తమ పబ్బంగడుపు కోవటం కోసం ప్రజల్ని దారుణమైన భ్రమల్లో ముంచటంవల్లనే ఇంతసంక్షోభం ఏర్పడింది. ఈ సంక్షోభానికి మూలకారణం పాలకవర్గాలే కానీ తీవ్రవాదులుకాదు.

కొడుకులు తల్లిదండ్రుల్ని, భార్యలు భర్తల్ని నిర్దాక్షిణ్యంగా చంపుతారని తీవ్రవాదులమీద ఒక అభాండం వేశారు. ఇది చాలాసాహసోపేతమైనలజ్జాహీన

మైనచర్య. నిజానికి, హోంగార్డ్‌గా పనిచేస్తున్న ఒక కుర్రవాడికి రాడికల్స్‌పట్ల సానుభూతివుందని యస్సయి అతణ్ని 'నీ సంగతిరేపుచూస్తా' అనిబెదిరిస్తే ఆ కుర్రవాడు హోంగార్డ్‌గనక పోలీస్ ట్రీట్‌మెంట్ ఎంత లక్షణంగా వుంటుందో తెల్సుగనక ఎండ్రిన్‌తాగి ఆత్మహత్యచేసుకున్నాడు. అదేస్టేషన్లో కానిస్టేబుల్‌గా ఉన్న ఆతడి తండ్రి ఆదుఃఖాన్ని కడుపులో దాచుకోలేక, బయటికిచెప్పలేక కుములుతూంటే పైఅధికార్లు 'ఇంకానువు ట్రాన్స్‌ఫర్ కాలేదా ఇక్కడేవున్నావా?' అని అడిగారు. ఆతండ్రి మనస్సునాక్రమించిన పోలీసుక్రమశిక్షణ అక్షణంలో సాల్యూట్ చేయించ గలిగిందేమోగానీ హంతకుడెవరో అతనికి తెలియదా?

నిన్నమొన్న ఫకీర్ కొండాపూర్‌లో తోకల చినవెంకటిని లాకప్‌లోవుంచి చచ్చేదాకా కొట్టి అతని భార్యాపిల్లలకు అతన్ని లేకుండాచేశారు.

ఎవరు ఎవర్ని చంపుతున్నారు. ఎవరు మానవనైజాన్ని మరిచి ప్రవర్తిస్తున్నారు. ఎవరు సమాజసంబంధాలనీ నియమాల్నీతెంపి స్వైరవిహారం చేస్తూ రక్తవాహినుల్లో జలకాలాడుతున్నారు? ఇవన్నీ తీవ్రవాద రాజకీయాలు కలిగి ఉన్నారన్న మిషతో జరుగుతున్నవే.

అమాయకులైన కొందరు తల్లి దండ్రులు పిల్లలు రాజకీయాల్లో తిరగటం చెడిపోవటంగా భావిస్తారు రాజకీయాలువుండటం తప్పుకాదుగానీ 'చెడు' రాజకీయాలు తప్పని వారికి తెలియదు దానికికారణం గత ముప్ఫయిఅయిదేండ్లుగా మనల్ని పాలిస్తున్న పాలకవర్గాలు రాజకీయాలంటే ప్రపంచాన్నీ దాని పోకడను తెల్సుకోవటంగా కాక హత్యలు, దోపిడ్లు, కులతగాదాలుగా తయారుచెయ్యటం, అందుకే మధ్యతరగతి మనిషి రాజకీయాలకి చాలాదూరంగా వుంటాడు. అలా వాళ్లుదూరంగా వుండేటట్టు చెయ్యటానికే పాలకవర్గపార్టీలు రాజకీయాల్ని ఇంత కలుషితం చేశాయి.

హింసావాదరాజకీయాలు తప్పనిచెబుతూ అహింసా సిద్ధాంతాన్ని బోధించే వాళ్లు ఇన్నాళ్లుగా ఎంత అహింసను తమ పాలనలో అనుసరించారు? వాళ్లలోనే నిజానికి ఘోరమైన హంతకులున్నారు. స్మగ్లర్ల, తార్పుడుగాళ్ల, దళారుల, హంతకుల, నయవంచకుల సమూహమే ఈనాడు దేశాన్నిపాలిస్తున్నది. గూండాలు హంతకులు మున్సిపల్ కౌన్సిలర్లో పోలీసుఅధికార్లో అయితే ప్రజలు వారిని క్షమించినట్టు కాదు. వీళ్లు తమపాతచరిత్రను కప్పిపుచ్చుకోవటానికి రాజకీయాల్ని ఆశ్రయించటం

వల్ల రాజకీయాలంటే అంటరానివస్తువుగా ప్రజలు భావిస్తున్నారు. నిజానికి రాజకీయాలు ఎవరికికావాలి?

ఎవరైతే ఈ సమాజాన్ని నడిపిస్తున్నారో వారికి కావాలి. ఎవరైతే ఈ సామాజిక సంపదకు సృష్టికర్తలో వారికి కావాలి. ఎవరిదైతే ఈ సమాజమో వారికి రాజకీయాలుకావాలి. రాజకీయాల్ని 'సెలక్ట్' చేసుకొమ్మనిచెప్పేహక్కుఎవరికీలేదు. ఐతే మనల్నిపాలిస్తున్నవాళ్లు తమకు తంత్రాలే రాజకీయాలుగా, ప్రజోద్యమాల్ని హింసాత్మకచర్యలుగా సాంఘిక విద్రోహచర్యలుగా చిత్రిస్తున్నారు. మానవుడికి ప్రాకృతికంగా వచ్చిన హేతువాదవివేచనను శాసనాలు, నిర్బంధ సూత్రాలనే యాంత్రిక సాధనాలద్వారా శాశ్వతంగా పూడ్చిపెట్టడానికీ ప్రయత్నంచేస్తున్నారు. మనుషుల్ని పశువుల్నిచేసి ఆ పశువులకి సైతం మూగతనాన్ని అలవాటు చేస్తున్నారు. రాజ్యాంగయంత్రమంటే భయాన్ని సృష్టించి దానికెదురు మాట్లాడటం ఎంత ప్రమాదకరమో ప్రదర్శిస్తూన్నారు. దళారీ బానిసయంత్రాంగంలో అస్వతంత్ర పరికరాలుగా వున్నవాళ్లు సంఘంలోని సర్వస్వతంత్రపౌరుల్ని తమలాగే అస్వతంత్రంగా బానిసలుగా విధేయులుగా ఉండమంటున్నారు. చట్టాల్ని తు.చ.తప్పకుండా ఆచరించాల్సిన తాము వాటిని కాలరాస్తూ ఇతర్లని మాత్రం ఆ చట్టాలకు బద్ధులై ఉండమంటున్నారు.

ఆలోచించగల శక్తిగలవారు నోరుమూసుకుని కూచోవటంవల్లనే ఈ 'డ్రామాలు'లు నడుస్తున్నాయి. ఈ విషయం వారికి తెలియకపోతే తప్పుకాదుగానీ తెలిసీ అభిమానంవదిలి తలవంచటం మానవమనస్తత్వానికే అవమానం.

తీవ్రవాదఉద్యమంవల్ల అనేక మంది యస్పీలు పర్కిశ్లయారు. ఆదాయమూపెరిగింది, కొత్తవాహనాలు వచ్చాయి. ఈ మధ్యనే ఎస్పీ ఆఫీసు లోపలే పోలీసులే స్వంతంగా పెట్రోల్ పంప్ ఒకటి నెలకొల్పుకున్నారు. ఆ ఇంధనం ఎంత వాహనాలకి ఖర్చవుతుందో ఎంత వాళ్ల జేబుల్లోకిపోతుందో లెక్క తెలియదు. విప్లవాన్ని వ్యాపారంగా పోలీసులువాడుకుంటున్నంత స్థాయిలో ఎవరూ వాడుకోవటం లేదంటే అతిశయోక్తికాదు. ఎవణ్నో ఒకణ్ని అరెస్టుచెయ్యటం వాడికి తీవ్రవాది అనిపేరు పెట్టటం అతడి తరఫువాళ్లెవరైనా విడిపించటానికివస్తే వెయ్యో పదివేలు వందలో తీసుకొని వదలటం— ఇదంతా ఒక లాభసాటి వ్యాపారంగా చేస్తున్నదెవరు? తమ హింసాత్మక ధోరణినీ, నేరాత్మక ప్రవృత్తినీ తీవ్రవాదులకు ఆపాదించటంవల్ల

ఈ నాటకంలో వుండే హీనవద్వేషం, రక్తపిపాస పోలీసువ్యవస్థయొక్క పతనావస్థ లోని శిఖరస్థాయిని సూచిస్తున్నదితప్ప తీవ్రవాదుల లోపాల్నికాదు.

ఇలాంటి బూటకాలు రాయటానికీ రాయించటానికీ కొందరికి వర్గప్రయోజ నాలున్నాయి. మరికొందరికి ప్రమోషన్ల ఆశలున్నాయి. ఉదరపోషణార్థం బహుకృత వేషంగా మరికొందరు పనిలో తోడ్పడుతుండవచ్చు.

కానీ ఒక విశ్వవిద్యాలయంలో రంగస్థలశాఖకు రీడరై వుండి, ఎవడికీ దాస్యం చేసే 'పని' లేకుండా జీవించే అవకాశంవుండి, కళా స్వరూపస్వభావాలు స్పష్టంగా తెలిసివుండి ఈ రకంనాటకాలకి ప్రయోక్తగావున్న చాట్ల శ్రీరాములు వంటి వారిని ఏమనాలి? మార్క్సిస్టు మహాతత్వ పర్వతాన్ని తవ్వటానికి దినబత్తెపు కూలీగా మారవలసిన అగత్యం ఏం పట్టింది? నాటక కళోద్ధరణకు మార్గమూ, ప్రతిభను ప్రదర్శించే పద్ధతీ, కళను జానానికి సన్నిహితం చేసే వస్తువూ రీతీ ఇది కాదు. అసత్యాలూ, అసంగతాలూ ప్రస్తరిల్లే విధాన ప్రదర్శన నాటకం కాదు. అహంకారం నాటకం కాదు. వంచన నాటకం కాదు.

ఏ కళా సాధనాల ద్వారా సమాజాన్ని మేల్కొల్పుదా మనుకున్నారో అవన్నీ సినిమా కళవల్ల ప్రభావితమై ఇటు రంగస్థల కళాకాక, సినిమా కళాకాక ఉభయ భ్రష్టత్వాన్ని పొందాయి. సినిమాల్లో లాగా స్క్రిప్ట్‌ని- స్క్రీన్ ప్లేపద్ధతిలోకి మార్చారు. స్టేజిప్లేకావటంవల్ల షాట్ డివిజన్ పద్ధతి పనికిరాకుండా పోయింది. మూడు గంటల పాటు పాతకాలపు నాటుసినిమాలాగా పావుగంటకో పాటా ఐదు నిమిషాలకో సుదీర్ఘ నీతివచన ప్రబోధాలతో సాగిన ఈ దుష్టరూపకం ప్రేక్షకుల్ని ప్రభావితం చెయ్యటం మాట తర్వాత కనీసం విసుగుపుట్టకుండా కూచోబెట్టగలిగిందా? ఈ నాటక లక్ష్యం తీవ్రవాద దుర్మార్గాల్ని ఖండించటం అహింసనిబోధించటం. ఆ రెండూ వస్తూ మొదటి అంకపు పది డైలాగుల్లో అయిపోయాయి. ఇక లెక్క లేనన్ని పాత్రలురావటం చెప్పిందే చెప్పి పాడిందేపాడి కాలాన్ని సాగతీయటం!

అహింస వల్ల సమాజాన్ని మార్చటానికి వీలంటూ వుండే పక్షంలో అది ఈనాడు చారిత్రకంగా ప్రభావ శూన్యమెందుకవుతుంది? రాజ్యాంగయంత్రానికి అభ్యంతరంలేని రాతలురాస్తూ రాజకీయ సమస్యలకి ఆధ్యాత్మిక పరిష్కారాలు

వాడికీ, 'ప్రయోగించే' వాడికీ ఒక విషయం తెలీదు. లేదా తెలియనట్టు నటిస్తున్నారు.

మనిషికి ఆలోచించే శక్తివుంది. దాన్ని బహిరంగంగా వినియోగించే ప్రకటించేహక్కువుంది. ఏ మనిషికూడా ఆలోచించవద్దనీ దాన్ని ప్రకటించవద్దనీ ప్రచారం చెయ్యవద్దనీ తన విజ్ఞానసేకరణకీ విస్తరణకీ ప్రయత్నించరాదనీ అనుల్లంఘనీయమైన నిర్బంధ సూత్రాలు నిర్మించి సమాజంమీద రుద్దేహక్కు ఏ దొరల కైనా సరే లేదు. వాస్తవాలతో నిమిత్తంలేకుండా వాదప్రజ్ఞని ఉపయోగించేవాడు తిరిగి దానితోనే నశిస్తాడు, దీనికి ఉదాహరణగా ఈ నాటకంలోని ప్రతీమాటనీ చూపవచ్చు.

ఈ నాటకం ప్రదర్శించటానికి అవుతున్న ఖర్చు ఏ బడ్జెట్‌లోంచి కేటాయించబడిందన్నది ఇంకొకప్రశ్న. నటులందరికీ నెలసరిజీతాలున్నాయి. ప్రదర్శన ఉన్నరోజున ప్రత్యేక అలవెన్సులున్నాయి. స్టేజీని అలంకరించడానికి ఐదారుతెరలు, వాటిమీద వర్ణచిత్రాలున్నాయి, నేపథ్యసంగీతంవుంది. స్పాట్‌లైట్లున్నాయి. ఇదిగాక ఈ నాటకాన్ని గ్రామాల్లో ప్రదర్శించాలన్న ప్రయత్నంవుంది. గ్రామాల్లో ఈ నాటక ప్రదర్శనకు స్టేజీలుండవు గనక ఆరుటైర్ల లారీ నొక్కదాన్ని కొని దానిమీద మొబైల్ స్టేజీ ఏర్పాటు చేస్తారట. ఇదంతా లక్షల రూపాయల్లోనేవుంటుంది. నిర్లజ్జాకరమైన తమ నాటకాలకోసం ప్రజాధనాన్ని ధారళంగా, అప్రజాస్వామికంగా ఖర్చుపెట్టే హక్కు వీళ్లకెవరిచ్చారు? ఎవరి ప్రయోజనాలకోసం ఎవరు ఆడిస్తున్నారు ఈ నాటకాలు?

కొసమెరుపు:

ఈ అహింసా నాటకం మొట్ట మొదట ప్రదర్శించబడ్డ స్థలం ఎస్పీ ఆఫీసు ముందున్న పోలీసు గ్రౌండ్స్! ముందు మూడు రోజులని ప్రకటించారు. ఆ మూడు రోజుల్లోనూ దాన్ని చూడవచ్చిన జనం అక్కడ పోలీస్ క్వార్టర్స్‌లో వున్న స్త్రీలూ పిల్లలూ మాత్రమే కావటంతో మరో మూడు రోజులు పొడిగించారు. ప్రదర్శన సమయంలో జనంలో ప్రతి ఐదుగురికీ ఒక స్పెషల్ బ్రాంచ్ మనిషి ప్రేక్షకుల్లో కూచున్నాడు. నలుగురు డ్రెస్సులో వున్న పోలీసులు తుపాకులు పట్టుకుని నిలబడ్డారు. ట్రాఫిక్ పోలీసులిద్దరు జనాన్ని కంట్రోల్ చేశారు. స్టేజీకి కాస్త దూరంగా మసక చీకట్లో మఫ్టీ పోలీసులు, యస్సైలూ ప్రేక్షకుల్ని గమనిస్తూ నిలుచున్నారు. స్టేజీ వెనక ఇరవై గజాల దూరంలో చీకట్లో ఒక జీప్ అకస్మాత్తుగా కళ్లు తెరచి స్టేజీకి

పంద గజాల రేడియస్‌లో ఒకసారి కుడినుంచి ఎడమకి ఎడమనుంచి కుడికీ ప్రదక్షిణాలు చేస్తుంది. ఇంత బందోబస్తు మధ్య స్టేజీవెనక బ్యాగ్రౌండ్‌లో రెక్కలు చాచిన గబ్బిలంలా ఎస్పీ ఆఫీసు భవనాలు కన్పిస్తుంటే థియేటర్ ఆర్ట్స్ అభివృద్ధి అంతా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాచారశాఖ పేరుతో చిందులుతొక్కింది. నాటక ప్రదర్శన జరుగుతున్నంతసేపూ జనం మాట్లాడుకోలేదు. తీవ్రవాదుల మీద విసుర్లు వచ్చినప్పుడల్లా నవ్వారు. నవ్వకపోతే పక్కవాడు అనుమానిస్తాడని భయంః

రెండో ప్రదర్శన పోతన మందిరంలో జరిగింది. ఇక్కడ పోలీసుల ప్రయత్నం లేకుండానే జనం గుమిగూడారు. ఎందుకంటే అక్కడ ఐదు సినిమాహాళ్లున్నాయి. టికెట్లు దొరకనివాళ్లంతా ఈ ఉచిత ప్రదర్శనకి వస్తారు. అక్కడికి దగ్గర్లోనేఉన్న భద్రకాళీ దేవాలయానికి వచ్చిపోయేదారి అదే కాబట్టి ఆ జనమూ ఆచే వస్తారు. ప్రవేశ ద్వారం దగ్గర రెండువందల కాండిల్స్ బల్బ్ వెలిగించి చీకట్లోవించుని వచ్చే జనాన్ని గమనిస్తుంటారు పోలీసులు. ఇకజనంలో కూచుని యథాలాపంగా జనాభిప్రాయాన్నికనుక్కునే స్పెషల్ బ్రాంచీవాళ్లు ఉండనే ఉన్నారు. 'ఇంత పకడ్బందీ ఎందుకయా' అని ఓ పాత్రికేయుడు ఓ కానిస్టేబుల్ నడిగితే ఆతడి జవాబు 'సూడొచ్చిన లంజకొడుకులు ఏమీచెయ్యకుండా' నట!

ఇక మూడో ప్రదర్శన కాజీపేట రైల్వే స్టేడియంలో. అక్కడ గేటుదగ్గర నిలుచుని పోలీసులు వచ్చిపోయేవాళ్లని గమనించటం. చుట్టుప్రక్కల గ్రామాలకివెళ్ళే బస్సులు ఆగేది అక్కడేగనక జనం బస్టాండులో బస్సులేటయితే పక్కనే ఏమిటో వుందే అని ఆ నాటకస్థలానికి వెళతారు. నాటకం పూర్తయేదాకా తమ వూరి బస్సుల్ని పోలీసులు ఆపేయించారని పాపం వారికి తెలీదు.

ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ నాటక ప్రదర్శన ఉన్న ప్రతీరోజూ నటులంతా డి ఐ జి గారి బంగాళాకి వెళ్ళాలి. అక్కడ ఆయన వారికి క్లాసు తీసుకుంటాడు. ఆ క్లాసులో ఆనాటి తాజా పరిస్థితులేమిటి? వాటిని నాటకంలో ఎలా చొప్పించాలి, డైలాగుల్లో ఎలాయిరికించాలి అన్న అంశాలమీద వివరిస్తాడు. ఇలా నాటకాన్ని 'నిత్యనూతనం'గా ఉంచే ప్రయత్నంగూడా చెయ్యటంవల్ల ఒకసారి చూపినవాడు రెండోసారిచూసి కన్‌ఫ్యూజ్ అయ్యేస్థితి చేరుకుంటాడు.

— ప్రేక్షకుడు.

పుస్తక సమీక్ష :

జానకి విముక్తి

(గత సంచిక తరువాయి)

స్త్రీ సమస్య :

"ఇప్పుడున్న సమాజంలో స్త్రీలకేమైనా సమస్యలున్నాయా, లేవా, వుంటే అవి ఏమిటి, ఆ సమస్యలు ఎందుచేతవున్నాయి, అవి ఎలా పోతాయి అనే విషయాలు స్త్రీలకు తెల్పడమే ఈ నవల ముఖ్యోద్దేశ్యం" అనీ,

"స్త్రీల సమస్యలు స్త్రీల జీవితాలకే పరిమితం కాదు. అవి పురుషుల జీవితాలకు సంబంధంలేని విషయాలు కావు. స్త్రీల సమస్యల మీద స్త్రీలకు సరైన జ్ఞానం కలగడం ఏంత అవసరమో పురుషులకు సరైన జ్ఞానం కలగడం కూడా అంత అవసరమే" అనీ రంగనాయకమ్మ ముందుమాటలో చెప్పారు. అందువల్ల పుస్తకంలో స్త్రీ సమస్యకు సంబంధించిన చర్చ ఎక్కువగా ఉండడం సహజమే. పుస్తకంలో జరిగిన చర్చ గుణదోషాలను పరిశీలించడం స్థలపరిమితుల దృష్ట్యా ఇక్కడ అసాధ్యం. అందువల్ల ఈ సమస్య గురించి సాధారణంగా ఉన్న అవగాహనలను అర్థం చేసుకొని ఆ అవగాహనల ప్రకారం ఈ చర్చను స్థూలంగా పరిశీలించడం సరైంది.

స్త్రీల సమస్యలను చూసే దృష్టికోణాలను ప్రధానంగా నాలుగురకాలుగా విభజించవచ్చు, స్త్రీలకు సమస్యలేవీ లేవనేది మొదటి దృక్పథం. సమాజంలో స్త్రీ పురుషుల స్థానాలు నిర్ణయించబడ్డాయనీ, ఆ నియత విధుల్ని నిర్వర్తించడమే స్త్రీ ధర్మమనీ ఈ దృక్పథం భావిస్తుంది. "యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః" అని చెప్పిన మనుస్మృతి అమలయ్యే భూమిలో స్త్రీలకు సమస్యలుండడమేమిటి అని వాదించే ఈ ధోరణికి ఆర్ ఎస్ ఎస్ సంస్థ నవభారతి ప్రచురించిన పవని నిర్మల ప్రభావతి పుస్తకం మంచి ఉదాహరణ. వీధుల్లోకొచ్చిన స్త్రీ పురుషుల చేత వేధించబడడమే పెద్ద సమస్యగా చూసే ఈ పుస్తకం ఆ వేధింపుకు మూలాన్నిగానీ, ఆ వేధింపుకన్న తీవ్రమైన అణచివేతలను గానీ గుర్తించదు. పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రమన్నట్టు ఆ గుర్తించిన ఒక్క సమస్యకూ విదేశీ ప్రభావం కారణమంటుంది.

మరొక దృక్పథం స్త్రీలసమస్యలన్నీ స్త్రీలు తమంత తామే తెచ్చుకుంటున్నారంటుంది. రెచ్చగొట్టే విధంగా అలంకరించుకోవడం, 'విశృంఖలంగా' తిరగడం

తదితర తప్పుల వల్లనే స్త్రీలకు సమస్యలు వస్తున్నాయని ఈ ధోరణి వాదిస్తుంది. లొంగి ఉండడంవల్ల అణచివేయబడుతున్నారని స్త్రీల మీదికే తప్పును తోస్తుంది ఈ ధోరణి. ఈ ధోరణిలోనే మరొక భాగం స్త్రీలు గయ్యాళులై పురుషుల్ని సంతృప్తి పరచకపోవడం వల్ల, బైట శ్రమించివచ్చే భర్తకు విశ్రాంతీ, ఆనందమూ ఇవ్వకపోవడంవల్లా సమస్యలు తెచ్చుకుంటున్నారంటుంది.

ఈ రెండు పైపై దృక్పథాలనూ దాటి మరి కాస్త ముందుకుపడిచి మూలంలోని ఒక అంశాన్ని పట్టుకునేది మూడో ధోరణి. ఈ ధోరణి స్త్రీ సమస్యకు మూలం పురుషాధిక్యతలో ఉందని గుర్తిస్తుంది. ఈ దృక్పథాన్ని విస్తృతార్థంలో ఫెమినిజం అని పిలవవచ్చును. మాతృస్వామ్య సమాజం అనేదే లేదనే ఫెమినిస్టుల నుంచి స్త్రీల మధ్య వర్గవిభజనను గుర్తించే ఫెమినిస్టుల వరకు ఈ దృక్పథంలో వేర్వేరు అవగాహనలుండడంవల్ల దీన్ని ఖచ్చితంగా నిర్వచించలేం.

మరొక దృక్పథం స్త్రీ సమస్యకు పూర్తి కారణం సమాజానిదేనంటుంది. ఈ దృక్పథం స్త్రీలలో వర్గవిభజననూ సామాజిక పునాది, ఉపరితలాలనూ కూడా గుర్తిస్తుంది. స్త్రీల సమస్యలను ఉపరితల సమస్యలుగా ఎంచుతుంది. జానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ పునాదులు స్త్రీల అణచివేతకు ఉపరితలంలో ఆధారాలు కల్పించాయని, మన సమాజంలో స్త్రీలకున్న సమస్యలు పూర్తిగా భూస్వామ్య, సామ్రాజ్యవాద విలువలవల్ల ఏర్పడ్డవని ఈ దృక్పథం భావిస్తుంది.

సమస్యలేలేవనే మొదటి దృక్పథాన్ని మినహాయిస్తే, సమస్యలున్నాయని ఒప్పుకునే మూడు దృక్పథాలకూ మూడు రకాల పరిష్కారాలున్నాయి. ఒకటి పురుషుల్ని సంస్కరిస్తేనో, స్త్రీలను సంస్కరిస్తేనో స్త్రీసమస్యపరిష్కారమవుతుందనే మితవాద, ఉదారవాద వైఖరి. మరొకటి పురుషులమీద పోరాటంతోనే సమస్య పరిష్కారమవుతుందనే అతివాద వైఖరి. మూడోది వ్యవస్థమీద పోరాటంతోనే స్త్రీసమస్య పరిష్కారమవుతుందనే యాంత్రిక, పాక్షిక కాలజ్ఞతా వైఖరి. ఈ మూడురకాల పరిష్కారాలూ లోపపూరితమైనవే. స్త్రీసమస్యకు పునాదిలో, ఉపరితలంలో రెండు స్థాయిలలో ఆధారాలున్నాయి. ఆ రెండు ఆధారాలనూ తొలగించకుండా స్త్రీ సమస్యను పరిష్కరించడం సాధ్యంకాదు. పైన చెప్పిన మూడు పరిష్కారమార్గాలూ ఈ రెండు స్థాయిల్లో ఏదో ఒకస్థాయిలో పోరాటాన్నే కోరుతున్నాయి. అదే వాటి లోపం. ఈ పరిష్కారాలవల్ల తాత్కాలికంగా విజయం సాధించగలిగినా పునాది

ఉపరితలాల అన్యోన్య, గతితార్కిక సంబంధంవల్ల ఆ విజయం నిష్ఫలమైపోతుంది. మితవాద దృక్పథం పితృస్వామ్య భావజాలనికి వేసే అతుకులూ, అతివాద దృక్పథం పితృస్వామ్య భావజాలంపై చేసే పోరాటమూ పితృస్వామిక పునాదికి ఏమీ హాని చెయ్యలేవు. పునాది చెక్కుచెదరకుండా ఉన్నంతకాలమూ ఉపరితలంలో సంస్కరణలవల్ల ప్రయోజనం ఉండదు. అలాగే యాంత్రిక, ప్రాప్తకాలజ్ఞతా వైఖరి వల్ల మన ఉద్యమానికి పెద్ద హాని జరుగుతోంది. మన ఉద్యమంలో ఉన్న వాళ్ళెంతో మంది స్త్రీసమస్య గురించి ఇప్పుడు పట్టించుకోవలసిందేమీలేదని, సోషలిస్టు సమాజంవస్తే స్త్రీ సమస్య పరిష్కారమైపోతుందనీ, సోషలిస్టు సమాజం కోసం పనిచేస్తే స్త్రీ సమస్యల పరిష్కారానికి పనిచేసినట్టేనని అనుకుంటున్నారు. గడిచిన సోషలిస్టు సమాజాల అనుభవం చూసినా, పునాది ఉపరితల సంబంధాల గురించి సరైన అవగాహనఉన్నా ఈ వైఖరి కూడ నిష్ప్రయోజన కరమేనని అర్థమవుతుంది. కాకపోతే సోషలిస్టు సమాజం స్త్రీ సమస్య పరిష్కారానికి అవసరమైన వాతావరణాన్ని, ప్రాతిపదికను మరెన్నడూలేనంతగా సమకూర్చి పెడుతుంది.

ఈ మూడు దృక్పథాలకూ భిన్నంగా సమస్యగురించీ, పరిష్కారం గురించీ సరైన దృక్పథం ఈ మధ్యకాలంలో విస్తృతంగా వ్యాపిస్తోంది. సమాజంలో సగభాగమైన స్త్రీ అందుకు తగిన గౌరవాన్నీ సమానత్వాన్నీ పొందడంలేదు. ఆమెశ్రమంతా వంటింటికే ఖర్చయిపోయి అనుత్పాదకమై పోతోంది, తద్వారా సామాజికోత్పత్తిలో ఆమె భాగం తగ్గిపోతోంది. శ్రామికుడైనందువల్ల శ్రామికుడు మనిషిగా గుర్తించబడే ఈ సరుకుల సమాజంలో, అనుత్పాదక శ్రమ చేస్తున్న స్త్రీ మనిషిగా గుర్తించబడడం లేదు. మాతృస్వామికం నాడు అనుభవించిన అధికారమూ పోయి, ఆదిమ సమాజంలో అనుభవించిన శ్రమ భాగస్వామ్యమూపోయి స్త్రీ పూర్తిగా పరాధీన అయింది. బానిసను ఎల్లకాలమూ బానిసగానే ఉంచడానికి పురుషునికి భావజాలం అవసరమయింది. అందువల్లనే మనిషిగా పుట్టే మనిషిని స్త్రీగా మార్చవలసి వచ్చింది. తొలి శ్రమ విభజనతో అంకురార్పణ జరిగిన పితృస్వామ్యం మరిన్ని మరిన్ని కోరలు తెచ్చుకుని ఇవాళ్టి మన సమాజంలో దాని దుర్మార్గ రూపంలో తాండవిస్తోంది.

స్త్రీ సమస్య గురించి చాలవరకు సవ్యంగా ఆలోచించే వాళ్ళుకూడ స్త్రీ సృజనాత్మక శక్తికి తగిన పని కల్పించలేక పోతున్నారు. మానవమేధస్సు చేయగలిగిన పనులన్నీ స్త్రీ మెదడు కూడ చేయగలిగి ఉండగా ఆమె కార్యరంగాన్ని పితృస్వామ్యం

కుదించి పారవేసింది. స్త్రీ సృజనాత్మకశక్తి అణచివేతను తొలగించే పని సోషలిస్టు సమాజాలలో కూడ సక్రమంగా జరగలేదు.

ఇవాళ స్త్రీగా ఉండడమంటే ఐదు రకాల సామాజిక సంబంధాలను కలిగి ఉండడం. సామాజిక శ్రమతో, ఇంటిపనితో, పిల్లలపోషణతో, కుటుంబంతో, లైంగిక సంబంధాలతో ఆమెకు విడివిడిగా ఉండే ప్రత్యేక సంబంధాలలోని అణచివేత ఇవాళ స్త్రీకి నిర్వచనంగా ఉన్నది. ఈ అణచివేతను సృష్టించిందీ, పోషిస్తున్నదీ పితృస్వామ్యం, పితృస్వామ్యానికి దారితీసిన తొలిశ్రమవిభజన. స్త్రీ పురుషుల మధ్య శ్రమ విభజన అంతరాన్ని తగ్గించడం ద్వారా, స్వంత ఆస్తిని రద్దుచేయడం ద్వారా పితృస్వామ్య పునాదిని తొలగించడం స్త్రీ సమస్య పరిష్కారంలో ఒకమెట్టు. అంటే ఇది కుటుంబాన్ని సమాజానికి మౌలిక సాంఘికార్థిక యూనిట్‌గా లేకుండా చేసే పరిణామం. ఈ పునాది పరిణామం ఉపరితలంలో పితృస్వామ్య భావజాలాన్ని తొలగించి సోషలిస్టు భావజాలాన్ని నెలకొల్పడమనే పరిణామంతో కలగలిసి సాగాలి. పునాది పరిణామం శ్రామికవర్గ రాజ్యాధికారం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఉపరితల పరిణామం అంతకు చాల ముందునుంచే- ఇప్పటినుంచే- ప్రచారం చేయవచ్చును. ఐతే ఈ పితృస్వామ్యభావజాలానికీ సోషలిస్టు భావజాలానికీ మధ్య ఉండే వైరుధ్యాన్ని పరిష్కరించడం వర్గపోరాటంలో భాగంగానే కొనసాగించాలి. ఆర్థిక సంబంధాల లోనూ, రాజకీయ, మత, నైతిక, తాత్విక, కళా, సాహిత్య రంగాలన్నిటిలోనూ పితృస్వామ్యాన్ని నిర్దాక్షిణ్యంగా రద్దు చేయ్యడమే ముఖ్యమైన విషయం.

స్త్రీ సమస్య విషయంలోనూ, పరిష్కారం విషయంలోనూ రంగనాయకమ్మ అభిప్రాయాలను స్థూలంగా సరైనవిగానే ఒప్పుకోవచ్చును. ఇతర వ్యాసాలలోనూ, ప్రశ్నజవాబులలోనూ ఆమె సరైన దృక్పథాన్నే ప్రకటించారు. ఐతే 'జానకివిముక్తి' విస్తృతి పెరిగినందువల్లనో, క్రమబద్ధత లేకపోవడం వల్లనోగాని అక్కడక్కడ స్త్రీ సమస్య పరిష్కారంగా పైన చెప్పిన మూడు దృక్పథాల్లో ఏదో ఒకటి ప్రకటితమైంది.

"తేలుకుడుతుంది, పాముకరుస్తుంది, భర్త పీడిస్తాడు. పురుషుడుకాదు సుమా! భర్త! భార్య అనే బానిసకు యజమాని అయిన భర్త! ప్రతీభర్తా పురుషుడేగానీ,

ప్రతీ పురుషుడూ భర్త కాడు (2. 171) అని సత్యం అనడంలో భర్తలధిక్యతకు పురుషాధిక్యతకు మూలమైన పితృస్వామ్యం గురించిన అవగాహన స్పష్టంగా లేదు. ఇక్కడ భర్తరికం తేలు, పాముల లాంటి సహజస్వభావమనీ, పురుషస్వభావం అది కాదనీ ధ్వనిపస్తోంది. పితృస్వామ్య పురుషులందరికీ, వాళ్ళు భర్తలైనా, కాకపోయినా స్త్రీమీద ఆధిక్యతను ప్రసాదించింది. కాకపోతే భర్తకు ఈ ఆధిక్యతాభావానికి స్వంత ఆస్తిభావంకూడా తోడవుతుంది. అందే స్వభావంలోని సహజత్వాన్ని గురించి చెప్పవలసివస్తే భర్త స్వభావంకాక అసలు పురుష స్వభావమే తేలు, పాములలాంటి "సహజ" స్వభావం.

"స్త్రీ సహనమే పురుషుడి శక్తి! స్త్రీ లొంగుబాటే పురుషుడి ఆధిపత్యం! అంతకన్న పురుషుడు స్త్రీని నడపడంలో రహస్యం ఏమీలేదు. స్త్రీ తలఎత్తిందంటే పురుషుడి అధికార భవనం కూలింది! ఆ క్షణాల వరకే పురుషుడి సామ్రాజ్య పాలన" (2,365) అని రంగనాయకమ్మ రాసిన దాంట్లో కూడ స్త్రీ పురుష సంబంధాల బాహ్య ప్రాతిపదికలనూ, కారణాలనూ లెక్కించకపోవడం ఉంది. స్త్రీ పురుషసంబంధాల ఇవాల్టిరూపానికి ఒక స్త్రీనో, ఒక పురుషుడ్నో బాధ్యుణ్ని చేయడం చాల ఆలోచనా రహితమైన సాధారణ వైఖరి. రంగనాయకమ్మ ఈ స్థాయికి జారిపోకుండా ఉండవలసింది.

"…. ఒక పురుషుడు ఎంత సంస్కారవంతుడో, సాంఘికంగా ఎంత విప్లవకారుడో అతను ఒక స్త్రీతో కలిసి జీవించేకాలంలో గానీ నిర్ణయించడం సాధ్యం కాదు. ఆ సంగతి సత్యానికి కూడ తెలుసు కాబట్టి, తనుకూడా ఒక 'నాగరీక భర్త' లాగ తయారై పోతానేమోనని అప్పుడప్పుడూ జంకుతూనే వుంటాడు, …." (3, 244) అనే మాటలు సత్యం కన్న ఎక్కువగా ఆచరణలో విప్లవకారులుగానూ, సంస్కారవంతులుగానూ (ఇక్కడ చర్చ అప్రస్తుతంగాని, రంగనాయకమ్మ ఈ 'సంస్కారం' అనే మాటను విచిత్రంగా వాడతారు!) ఉన్న వాళ్ళందరూ గుర్తుంచుకోవాలి.

"….భార్యాభర్తల ఘర్షణ ఖచ్చితంగా వర్గపోరాటం లాంటిదే. ఆర్థిక రంగంలో కాదు, సాంస్కృతిక రంగంలో. శత్రువర్గాల మధ్య ఎంత ఘర్షణ జరుగుతుందో

అంతా జరుగుతుంది ఆరంగంలో భార్యకీ, భర్తకీ అన్నాడు సత్యం....". (3.470) కాను, భార్యాభర్తల మధ్య ఘర్షణ సమాజంలో వ్యాపించి ఉండే వర్గపోరాటానికి ఒక ప్రతిఫలనమే. వర్గపోరాటమని గుర్తించడానికి కూడ వీలులేనంత అస్పష్టంగా ఉన్న ఈ ఘర్షణ మరింత విస్తృతంగా జరగవలసిందే. ఐతే ఈ వైరుధ్యానికి శతృస్వభావం ఉందా, మిత్రస్వభావం ఉందా అని తీవ్రచర్చలు జరుగుతున్నాయి. ఇదివరకే చెప్పుతున్నట్లు ఒక వైరుధ్యంలోని రెండు అంశాల మధ్య ఘర్షణే ప్రబలమై, ఒక అంశంగానీ, రెండు అంశాలుగానీ రద్దయిపోయే వైరుధ్యం శతృవైరుధ్యమే. భార్యాభర్తల మధ్య వైరుధ్యంలో ఘర్షణే నానాటికీ ప్రబలమవుతుంది. ఈ వైరుధ్యం పరిష్కారం అయ్యేనాటికి భార్యఅనే అంశమూ, భర్తఅనే అంశమూ రెండుకూడ రద్దయిపోతాయి. కుటుంబం రద్దుతో, పితృస్వామ్యం రద్దుతో, స్వంత ఆస్తి రద్దుతో పూర్తిగా పరిష్కారమయ్యే భార్యా భర్తల వైరుధ్యం శతృవైరుధ్యమే.

స్త్రీ పురుషుల విషయంలో వైరుధ్యానికి అవకాశం ఇస్తున్న శ్రమవిభజన విశిష్టత రద్దయినాక స్త్రీ పురుషుల మధ్య వైరుధ్యం అంతరిస్తుంది. అప్పుడు స్త్రీ పురుషులు శరీరనిర్మాణంలో స్వల్పమైన తేడాలుండే ఒకే అంశంగా, మానవులుగా ఉంటారుగాని రెండు పరస్పర విరుద్ధ అంశాలుగా ఉండరు.

పెళ్ళి, సహజీవనం:

స్త్రీ పురుష సంబంధాల గురించి, భార్యా భర్తల సంబంధాల గురించి పై చర్చ చేసిన తర్వాత పెళ్ళి, సహజీవనాల గురించిన చర్చ దాదాపు అనవసరమే అవుతుంది.

"కుటుంబం అనేది నాలుగు దశలు గడిచి ఐదో దశలో ఉందని మనం ఒప్పుకుంటే ఈ దశమాత్రం స్థిరంగా ఉండగలదా అనే ప్రశ్న వెంటనే ఉదయిస్తుంది. దానికొకటే సమాధానం, గతంలోలాగానే భవిష్యత్తులో కూడ సమాజం పురోగమించినప్పుడల్లా అది కూడా పురోగమించాలి. సమాజం మారినప్పుడల్లా దానితోపాటు అదికూడా మారితీరాలి. దానిని సామాజిక వ్యవస్థ సృష్టించింది. కనుక సామాజిక సంస్కృతి దానిలో ప్రతిబింబిస్తూంటుంది" అని మోర్గన్ అన్నాడు.

"పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం రద్దయాక దాంపత్య సంబంధాలు ఎలా ఉంటాయనే దానికి బదులు ఏమేమి ఉండవో మాత్రమే ప్రస్తుతం చెప్పగలుగుతాం." అనీ ఎంగెల్స్ అన్నాడు.

కుటుంబంలో జరగబోయే ఈ పరిణామాలు మనం గుర్తించగలుగుతున్నప్పుడు పెళ్ళి గురించీ, దాని తంతు గురించీ మనకేమీ సందేహాలుండనవసరంలేదు. ఒక సాంఘిక గుర్తింపుకోసం పెళ్ళితంతు ఉండవలసిన అవసరం, ఎవరికి వస్తుందో, ఎవరికి ఎందుకు అవసరంలేదో కాంత సంభాషణలో చర్చకు వచ్చింది కూడ. ఈ సమీక్షలోనే సంఘభీతి దగ్గర చెప్పిన లోపాలు ఈ అంశానికి కూడ కొన్నిచోట్ల వర్తిస్తాయి.

అంచనా :

'జానకివిముక్తి'ని జీవితం కోసం, ప్రేరణకోసం, ఉత్తేజపరిచే నవల అనే దృష్టితో కాక చర్చగా, సిద్ధాంతవ్యాసంగా లెక్కించి చదివితే ఇది మంచి ఆలోచనా ప్రేరకమయిన పుస్తకమే. స్త్రీ సమస్య, మార్క్సిజం - చైతన్యం వంటి అంశాలతో సాంప్రదాయకంగా మార్క్సిస్టులు (కొశాంబీ భాషలో 'ఓం' అధికార మార్క్సిస్టులు) ఆలోచించని సమస్యలను లేవనెత్తిన పుస్తకంగా జానకి విముక్తి మార్క్సిస్టులకు చాల అవసరమయిన పుస్తకం. ఈ పుస్తకం అక్కడక్కడ ప్రకటించిన తప్పుడు అభిప్రాయాలనూ, తప్పుడు అవగాహనలనూ పక్కనపెట్టి, పుస్తకంలో అంతర్లీనంగా ఏ దృక్పధాన్ని కలిగించడానికి ప్రయత్నం జరిగిందో అది మార్క్సిస్టులకు, ముఖ్యం ఆచరణలో ఉన్నవాళ్ళకు అవసరమైన దృక్పధం. ఆ కారణంవల్లనే ప్రస్తుత విప్లవోద్యమానికి 'జానకి విముక్తి' తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం. ఆ పుస్తకం లోని లోపాలను సరిదిద్దుకోగలిగిన, అధిగమించగలిగిన శక్తి, అవకాశమూ, ఆచరణ పూర్వకమైన జ్ఞానమూ విప్లవోద్యమానికి ఉన్నాయి.

(అయిపోయింది)

ప్రభుత్వం - కవిత్వం

సురా

బంగ్లాదేశ్‌లో మిలటరీ ప్రభుత్వం మొన్న ఫిబ్రవరిలో జిల్లా పంచాయితీ ఎన్నికలు ప్రకటించింది. దానికి వ్యతిరేకంగా రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చెయ్యాలనీ, ప్రజాస్వామిక హక్కులన్నింటినీ పునరుద్ధరించాలని కోరుతూ ఢాకా విశ్వవిద్యాలయ ఛాత్ర సంగ్రామ్ పరిషద్ నాయకత్వంలో మిలిటెంట్ ఉద్యమం నడిచింది. బంగ్లాదేశ్ అమరవీరుల సంస్మరణదినం ఫిబ్రవరి 21 ముందునాటి రాత్రి విశ్వవిద్యాలయంలో 10 గంటలసేపు విద్యార్థులకు సైనికులకు సంఘర్షణ జరిగింది. ఆ వారంలో ఉద్యమం ఇతర పట్టణాలకు, విద్యాలయాలకు వ్యాపించింది. మైమన్‌సింగ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వైస్-ఛాన్సలర్‌తో సహా మొత్తం అధ్యాపకులందరు నిరసనగా తమ రాజీనామానందజేసారు. ఢాకాలోను, ఇతర ప్రాంతాలలోను జరిగిన పోలీసు కాల్పులలో 10 మందికి పైగా మరణించారు. ఆ నెలలో దేశవ్యాపితంగా సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్న రాజకీయఖైదీలు కూడ ఆందోళన చేసారు. జైళ్లల్లో జరిగిన కాల్పులలో కూడా అనేకమంది మరణించారు. ఈ సంఘటనలకు 'ప్రతిస్పందించి' వచ్చినదే ఈ కవిత.

బందిఖానా గోడల మధ్య ప్రవహించే రక్తమూ
నగర వీధుల్లో ప్రవహించే రక్తమూ
రెంటి రంగూ ఎరుపే
కాని
వాటి వ్యక్తీకరణలు వేరు—
ఒక రక్తధారకి జనసాక్ష్యం ఉంది
మరోదానికి సూర్యచంద్రులు, నక్షత్రాలు
మాత్రమే నిస్సహాయ ప్రేక్షకులు
ఒకటి ప్రవహించే నదిలా
తన గమ్యస్థానాన్ని వెతుక్కుంటుంది
తల్లి ఒడిని చేరుకుంటుంది
రెండవది —
బందీగానే మిగిలిపోతుంది

ఈ కవితను రాసినవాడు ప్రముఖ బంగ్లాదేశ్ కవి అబు జఫర్ ఒబయిదుల్లా, ఆయన ఈ నిర్బంధాన్ని అమలుపరుస్తున్న జనరల్ ఎర్షాద్ మిలటరీప్రభుత్వంలో మంత్రి;

కరపత్రం:

"ఇదేమి రాజ్యం
ఇదేమి రాజ్యం"

"పోలీసు రాజ్యం
తుపాకి రాజ్యం"

పోలీసుల దారుణ మారణ విధ్వంసకాండను ఆపేదెవరు?

రక్తపిపాస పోలీస్ రాకాసుల కోరలకు బలియైన అమరుడు కా॥ తోకల చినవెంకటికి
మా విప్లవ జోహార్లు

ప్రియమైన ప్రజలరా!

పోలీసుల తుపాకి పాలనకు ప్రతిబింబమే ఫకీర్ కొండాపూర్ గ్రామ ప్రజల దయనీయ గాథ.

17వ తేది అర్ధరాత్రి మెట్టుపల్లి తాలూకాలో చిన్నగ్రామమైన ఫకీరు కొండాపూర్ పోలీసు మూకలచే చుట్టుముట్టబడింది. రైతాంగ కార్యకర్తలు రక్షణ తీసుకుంటున్నారనే సాకుతో యుద్ధరంగానికి బయల్దేరిన చందంగా 80 మంది సాయుధ పోలీసు బలగాన్ని వెంటేసుకుని వెళ్లిన ఎస్. ఐ. రమేష్‌బాబు, సర్కిల్ రాంరెడ్డి తదితర ముగ్గురు ఎస్ ఐ లు ఇద్దరు సర్కిల్లు, ఒక డి.ఎస్.పి. పథకం ప్రకారం ప్రతి యింటికి మొదలే కాపలా పెట్టి వాక్కొక్క యింటి తలుపులను గొడ్డండ్లతో బద్దలు కొట్టి లోపలికి జొరబడి యింటిలోని మనుషులనందరిని గొర-గొర బయటికి ఈడ్చి, మానవత్వంలేని పోలీసులు బూట్లతో తమ యిష్టం వచ్చినట్లు తొక్కుతూ, గొడ్లను బాదినట్లుగా కర్రలతో కొంతమంది బాదుతుంటే, ఇంకాకొంతమంది పోలీసులు యింటిలోని సామాను నంతటిని ధ్వంసం చేయడానికి ఎగబడ్డారు. భరించ లేని దెబ్బల బాధకు అనేకులు అతి భయంకర హా హా కారాల నాదాలు చేస్తుంటే వారి చప్పుడు విని ఇంకొంత మంది జనం తమ పిల్లలను. ముసలివారిని వెంటబెట్టుకొని, గోడు గోడుమని కట్టుబట్టలతో అడవికి పరుగులుతీశారు. నిర్మానుష్యంగా ఉన్నవారియిండ్లను కూడా వదలకుండా నేలమట్టం చేసినంత బదులుగా ధ్వంసం చేసారు. చేతికందిన ప్రతి విలువైన సామానును తమ చేతపట్టుకెళ్లినారు. 70మందికి పైగా జనంను తమ వ్యాన్లలో, జీపులలో తీసికెలుతూ మార్గమధ్యంలో చేసిన ఘోర చిత్రహింసల అనంతరం వివిధ పోలీసు స్టేషనులలో దింపేసుకొని మరో చిత్రహింసలఘట్టాన్ని కొనసాగిస్తున్న సమయంలో సంఘనాయకుడైన చిన్నవెంకటి మెటుపల్లి లాకపులో కన్నుమూశాడు. ఇదిగ్రహించిన పోలీసులు తమ ప్రత్యేక గదిలోకి తీసికెల్లి శవాన్ని దాచినారు. ఈ విషయం బయటికి పొక్కకుండా అనేక

జాగ్రత్తలు తీసికొని డాక్టరు, తదితర పోలీసు ఆఫీసర్లందరు అత్యవసరంగా సమావేశమై బయటిప్రపంచానికి తమపసలేని బదలాయింపు మాటల జవాబు ఎలా వుండాలో నిర్ణయించుకున్న అనంతరం వెంకటి బంధువులను పిలిచి నామమాత్రపు శవ పరీక్ష అనంతరం తమ తుపాకి బలగాల బందోబస్తులతో చిన్నవెంకటి శవాన్ని కాల్చి వేశారు. తిరిగి తెల్లవారి ఉదయన్నే కాకిబట్టల కసాయి పోలీసులు కాటికాడికి వెళ్లి కనీసం బూడిదను కూడా మిగల్చకుండా ఊడ్చుకువెళ్లి నీటిలో కలిపేసి చేతులు దులుపుకున్నారు.

తమ ఈ హత్యాకాండను ప్రతి దుశ్చర్యకు నక్సలైటు రంగు పులిమి సమర్థించుకున్నట్లుగా వీరైతే సమర్థనీయంగా వుండేలాగా కూడా ముందు జాగ్రత్తగా జిల్లాపోలీసు అధికారి తలాతోకాలేని పత్రికా ప్రకటనను విడుదల చేశాడు. తోకల చిన్న వెంకటికి గతవారం జగిత్యాల తాలూకా మోరపల్లి గ్రామంలో జరిగిన హత్యకు సంబంధం వున్నదని పత్రికా విలేకరులకు తప్పుదు స్టేటుమెంటు ఇచ్చాడు, ఈ స్టేటుమెంటు చూపిన అక్కడి ప్రజలు వాపోతూ మోకాటికి బట్టతలకు ముడి వేసినటులుగా ప్రకటన వుందని అనుకుంటున్న సమయంలో ఆ మరునటి రోజు పత్రికల వాళ్లవున్నది వున్నట్లుగా ముద్రించడంతో, జిల్లా పోలీసు అధికారులకు ఈ విషయంలో ఆశాభంగమే కలిగింది.

ఇప్పుడు చెప్పండి ఇక 'రామారావు పోలీసు రాజ్యంకి ప్రతిబింబమే' ఫకీరు కొండాపూర్ ఆసదంలో ఇంకా మీ కేమైనా సందేహమా? నిరాయుధులయిన పేద ప్రజలపై ఇంత పెద్దమొత్తం సాయుధ పోలీసు బలగాలప్రయోగం. హడావుడి ఎవరిని వుద్ధరించడానికికవి? ఎంతో మంది బలగం గల చిన్న వెంకటి దహనక్రియలకు సాయుధ పోలీసు ఏమవసరం? మాటవరసకీ పోలీసు రాకాసులు సహకరించడాకికే తాము అక్కడికి వెళ్లారనుకుందామన్నా (తోదేలు గొర్రెకు సహకారం చేస్తాదని నమ్మినటులుగానే వుంటుందనుకోండి) తెల్లవారి బూడిదనుకూడామిగల్చకుండా ఊడ్చుకెళ్లి నీళ్లలో కలిపేయాల్సినంతటి గాభరా వీరికెందుకు? ఇంకాఇలా.... ఇలా.... ఎన్నెన్నో ప్రశ్నలు మనసును పట్టివేధిస్తునే వుంటాయి.

రైతు కూలీలారా! ప్రజలారా!

మన బానిస బతుకు విముక్తికై ఫాసిస్టు దోపిడీ నియంతృత్వ పాలకులకు వ్యతిరేకంగా, వారి కుక్కకాపలాకాస్తున్న పోలీస్ జాగిలాల మధ్య జరుగుతున్న

భీకర విప్లవోద్యమ పోరాటంలో ఫకీర్ కొండాపూర్ గ్రామ ఘటన మొదటిది కాదు. చివరిదీ కాదు కూడా! కోట్లాదిగా యున్న మనదేశ పీడితులు సుసంపన్నమైన జీవితం గడిపే వ్యవస్థ నిర్మాణం జరిగే వరకు విరామ మెరుగని శ్రమతో ప్రాణాలర్పించడానికైనా సిద్ధమైన పోరాట కర్తవ్యనిర్వహణను, ధైర్య సాహసాలతో కొనసాగిద్దామని, కామ్రేడు తోకల చిన్నవెంకటి అమరత్వం సందర్భంగా మరో సారి శపథం చేద్దాం.

విద్యార్థి, విద్యార్థినీ యువజన, మేధావుల్లారా! ప్రజాస్వామిక వాదులారా!

మీరు చూస్తుండగానే ఉసూరుమని ఎందరెందరో విప్లవోద్యమకారులు, ప్రజలు మనదేశ పీడిత జన విముక్తికై జరిగే పోరాటానికి సమిధలై అమరులై పోతూంటే మీరింకా చూస్తూ కాలక్షేపం చేయడం భావ్యమా! దోపిడి వర్గాలు తమ కాపలాదారులైన సాయుధపోలీస్ బలగాలచే, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న దుష్ట విధానాన్ని చూసి మీ మనసులు చలించి పోవడం లేదా? ఈ పైశాచిక ఘోరకృత్యాలు ఇంకా కొనసాగవలసిందేనా! ఆలోచించండి.

—అమరుడు కామ్రేడు తోకల చిన్నవెంకటి హత్యకు కారకులైన పోలీసు ఆఫీసర్లను, దగాకోరు డాక్టరును వెంటనే సస్పెండు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజలను డిమాండు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

—రైతుకూలీ ఉద్యమంపై తెలుగుదేశ ప్రభుత్వ నియంతృత్వ పోలీసుల దమన కాండ నశించాలి.

—విప్లవం వర్ధిల్లాలి. రైతుకూలీ రాడికల్ విద్యార్థి యువజన సంఘాలు వర్ధిల్లాలి.

విప్లవాభినందనలతో,

రాడికల్ విద్యార్థి, యువజన రైతు కూలీ సంఘాలు,

జి॥ కరీంనగరం.

పచ్చిజ్ఞాపకం: కామ్రేడ్ తోకల చిన్నవెంకటి సృజన పాఠకుడు. జూన్/జులై సృజన "ఈ చిరునామాగల వ్యక్తి మరణించాడు" అని తిరిగి వచ్చింది. కామ్రేడ్ తోకల చినవెంకటి 'చచ్చిపోలేదు. చంపబడ్డాడు' ఆ అమరుడికి మా జోహార్లు.

— సాహితీ మిత్రులు

జులై 4

'రగిలేనాదాలు, జనరావాలు' వినిపిస్తాయి

నదిపుట్టిన నా
గొంతుక నదిమి పట్టారు
పోలీసులదిమిన
లాఠీలను ఆనవాళ్ళను
నువ్వు చూడలేదు
నా పెదవులను స్పృశించినపుడు
నీకు వినిపిస్తాయి, నాలో
రగిలేనాదాలు
పగిలిన జనరావాలు

(నదిపుట్టిన గొంతుక - బొజ్జాతారకం)

పోలీసులాకప్‌గా మార్చిన గోషామహల్ బ్యారక్ పొగచూరిన గోడలపై ఇపుడు మీరు రగిలేనాదాలు చూడగలరు. మీరుకూడ 'జనాన్నిచూసి జనులనాదాన్నిచూసి, హర్షామోదాన్నిచూసి, భగ్నహృదయా వేశాలనుచూసి. రక్తనాళాలన్నీపొంగి ఖంగున మోగి వాయువులా విజృంభిస్తే'. ఫోటోలు తీసుకోనివ్వం అని ప్రతిఘటించిన అరవై గాత్రాల పెనుగులాట, 'పోలీసులదిమిన లాఠీల ఆనవాళ్ళు' మాసిపోయాయి. కమిలిన నెత్తురు, గాయాలుచిట్లికారిననెత్తురు కరిగిపోయింది, ఎండిపోయింది. ఇగిరిపోయింది. జ్ఞాపకాలు మేం మనుషులం. అన్న తృప్తిని మిగిల్చినవి. ఆ ఉద్వేగంలో వచ్చిన మౌఖిక గీతాల హైదరాబాదును పలకరించి సహచరుల, శ్రోతల గుండెల్లో ఆశ్వాసాన్ని రగిలించినవి. రగిలేనాదాలు, పగిలిన జనరావాలు పదహారుమందికవుల హృదయ పూర్వక ప్రతిధ్వనులై సాహిత్యంలో నిలిచిపోయినయి. ఫోటోలూ పోలీసులదగ్గర వుండిపోతాయి. వెక్కిరింపుగా, తిరస్కారంగా, నిరసనగా, ధిక్కారంగా. ఖాకీ యూనిఫారాలు, లాఠీలు, లాకప్‌లు, పోలీసు చట్టాలు- స్వచ్ఛందంగా, ఎప్పుడూ నిలిచే జ్ఞాపక చిహ్నంగా ఫోటోతీయించుకోవాలన్న కోరిక స్థానంలో. ఎదురించి, కాళ్ళు విర్రిదన్ని, చేతుల్ని మొహాలకు అడ్డంపెట్టుకొని. శరీరాలతో బ్యారికేడ్లు కట్టిమన స్వాధీనంలో మనంవుంచే ఫోటోలు దిగొద్దు- అని నిర్ణయించుకునే అమానుష వ్యవస్థకు దాఖలాగా నిలిచిపోతాయి. మహల్‌లు మైదానాలవుతాయి. మైదానాలు బ్యారక్‌లవుతాయి. బ్యారక్‌లులాకప్‌లవుతాయి. లాకప్‌లు లావాలవుతాయి. లావాలు ప్రవహించి ప్రవహించి 'పుడమితల్లికి పురుటినొప్పులు కొత్తసృష్టిని' హామీనిస్తాయి.

కామ్రేడ్ డి. వి. కి జోహార్లు.

కొద్దికాలం విప్లవకారుడుగా జీవించడం సులభమే. ఎక్కువకాలం విప్లవకారుడుగా జీవించడం కూడా కష్టంకాదు. కాని జీవితాంతమూ విప్లవకారుడుగా జీవించడం అరుదైన విషయం అన్నాడు మావో. దాదాపు అర్ధశతాబ్దంపాటు కమ్యూనిస్టుగా జీవించి విప్లవం ఎజెండా మీదికి వచ్చినపుడల్లా ఆ చారిత్రిక బాధ్యతను స్వీకరించి విప్లవోద్యమ నిర్మాణంలోనే రహస్య జీవితంలో కన్నుమూసిన కామ్రేడ్ డి వి కి జోహార్లు.

నిజాం నిరంకుశ పాలననుంచి, జమీందారీ జాగీర్దారీ ఫ్యూడల్ వ్యవస్థనుంచి తెలంగాణా ప్రజలను విముక్తి చేయడానికి సాగిన ఆంధ్రమహాసభ ఉద్యమంలో ఆయన మొదటినుంచీ క్రియాశీలకార్యకర్త. దొడ్డి కొమురయ్య అమరత్వంకన్నా ముందే ఆయన జనగామ ప్రజల వీరోచిత పోరాటాల గురించి రాసాడు. అందులో భారతదేశంలోనూ, హైదరాబాదు రాష్ట్రంలోనూ ఆయా దశల్లో, కాలాల్లోవచ్చిన ఉద్యమాలపై మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల ప్రభావం గురించి వివరించి ఆర్థిక రాజకీయ సామాజిక నేపథ్యాలను విశ్లేషించాడు తెలంగాణా రైతాంగ పోరాటం పైనా విప్లవ పంథానెంచుకుంటే గానీ విజయవంతంకాదనే అవగాహనకు అనాడేవచ్చిన కొద్దిమంది కమ్యూనిస్టు నాయకుల్లో ఆయన ప్రముఖుడు. తెలంగాణారైతాంగ సాయుధపోరాట యోధుల్లో ఆయన అగ్రగణ్యుడు.

విప్లవోద్యమంలో సాహిత్య, కళా, సాంస్కృతిక రంగాల పాత్ర గురించి పట్టించుకొని, సన్నిహితంగా అధ్యయనంచేసి, కర్తవ్యాలను గుర్తుచేసిన ఒకరిద్దరు విప్లవనాయకుల్లో డి.వి. ఒకడు. చివరిరోజుల్లో ఆయనకీ రంగాల్లో ఆసక్తి మరింత పెరిగిందన డానికి 'పడిసెల' రెండుసంచికల్లోనూ ఆయన ఉపరితల అంశాలపైరాసిన వ్యాసాలేనిదర్శనం. సాంస్కృతికరంగంలో మన కర్తవ్యాల గురించి కామ్రేడ్ డివి అభిప్రాయాలతో సృజనకు మమేకం లేకపోవచ్చును. అట్లాగే తెలంగాణారైతాంగ సాయుధపోరాట సమీక్ష విషయంలోనూ, తీసుకోదగిన పాఠాలవిషయంలోనూ ఇటీవల ఆయన విస్తృతంగారాస్తున్న వ్యాసాలు, చేస్తున్న విశ్లేషణతోకూడాపూర్తి ఏకీభావం లేక పోవచ్చు. కాని ఈ రెండు అంశాలపై కూడ ఆయన చాలాకాలంగా చేస్తున్న అధ్యయనం, కృషి విప్లవోద్యమం గణనలోకి తీసుకొని పరిశీలించదగినవి.

విప్లవోద్యమానికీ, విప్లవ సాంస్కృతికోద్యమానికీ కామ్రేడ్ డివి చేసిన సేవలను సృజన వినమ్రంగాస్మరించుకుంటుంది

— 'సాహితీ మిత్రులు'

వరంగల్ జైల్లో ఖైదీల పోరాటాన్ని బలపవచండి.

జైళ్ళలో వున్న వాళ్ళంతా నేరస్తులుకారు నూటికి ఎనభైమంది భూమి పం[illegible]ధమైన తగాదాలలో సంఘర్షణలలో జైలుకువచ్చేవాళ్ళే అవి వ్యక్తిగత స్థాయి [illegible]ంచి రాజకీయస్థాయి వరకు వుండవచ్చు కొందరు క్షణికావేశంలో నేరాలు చేసిన [illegible] కావచ్చు. ఆర్థిక, సామాజిక దృక్పథం నుంచే కాకుండా 'న్యాయశాస్త్ర' [illegible]రంగా 'చట్టబద్ధంగా' చూసినా శిక్షలు అనుభవిస్తున్నవాళ్ళు మినహాయిస్తే మిగతా [illegible]ళంతా 'నిందితులు', 'న్యాయస్థాన సంరక్షణ'లో వుండవలసినవాళ్ళు. వీళ్ళపై [illegible]రోపింపబడిన నేరం రుజువయ్యేదాకా వీళ్ళ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపా[illegible]లసిన పూర్తి బాధ్యత న్యాయస్థానాలది, జైళ్ళది. పైగా తాము 'నాగరిక' ప్రభు[illegible]వాలని చెప్పుకుంటున్నవి జైళ్ళను సంస్కరణనిలయాలని అభివర్ణిస్తున్నవి. నేర ప్రవృత్తిని తొలగించి మానవులుగా తీర్చిదిద్దుతామంటున్నవి.

వరంగల్ జైల్లో ఖైదీల ములాఖత్ కోసం వచ్చేవాళ్ళను, అంటే స్వేచ్ఛా [illegible]రులను అవమానకరంగా సెర్చ్ చేస్తున్నారు. ఖైదీలనయితే బట్టలూడదీసి చెక్ చేస్తున్నారు. ఇదివరలో జైలు ఆఫీసులో ఇంటర్వ్యూలు ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు బయటికే కిటికీకి ఇనుపజల్లెడ వంటి జాలీ అమర్చి లోపల ఖయిదీలను, బయటవాళ్ళ కోసంవచ్చే బంధువులను స్నేహితులను వుంచి ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అంటే ఖైదీ అయిన తండ్రి (నేరస్తుడేకానక్కర్లేదు) తన భార్య భుజంమీద బిడ్డను మునివేళ్ళతో కూడ తాకలేడు. ఖైదీ కూడ కాని తల్లి ఖైదులోవున్న తనకొడుక్కు పోలీస్ లాకప్పులో అయిన గాయాలను కళ్ళతోనైనచూడలేదు. భార్యాభర్తల గుండె చప్పుళ్ళ మధ్యన ఈ ఇనుపజల్లెడ.

ఈ 'జాలీములాఖతు' పద్ధతిరద్దుచేసి ఇదివరకులా జైలు ఆఫీసులోనే ఇంటర్వ్యూలు ఇవ్వాలని మందులు, విద్య, టెలివిజన్, బయటికి వెళ్ళేప్పుడు దినభత్యం ఎక్కువ ఇవ్వాలని ఇంకా ఇటువంటి సౌకర్యాలకోసం వరంగల్ జైల్లోని 800 మంది ఖయిదీలు జులై 31న నిరాహారదీక్ష ప్రారంభించారు. సాధారణ ఖయిదీల రెమిషన్ కోస్తామని బెదరించి, జాలీములాఖత్ నక్సలైట్లకేకాని మీకుకాదని బుజ్జగించి సమ్మెమానిపించారు. 60 మంది రాజకీయఖైదీలను రాజమండ్రి జెయిలుకు బదిలీచేసారు. ఆమరణ నిరాహార దీక్షచేస్తున్న రాజకీయఖైదీలలో కా. వెంకటేశ్వర్లు స్థితి సీరియస్‌గా వున్నట్టుతెలుస్తుంది

రోజులు, నెలల తరబడి పోలీసు లాకప్పులలో చిత్రహింసలకు గురిచేసి తప్పుడు కేసుల్లో ఇరికించి, బెయిలుపైగానీ, కేసులు కొట్టివేయబడిగానీ విడుదలయితే వాళ్ళు జైలుఆవరణలోనే అరెస్టు చేయడంకూడ వరంగల్ పోలీసులకు సర్వసాధారణమైపోయింది. అట్లాగే ఎస్కార్ట్ లేదని కేసు వాయిదాలకు కూడ తీసుకపోవడంలేదు. జైలులో, ఆవరణలో ఖయిదీలపై పోలీసులు చేస్తున్న ఈ 'రాజ్యాని'కి కోర్టు 'అసహాయ మౌనసాక్షి' కాగూడదని కూడ వీళ్ళు డిమాండ్‌చేస్తున్నారు.

ప్రతి ప్రజాస్వామ్యవాదీ బలపరచవలసిన న్యాయమైన కోర్కెలు ఇవన్నీ.

6.8.1984

SRJANA Telugu Monthly August '84 - H/HNK-3
Regd No. with Registrar of Newspapers 10953/67

ఆర్థికంగా, హార్దికంగా సృజనకు సహకరించండి.

న్యూస్‌ప్రింట్ కొరతవుండదు - అని కేంద్రప్రభుత్వ ప్రకటనలు రోజూ వస్తూనేవున్నాయి. న్యూస్‌ప్రింట్ రేట్లు 1980 జనవరినుంచి 84 జులై నాటికి 60-65 రూపాయలనుంచి 105 - 120 రూపాయలదాకా (సింగిల్‌రీమ్‌కు) పెరిగింది. అందువల్ల దిన పత్రికలతో సహా దేశంలోని పత్రికలన్నీ రేట్లు పెంచకతప్పలేదు.

18 సంవత్సరాల జీవితంలో (మాసపత్రికగా 14 సంవత్సరాలు) కేవలం 1977 నుంచి '79దాకా మాత్రమే సృజనకు న్యూస్‌ప్రింట్ కేటాయించబడింది. ఎమర్జెన్సీలో మినహాపత్రిక ఎప్పుడూ ఆగిపోలేదు. అయినా ఇందిరాపాలనలో సృజనకెప్పుడూ న్యూస్‌ప్రింట్ కోటాలేదు పైగా 80 జనవరినుంచి న్యూస్‌ప్రింట్ రేటు విపరీతంగా పెరుగుతున్నది.

ఈ మధ్యకాలంలో పోస్టేజిరేట్లు, ప్యాకింగు సామగ్రిరేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రింటింగుచార్జీలు, బ్లాక్‌మేకింగుచార్జీలు కూడరెట్టింపయ్యాయి. కేవలం నవత ప్రింటింగ్ ప్రెస్, వరంగల్ సహకారంవల్ల మాత్రమే నాలుగున్నర సంవత్సరాలుగా సృజన చందారేటు పెంచకుండా ఎన్ని ఆటుపోటులు వచ్చినా నడుపగలుగుతున్నది. ఏతొందరవుందో, ఇబ్బందివుందో హైదరాబాదు, విజయవాడలలో ముద్రించవలసివచ్చినా ఎంత ఇమ్మడి ఖర్చవుతున్నదో 84 జనవరి సంచిక అనుభవం పాఠకులు చదివే వుంటారు.

ఈ రెట్టింపయిన అన్ని రకాల ఖర్చులకు తోడుబకాయలు పేరుకొనిపోతున్న ఏజెంట్ల వైఖరి: తమకు కావలసిన కాపీలకు అడ్వాన్సు పంపడం అనే ఖచ్చితమైన పద్ధతితో ప్రారంభమై క్రమంగా వందల రూపాయల బకాయదగ్గర ఘనీభవిస్తుంది. అట్లాగేచాలమంది చందాదార్లు చందాఅయిపోయినా, సృజన రిమైండ్‌చేస్తూ అందుకున్నా రెన్యూ చేయించే శ్రద్ధవుండదు. ఈ అన్ని కారణాలతో సృజన నెలకు వెయ్యి రూపాయల నష్టంతో నడుస్తున్నది.

1. ఏజెంట్లు బకాయలు చెల్లించి క్రమంతప్పకుండా సృజన తెప్పించే బాధ్యత ఆయా ప్రాంతాల్లో పాఠకులే తీసుకోవాలి. లేదా సృజన పాఠకుల సర్కిల్స్ ఏర్పాటు చేసుకొని ఒకరిపూచీమీద తెప్పించుకోవాలి.
2. ఏజెంట్ల మీద ఆధారపడకుండా ఎక్కువగా చందాదార్లను చేర్పించాలి.
3. మీకు తోచిన రీతిలో ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తిచేస్తున్నాం

— 'సాహితీమిత్రులు'

SRJANA
Hanumakonda 506001

This issue Rs. 3-00
Yearly Subscription Rs. 20-00